సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 223

శుక్రవారం 4-11-2022


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ
విద్యా సలహాదారుగా నియమించిన
ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారికి
కృతజ్ఞతలు

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గత పుష్కర కాలంగా
మీరు నా ధైర్యం
మీరు నా కర్తవ్యం
మీరు నా దిక్సూచి

విద్యను సమూల ప్రక్షాళన చేసే మహోత్తర
యజ్ఞంలో నన్ను కూడా భాగస్వామిని చేస్తూ
రాష్ట్ర విద్యా సలహాదారుగా బాధ్యతలు
అప్పగించిన మీకు శతకోటి నమస్సులు

ఎప్పటికీ మీ విధేయుడు
ఆలూరు సాంబశివారెడ్డి
రాష్ట్ర విద్యా సలహాదారు,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.



చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేస్తూ పేద విద్యార్థుల నాణ్యమైన
విద్యకు చివరిదాకా భరోసా ఇస్తున్న **ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు.**
ఈ బృహత్కర లక్ష్య సాధనలో భాగస్వామిగా నేడు ప్రభుత్వ సలహాదారు (విద్య) బాధ్యతలు
చేపడుతున్న మా మిత్రుడు **శ్రీ ఆలూరు సాంబశివా రెడ్డి గారికి శుభాకాంక్షలు.**

With Best Wishes

N RAM KUMAR N B K R Institute of Science & Technology, Vidyanagar, Nellore	**C GANGI REDDY** **C ABHISHEK REDDY** Annamacharya group of institutions. YSR Kadapa, Rajampet, Tirupati	**P SUBBA REDDY** G Pulla Reddy Engineering College, Kurnool	**M V KOTESWARA RAO** Narasaraopeta Engineering College, Narasaraopeta	**G V M MOHAN KUMAR** G Pullaiah & Ravindra College of Engineering, Kurnool	**MADDISETTY SRIDHAR** PACE Institue of Technology & Science, Ongole
DADI RATNAKAR Dadi Institute Of Engineering and Technology, Anakapalle	**V JAYACHANDRA REDDY** Chaitanya Bharathi Institute of Technology, Proddatur	**G RAGHUNATHA REDDY** GATES Institute of Technology, Gooty	**S VENKATA RAMI REDDY** SVR Engineering College, Nandyal	**MANAGEMENT & STAFF** Lakkireddy Balireddy College of Engineering, Mylavaram, NTR District.	**RAVURI V SRINIVAS** Sri Venkateswara College of Engineering & Technology, Chittor
VIJAY REDDY Sanskrithi School of Engineering, Puttaparthi	**M ANANTHA RAMUDU** Ananthalakshmi Group of Institutions, Ananthapuramu	**N S KALYAN CHAKRAVARTHY** QIS College of Engineering & Technology, Ongole	**K VENUGOPAL** Ramachandra College of Engineering, Eluru	**N SATISH REDDY** Aditya Group of Institutions, Kakinada	**K SASI KIRAN VARMA** Godavari Institute of Engineering & Technology, Rajahmundry
VASIREDDY VIDYASAGAR Vasireddy Venkatadri Institute of Technology, Guntur	**R VENKATA RAO** NRI Group of Colleges, Vijayawada	**M SRINIVASA BABU** MVR College of Engineering & Technology, NTR Dist	**MUPPALANENI SRINIVASA RAO** **MANAM NAGESWARA RAO** Bapatla Engineering College, Bapatla	**BONAM KRISHNA SATHISH** **BONAM KANAKAYYA** BVC Group of Institutions, Amalapuram	**V V NAGESWARA RAO** Aditya Institute of Technology & Management, Srikakaulam
P KRISHNA RAO Pragati Engineering College, Surampalem, Kakinada	**N SUDHAKAR REDDY** Geethanjali Institute of Science & Technology, Nellore	**A PRAKASH** SV College of Engineering, Tirupathi	**MANAGEMENT AND STAFF** Sri Venkateswara Institute of Technology Anantapur	**G RAJLING** Lingayas Institute of Management and Technology, Vijayawada.	**K RAMESH BABU** **K RAMA MOHAN RAO** Amrita Sai Institute of Science & Technology, Vijayawada.


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి, అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 223

శుక్రవారం 4-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పాక్ ఆశలు సజీవం

టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై 33 పరుగుల తేడాతో విజయం - 13లో



వావ్...వాట్సాప్

ఒకేసారి 32 మందితో వీడియో కాలింగ్.. ఫైల్ ట్రాన్స్‌ఫర్‌తో కొత్త అప్‌డేట్ - 13లో



ఈడీ విచారణకు సోరెన్ గైర్హాజరు

అక్రమ మైనింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ గైర్హాజరయ్యారు.

వివరాలు 6లో



అవినీతిపరుల్ని వదిలి పెట్టొద్దు

అవినీతిపరులను వదిలి పెట్టవద్దని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, అవినీతి నిరోధక శాఖలకు ప్రధాని మోదీ సూచించారు.


వివరాలు 6లో



ఢిల్లీ స్కూళ్లలో ఔట్‌డోర్ బంద్

వాయు కాలుష్యం పెరగడంతో పాఠశాలల ప్రాంగణాల్లో ఆటపాటలను నిర్వహించకుండా పాఠశాలలు నిర్ణయం తీసుకున్నాయి.

వివరాలు 6లో



ఇమ్రాన్‌ఖాన్‌పై కాల్పులు

పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌పై కాల్పులు జరిగాయి. తీవ్ర గాయాలపాలై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వివరాలు 6లో

విద్యలో అగ్రగామి ఏపీ

తొలిసారి 'లెవల్-2' సాధించిన ఆంధ్రప్రదేశ్

- ఏపీ, కేరళతో పాటు మరో 5 రాష్ట్రాలకు లెవల్-2
- దేశంలో ఏ ఒక్క రాష్ట్రానికీ దక్కని లెవల్-1
- 2020-21కి రాష్ట్రాల పనితీరు గ్రేడింగ్ విడుదల చేసిన కేంద్రం
- 2017 నుంచి 2019 వరకూ లెవల్ 6లో ఏపీ
- చిత్తశుద్ధితో విద్యారంగాన్ని సంస్కరిస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఫలితంగా నాలుగు స్థాయిలు ఎగబాకి ఏకంగా లెవల్-2కు



సాక్షి, న్యూఢిల్లీ: 'పిల్లలకు మనమిచ్చే ఆస్తి చదువే' అని మనసా వాచా నమ్మి... విద్యా రంగంలో ఊహించని మార్పులు తెస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి సత్ఫలితాలనిస్తోంది. విద్యా రంగంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న అగ్రశ్రేణి రాష్ట్రాల సరసన ఆంధ్రప్రదేశ్ సగర్వంగా నిలిచింది. 2019లో రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టేనాటికి విద్యారంగంలో లెవల్-6లో ఉన్న ఆంధ్రప్రదేశ్... ఆ తరువాత రెండేళ్లకే ఏకంగా లెవల్-2కు చేరుకుంది. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను వివిధ పథకాల్లో భాగస్వాములను చేస్తూ... స్కూళ్ల రూపురేఖలు మార్చటం దగ్గర నుంచి విద్యార్థుల పుస్తకాలు, భోజనం, స్కూలు బ్యాగులు, షూ, యూనిఫారాలు అన్నింటా నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారిని చేయి పట్టుకుని నడిపిస్తున్న తీరు... కేంద్ర విద్యా శాఖ తాజాగా విడుదల చేసిన పెర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో ప్రస్ఫుటమయ్యింది. కార్పొరేట్ స్కూళ్లలో సైతం కొన్నింటికి మాత్రమే అందుబాటులో ఉన్న ఎడ్యుటెక్ విద్యను 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు

మిగతా 2వ పేజీలో ▶

ఏపీకి ఏయే అంశాల్లో ఎన్నెన్ని పాయింట్లు

ఆంధ్రప్రదేశ్‌కు లెర్నింగ్ అవుట్‌కమ్, క్వాలిటీలో 180గానూ 154 పాయింట్లు , విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ రేషియో 80గానూ 77, మౌలికసదుపాయాల్లో 150గానూ 127, సమానత్వంలో 230కి గానూ 210, పాలన యాజమాన్యంలో 360కిగానూ 334 పాయింట్లు దక్కాయని కేంద్రం తెలిపింది.

విద్యారంగాన్ని దెబ్బతీస్తారా?

ప్రభుత్వ స్కూళ్ల పిల్లలు, తల్లిదండ్రుల స్థైర్యం దెబ్బతినేలా ఏమిటీ రాతలు?: సీఎం జగన్

- ప్రభుత్వ విద్యారంగానికి వ్యతిరేకం కాబట్టే ఇలాంటి తప్పుడు వార్తలు
- రామోజీరావు, ఈనాడుకు జగన్ అంటే గిట్టకనే అసత్య కథనాలు
- నన్ను ఇబ్బంది పెట్టాలని విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు
- డిసెంబర్‌లో రెండో సెమిస్టర్ ప్రారంభమని అకడమిక్ క్యాలెండర్‌లోనే ఉంది
- సెమిస్టర్ రాకుండానే ఇంకా పుస్తకాలివ్వలేదంటూ ప్రభుత్వంపై దుష్ప్రచారం
- చరిత్రలో తొలిసారిగా బడులు తెరిచిన తొలిరోజే విద్యాకానుక కిట్లు ఇస్తున్నాం
- 3 నుంచి 10వ తరగతి వరకు సబ్జెక్ట్ టీచర్లతో బోధన
- తాజాగా పీజీఐ ర్యాంకింగ్‌లో ఏపీకి ఉన్నత స్థానం.. ఫలిస్తున్న విద్యారంగ సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు

2లో

'అయ్యన్న' అరెస్టు

ఫోర్జరీ కేసులో ఆయన తనయుడు కూడా..

- వేకువజామున 3గంటలకు అయ్యన్న ఇంటికి చేరుకున్న సీఐడీ పోలీసులు
- వారితో మాజీమంత్రి వాగ్వాదం.. విశాఖలో సీఐడీ కార్యాలయానికి తరలింపు.. విచారణ
- అనంతరం సింహాచలం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు
- అయ్యన్నను కోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- సాంకేతిక కారణాలతో రిమాండ్ రిపోర్టును తిరస్కరించిన కోర్టు
- దీంతో స్టేషన్ బెయిల్ మంజూరు చేసిన పోలీసులు



అయ్యన్నకు అరెస్టు నోటీసు అందజేస్తున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ, పోలీసులు

నర్సీపట్నం/ఆరిలోవ (విశాఖ తూర్పు)/సాక్షి, అమరావతి: ఫోర్జరీ కేసులో మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన తనయుడు రాజేష్‌ను సీఐడీ పోలీసులు అరెస్టుచేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం శివపురంలోని ఆయన నివాసానికి సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో సీఐడీ పోలీసులు, స్థానిక పోలీసులు గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అయ్యన్నపాత్రుడు ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి ఆయన ఇద్దరు కుమారుల పేరుపై ఐదేళ్ల కిందట ఇళ్లు నిర్మించారు. అక్రమ నిర్మాణాన్ని గుర్తించిన అధికారులు గతంలో దానిని తొలగించే ప్రయత్నం చేశారు. అప్పట్లో రెవెన్యూ అధికారుల సమక్షంలో కూల్చేందుకు సిద్ధంకాగా అయ్యన్న కుటుంబం, టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీనిపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో.. అయ్యన్నపాత్రుడు ఆయన కుమారులు తప్పుడు ఎన్‌ఓసీ సర్టిఫికెట్ సృష్టించి ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించారని సంబంధిత అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై సీఐడీ పోలీసులు గురువారం తెల్లవారుజామున అయ్యన్నపాత్రుడు ఇంటికి చేరుకున్నారు. వెంటనే ఇంటి తలుపులు తీయకపోవడంతో

మిగతా 3వ పేజీలో ▶

అయ్యన్న నేరాలకు బీసీలకు సంబంధమేంటి?

- తప్పుడు పత్రాలతో ఆయన రికార్డులను ట్యాంపర్ చేశారు
- ఇరిగేషన్ ఈఈ ఫిర్యాదు ఆధారంగానే విచారణ.. అరెస్టు
- ఆరోపణలు వచ్చినప్పుడు నిరూపించుకోవాలి
- టీడీపీ నేతలు గగ్గోలు ఆపాలి
- చంద్రబాబుది వెకిలివాగుడు
- మంత్రులు ముత్యాలనాయుడు, జోగి రమేశ్, చెల్లుబోయిన, మాజీమంత్రి కొడాలి నాని, ఎమ్మెల్సీ దువ్వాడ కౌంటర్

3లో

ఆంధ్రప్రదేశ్‌లో అస్సాగో బయో ఇథనాల్ ప్లాంట్

- రాజమహేంద్రవరం వద్ద రూ.270 కోట్లతో రోజుకు 200 కేఎల్‌పీడీ సామర్థ్యంతో ఏర్పాటు
- 20 ఎకరాల్లో ఏర్పాటవుతున్న ఈ యూనిట్ ద్వారా 500 మందికి ఉపాధి
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన

14లో



ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఎం జగన్

చల్లా కుటుంబానికి సీఎం పరామర్శ

- ఎమ్మెల్సీ భగీరథరెడ్డి భౌతికకాయానికి నివాళులు
- ఆత్మీయ స్నేహితుడిని కోల్పోవడం తీవ్ర లోటని సీఎం విచారం
- అండగా ఉంటామని భగీరథ కుటుంబ సభ్యులకు ఓదార్పు

2లో

రూ.73 కోట్లతో కాకినాడ పోర్టు అభివృద్ధి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. పోర్టులకు అనుబంధంగా 9 ఫిషింగ్ హార్బర్లు
- ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ వెంకటరెడ్డి

2లో



ఎమ్మెల్యేలను కొంటుంటే చేతులు ముడుచుకోవాలా?



- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని న్యాయవ్యవస్థకు చేతులు జోడిస్తున్నా: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్
- ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ప్రధాని అనడం ఏ తరహా రాజనీతి?
- తెలంగాణ, ఏపీ, ఢిల్లీ, రాజస్తాన్ ప్రభుత్వాలను కూల్చే యత్నాలు

సాక్షి, హైదరాబాద్: 'దేశం కోసం చావాల్సి వస్తే అందుకు సిద్ధం. న్యాయ వ్యవస్థకు చేతులు జోడించి కోరుతున్నా. ఎమ్మెల్యేల కొనుగోలుకు రూ.వేల కోట్ల డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయో, ఎవరిస్తున్నారో తేల్చాలి. మా ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తామంటూ, మా రాజధానిలో వ్యవహారం నడిపితే చేతులు ముడుచుకుని కూర్చుని, అరాచకాలను భరించాలా? ఎమ్మెల్యే కొనుగోలు అంశాన్ని సింగిల్ కేసుగా చూడకూడదనే ఉద్దేశంతోనే ఎన్నికల సంఘంతో సహా దేశంలోని అత్యున్నత వ్యవస్థలు, సంస్థలకు ఆధారాలు పంపిస్తున్నాం. దీని కథేంటో తేల్చాలి' అని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణలో కలకలం రేపిన 'ఎమ్మెల్యేలకు ఎర' ఘటనపై


మిగతా 10వ పేజీలో ▶



మునుగోడులో పోటెత్తిన ఓటర్లు

తెలంగాణలోని మునుగోడు నియోజకవర్గానికి గురువారం జరిగిన ఉప ఎన్నికలో ఓటర్లు పోటెత్తారు. 92 శాతం మేరకు పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ బూత్‌లకు భారీగా వచ్చారు. 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి కూడా భారీగా క్యూలైన్లలో నిలబడ్డారు. ఈ నెల 6న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.

10లో



మరింత ఆధునికంగా..

- నెల్లూరు, వైజాగ్, తిరుపతి రైల్వేస్టేషన్‌లు
- పనులు పురోగతిలో ఉన్నాయని రైల్వేశాఖ వెల్లడి

14లో

రెండు దశల్లో గుజరాత్ ఎన్నికలు

షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

- డిసెంబర్ 1న తొలి దశ, 5న రెండో దశ
- హిమాచల్‌ప్రదేశ్‌తోపాటు 8న ఓట్ల లెక్కింపు
- 100 శాతం నిష్పక్షపాతంగా గుజరాత్ ఎన్నికల షెడ్యూల్
- సీఈసీ రాజీవ్ కుమార్ స్పష్టీకరణ

6లో



అసెంబ్లీ 'ఉప' పోరు ప్రశాంతం

- దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గురువారం ఉప ఎన్నికలు జరిగాయి. మహారాష్ట్రలోని అంధేరి (తూర్పు), తెలంగాణలోని మునుగోడు, బిహార్‌లోని మొకామా, గోపాల్‌గంజ్, హరియాణాలోని ఆదంపూర్, యూపీలోని గోలా గోరఖ్‌నాథ్, ఒడిశాలోని ధామ్‌నగర్ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ నెల 6న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

క్లుప్తంగా

ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పోసాని కృష్ణమురళి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ) చైర్మన్‌గా ప్రముఖ నటుడు, దర్శకుడు పోసాని కృష్ణమురళిని ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సమాచార, పౌర సంబంధాల శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ టి.విజయ్ కుమార్‌రెడ్డి గురువారం జారీ చేశారు. ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ చైర్మన్‌గా పోసాని నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా కొమ్మినేని శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం సాధారణ పరిపాలన విభాగం (రాజకీయ) ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజు జారీ చేశారు. ఈ నెల 7 నుంచి కేబినెట్ హోదాతో రెండేళ్ల పాటు ఈ పదవిలో కొమ్మినేని కొనసాగనున్నారు.

7 వరకు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదుకు గడువు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పట్టభద్రులు, టీచర్ల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదుకు ఈ నెల ఏడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఓటర్ల నమోదుపై గురువారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం-విజయనగరం- విశాఖ పట్టభద్రుల నియోజకవర్గం, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలు, కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల నమోదుకు ఈ నెల 7 వరకు దరఖాస్తులు స్వీకరించి, 23వ తేదీన ముసాయిదా జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఒకవేళ ఏడో తేదీలోపు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోలేని అభ్యర్థులు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తున్న ఈ నెల 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ మధ్యకాలంలో ఫారం 18/19 పూర్తి చేయడం ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేక ఓటర్ల సవరణ ముసాయిదా జాబితాను ఈ నెల 9న విడుదల చేస్తామని తెలిపారు.

రూ.73 కోట్లతో కాకినాడ పోర్టు అభివృద్ధి



మాట్లాడుతున్న ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ వెంకటరెడ్డి. చిత్రంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ జిల్లా కాకినాడ పోర్టులో రూ.73 కోట్లతో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవుల అభివృద్ధి ద్వారా వాటిపై ఆధారపడిన రంగాలు, ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచి ఆదాయ వనరులు పెంచడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. ప్రైవేటు పోర్టులకు దీటుగా ప్రభుత్వ నిర్వహణలోని రేవులను అభివృద్ధి చేయడంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రామాయంపేట పోర్టుకు ఇటీవలే శంకుస్థాపన చేశారని, భావనపాడు, బందరు పోర్టులు అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. మత్స్యకార వర్గాలను దృష్టిలో ఉంచుకుని పోర్టులకు అనుబంధంగా 9 ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. ఇప్పటికే ఐదు పూర్తయి.. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటు, కృషి వల్ల చరిత్రలోనే తొలిసారిగా పోర్టును భారీగా నిధులు వెచ్చించి అభివృద్ధి చేయగలుగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని దెబ్బతీస్తారా?

ప్రభుత్వ స్కూళ్ల పిల్లలు, తల్లిదండ్రుల స్థైర్యం దెబ్బతినేలా ఏమిటీ రాతలు?: సీఎం జగన్



తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యార్థులందరినీ ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేలా నాణ్యమైన బోధనకు విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా కునారిల్లిపోయిన ప్రభుత్వ విద్యారంగం, ప్రభుత్వ విద్యాసంస్థలను దేశంలోనే అత్యున్నతమైనవిగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పునాది పటిష్టంగా ఉంటేనే ఉన్నత స్థాయిలో విద్యార్థులు రాణించగలుగుతారని, అందుకోసమే పునాది విద్య, ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఫౌండేషనల్, ప్రైమరీవిద్యకు పెద్దపీట వేసిన రాష్ట్రం మనదేనని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే కాకుండా చదువుకునేందుకు అవసరమైన అన్ని వస్తువులను విద్యా కానుక ద్వారా అందిస్తున్నామన్నారు. విద్యాశాఖపై సీఎం జగన్ గురువారం క్యాంపు కార్యాలయంలో ఉన్నత సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలివీ..

స్కూళ్లు తెరిచిన తొలిరోజే..

'రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పాఠశాలలు ప్రారంభమయ్యే తొలిరోజే విద్యాకానుక కిట్‌లు అందిస్తున్నాం. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులుండాలన్న ఉద్దేశంతో స్టూడెంట్ కిట్లలో స్కూల్ బ్యాగు, బైలింగ్యువల్ (ద్విభాషా) పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, షూ, సాక్సులు, బెల్టు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందచేస్తున్నాం. వీటన్నింటినీ ఒకేసారి పిల్లలకు స్కూల్ ప్రారంభించే తొలిరోజే ఇస్తున్నాం. గతంలో స్కూల్ పిల్లలకు సెప్టెంబరు, అక్టోబరు వరకు కూడా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేని దుస్థితి. ఆ విధానంలో మార్పు తెచ్చి స్కూల్ ప్రారంభించిన తొలిరోజే పాఠ్యపుస్తకాలు ఇతర మెటీరియల్ అందిస్తున్నాం. గతానికి ఇప్పటికీ ఉన్న పెద్ద తేడా ఇదీ' అని సీఎం వివరించారు.

పేద పిల్లలకు పెద్ద చదువులు అందకుండా దుష్ప్రచారం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వ స్కూళ్ల పిల్లలు, తల్లిదండ్రుల నైతిక స్థైర్యం దెబ్బ తీసేందుకు తప్పుడు వార్తలతో గందరగోళ పరిచే యత్నాలు చేస్తున్నాయని సీఎం జగన్ మండిపడ్డారు. 'ఇంగ్లీషు మీడియం, ప్రభుత్వ విద్యారంగానికి వారు తొలినుంచి వ్యతిరేకం కాబట్టి ఇలాంటి తప్పుడు వార్తలు రాసి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాసే ఆ మీడియా సంస్థలు, విపక్షం కలసి పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు అధికంగా ఆధారపడే ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కుట్రలు చేస్తున్నాయి. పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియం చదువులు అందడం వాళ్లకి ఇష్టం లేదు. అందుకే ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారు' అని సీఎం విమర్శించారు.

యుద్ధం చేస్తున్నాం..

విద్యారంగంలో తెచ్చిన సంస్కరణల ఫలితాలు రాత్రికి రాత్రి వచ్చేయవు. ఇపుడిప్పుడే క్రమంగా వస్తున్న ఫలితాలు పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుతాయి. 45 వేల స్కూళ్లను బాగు చేయాలంటే కనీసం 3 నుంచి 4 ఏళ్లు పడుతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే అయినా దురదృష్టవశాత్తూ కొన్ని మీడియా సంస్థలు, ప్రతిపక్షాలు వ్యతిరేక వార్తలు, వ్యతిరేక రాజకీయాలతో మంచిని అడ్డుకునే యత్నం చేస్తున్నారు. వారి స్వార్థ రాజకీయాల కోసమే ఇదంతా చేస్తున్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకోవాలి. మనం వీటన్నింటితో యుద్ధం చేస్తున్నాం.

పిల్లల భవిష్యత్తుతో ఆటలొద్దు..

రాజకీయంగా జగన్‌ను ఇబ్బంది పెట్టాలి కాబట్టి అసత్యాలతో ఇలాంటి తప్పుడు కథనాలు రాస్తున్నారు. రాజకీయంగా జరుగుతున్న ఈ యుద్ధంలో దురదృష్టవశాత్తూ సామాన్యులు, తల్లిదండ్రులు, బడిపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. వారి స్థైర్యం దెబ్బతినేలా నిరంతరం కథనాలు రాస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అంటే రామోజీరావుకు, ఈనాడుకు ఇష్టం లేదు. అంత మాత్రాన పిల్లల భవిష్యత్తుతో ఆడుకోవడం తప్పు. ఇలా తప్పుడు వార్తలు రాయకూడదు.

\- సమీక్షలో అధికారులతో సీఎం జగన్

రెండో సెమిస్టర్ రాకుండానే పుస్తకాలా?

పాఠ్యపుస్తకాల సరఫరాపై ప్రభుత్వ వ్యతిరేక మీడియాలో వెలువడ్డ తప్పుడు కథనాల అంశం సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. రెండో సెమిస్టర్ మొదలైనా పుస్తకాలు అందలేదంటూ తప్పుడు కథనాలు ప్రచురించటాన్ని అధికారులు ఖండించారు. డిసెంబరులో రెండో సెమిస్టర్ ప్రారంభం అవుతుందని, అలాంటిది ఇప్పుడే పుస్తకాలు అందలేదని రాయడం కచ్చితంగా ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. డిసెంబర్‌లో రెండో సెమిస్టర్ ప్రారంభం అవుతుందన్న విషయాన్ని అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్నామని ప్రస్తావిస్తూ ఇది తెలిసి కూడా తప్పుదోవ పట్టించే కథనాలు ప్రచురించారని అధికారులు సీఎంకు వివరించారు. ఇది వారి దురుద్దేశాలను తేటతెల్లం చేస్తోందని సీఎం వ్యాఖ్యానించారు. 'మన ప్రభుత్వం రాగానే పాఠ్యప్రణాళికలో సమూల మార్పులు తెచ్చాం.

పటిష్టంగా సబ్జెక్ట్ టీచర్ల కాన్సెప్ట్

విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యల్లో భాగంగా మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధనకు వీలుగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సీఎం గుర్తు చేశారు. 'గతంలో క్లాస్ టీచర్‌కే అవకాశం లేని పరిస్థితుల నుంచి సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ తెస్తున్నాం. పాఠ్యాంశాలను అదే సబ్జెక్టులో నిపుణుడైన టీచర్ బోధించే పరిస్థితి గతంలో లేదు. సబ్జెక్టు టీచర్ కాన్సెప్ట్ పేరుతో సంస్కరణలు తెచ్చాం. మూడు నుంచి 10వ తరగతి వరకూ సబ్జెక్ట్ టీచర్స్ కాన్సెప్ట్ సమర్థంగా అమలు చేయాలి' అని అధికారులను సీఎం ఆదేశించారు.

అదనపు సమాచారం, బైలింగ్యువల్ కాన్సెప్ట్ వల్ల పాఠ్య పుస్తకాల సైజు పెరిగింది. బైలింగ్యువల్ టెక్స్ట్‌బుక్స్‌లో ఒక పేజీ తెలుగు, ఒక పేజీ ఇంగ్లీషు ఉంటుంది. దీంతో సాధారణంగానే టెక్స్ట్‌బుక్స్ సైజు పెరుగుతుంది. వాటిని సెమిస్టర్ వారీగా విభజించి పంపిణీ చేస్తున్నారు. దీన్ని వక్రీకరించి పిల్లలు, తల్లిదండ్రుల్లో ఆందోళన రేకెత్తించేలా తప్పుడు వార్తలు రాస్తున్నారు' అని సీఎం పేర్కొన్నారు.

తల్లిదండ్రుల్లో నమ్మకం..

'మనం అధికారంలోకి రాకముందు 2018–19లో ప్రభుత్వ స్కూళ్లలో 37 లక్షల మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం 42 లక్షల మంది ఉన్నారు. కోవిడ్ టైంలో కూడా మనం ఈ సంఖ్య చేరుకున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో అమలు చేస్తున్న సంస్కరణల ఫలితాలు క్రమంగా వస్తున్నాయి. ప్రస్తుతం నాడు – నేడు కార్యక్రమం 15 వేల స్కూళ్లలో జరిగింది. ఈ ఏడాది సుమారు మరో 22 వేల స్కూళ్లలో, ఆ తర్వాత సంవత్సరం మిగిలిన స్కూళ్లలో జరుగుతుంది. ఇది దశలవారీగా జరిగే ప్రక్రియ. దీనికి మరో 3–4 సంవత్సరాలు పడుతుంది. ఈ పనులన్నీ పూర్తయితే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెరుగుతుంది. ప్రభుత్వం ఈ పనులు చేపట్టి తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని కలిగించింది. నాడు–నేడులో చివరి ప్రక్రియ తరగతి గదుల డిజిటలైజేషన్. అది జరిగితే నాడు – నేడు పూర్తయినట్లు' అని సీఎం పేర్కొన్నారు.

గత నిర్ణయాల్లో పురోగతి ఇలా

గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు ప్రగతిని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. బైజూస్ కంటెంట్‌ను పాఠ్య ప్రణాళికలో పొందుపరుస్తున్నామని, ఆఫ్ లైన్‌లోనూ ట్యాబ్‌లు వినియోగించుకునేందుకు వీలుగా కంటెంట్ ప్రీలోడ్ చేస్తున్నామని వివరించారు. 2023 ఏప్రిల్‌లోగా తరగతి గదుల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించామన్నారు. మధ్యాహ్న భోజనానికి సార్టెక్స్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, మెనూలో కూడా మార్పుచేర్పులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. గుడ్లు పాడైపోకుండా పాటించాల్సిన పద్ధతులపై ఎస్‌వోపీలు రూపొందించినట్లు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్ ప్రకారం విద్యాకానుక వస్తువుల కొనుగోలు ప్రక్రియను ముందే చేపట్టామని వివరించారు. ఫేజ్– 2 కింద 22,344 పాఠశాలల్లో నాడు–నేడు పనులు కొనసాగుతున్నాయన్నారు.

ప్రతి తరగతీ డిజిటలైజేషన్

స్కూళ్లలో ప్రతి తరగతి గది డిజిటలైజేషన్ కావాలని సీఎం సూచించారు. 'విద్యారంగంలో పెడుతున్న ఖర్చును మానవ వనరుల మీద వెచ్చిస్తున్న అతి పెద్ద పెట్టుబడి కింద భావించాలి. ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేద పిల్లలకు మంచి భవిష్యత్ అందించాలన్నదే మన లక్ష్యం. అప్పుడే వారి జీవితాల్లో మార్పు వస్తుంది. పేదరికం నుంచి బయటపడతారు. విద్య ద్వారా మాత్రమే ఇది సాధ్యం. విద్యారంగంలో చేపడుతున్న మార్పుల విషయంలో రాజీ పడొద్దు. ఈ విషయంలో ఎలాంటి వెనుకడుగు వేయాల్సిన పనిలేదు' అని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. జగనన్న గోరుముద్ద అమలు ప్రక్రియ పక్కాగా ఉండాలని ఆదేశించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కనిపించాలని, మరుగుదొడ్లు, ఇతర పారిశుధ్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ (ఎస్ఎంఎఫ్), టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ (టీఎంఎఫ్) వినియోగించుకొని వీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు.

నాడు-నేడు స్కూళ్లకు సీబీఎస్ఈ గుర్తింపు

నాడు–నేడు కింద అభివృద్ధి చేస్తున్న ప్రతి స్కూలుకూ సీబీఎస్ఈ గుర్తింపు ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇప్పటివరకు 1,000 స్కూళ్లకు సీబీఎస్ఈ అఫిలియేషన్ వచ్చిందని అధికారులు వివరించారు. 2024–25లో సీబీఎస్ఈ పరీక్షలు రాయనున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని బోధనలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

పీజీఐ ర్యాంకింగ్‌లో ఏపీకి ఉన్నత స్థానం

కేంద్ర విద్యాశాఖ వెలువరించిన పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ)లో అగ్రశ్రేణి రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ నిలవడం గర్వకారణమని సీఎం జగన్ పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. పాఠశాల విద్య పనితీరు సూచికల్లో రాష్ట్రం అద్భుత పనితీరు కనపరచిందన్నారు. పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగాలలో 2020–21 పనితీరు గ్రేడింగ్ సూచీలను (పీజీఐ) కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రాల వారీగా పాఠశాల విద్యావ్యవస్థను విశ్లేషించేందుకు ఇది సాక్ష్యాధారిత ప్రత్యేక సూచీగా నిలుస్తుంది. మొత్తం 70 ఇండికేటర్ల ప్రాతిపదికన 1,000 పాయింట్లను నిర్దేశించారు. ఫలితాలు, పాలనా యాజమాన్యం అనే రెండు కేటగిరీలుగా విభజించారు. వీటిని మళ్లీ అభ్యాస ఫలితాలు, లభ్యత, మౌలిక సదుపాయాలు, ఈక్విటీ, పాలన ప్రక్రియకు సంబంధించిన ఐదు డొమైన్లుగా విభజించి పాయింట్లు కేటాయించారు. ఇందులో 950 పాయింట్లు సాధించే రాష్ట్రం లెవల్–1లో ఉంటుంది. అయితే లెవల్–1 జాబితాలో ఏ రాష్ట్రమూ లేదు. 901 నుంచి 950 మధ్య స్కోరు సాధించిన లెవల్–2 రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలు, విప్లవాత్మక మార్పుల ఫలితంగా రాష్ట్రం ఈ జాబితాలో చోటు దక్కించుకుంది. ఏపీ తొలిసారిగా లెవల్–2 చేరుకోవడం గమనార్హం. గతంలో ఎప్పుడూ ఈ స్థాయికి చేరుకోలేదు. ఇలాంటి ప్రగతి సాధించేందుకు కృషి చేసిన అధికారులను సమావేశంలో సీఎం జగన్ ప్రత్యేకంగా అభినందించారు.

చల్లా కుటుంబానికి సీఎం పరామర్శ

- ఎమ్మెల్సీ భగీరథరెడ్డి భౌతిక కాయానికి నివాళులు
- ఆత్మీయ స్నేహితుడిని కోల్పోవడం తీవ్ర లోటని సీఎం విచారం
- అండగా ఉంటామని భగీరథ కుటుంబ సభ్యులకు ఓదార్పు





చల్లా భగీరథరెడ్డి తల్లి శ్రీదేవి, భార్య శ్రీలక్ష్మిని ఓదారుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సీఎం జగన్ గురువారం సాయంత్రం అవుకు చేరుకుని భగీరథరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, అధికారులతో కలసి సీఎం నేరుగా చల్లా నివాసానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రిని చూడగానే భగీరథరెడ్డి తల్లి శ్రీదేవి, సతీమణి శ్రీలక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. దేవుడు తమకు అన్యాయం చేశాడని చిన్న వయసులోనే భగీరథను తీసుకెళ్లాడని విలపించారు. వారిని ఓదార్చిన సీఎం జగన్ చల్లా కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇటీవలే ఆళ్లగడ్డ సభకు వచ్చిన భగీరథను ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీసినట్లు గుర్తు చేసుకున్నారు. త్వరలోనే కలుస్తానని తనతో చెప్పాడని ఇంతలోనే భగీరథ లేడనే వార్త వినాల్సి వచ్చిందని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కంటే ముందు భగీరథ తనకు ఆత్మీయ స్నేహితుడని, చిన్న వయసులో ఈ పరిస్థితి రావడం బాధాకరమన్నారు. భగీరథ పిల్లలు రాజ్యాభిషేక్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలను దగ్గరికి తీసుకుని ఓదార్చారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని పిలిచి భగీరథ కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడాలని సీఎం ఆదేశించారు.

నేడు అంత్యక్రియలు

చల్లా భగీరథరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం అవుకులో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అవుకుతో పాటు బనగానపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు భగీరథ పార్థివదేహాన్ని చూసి కంట తడి పెట్టారు. భగీరథకు నివాళులర్పించిన వారిలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రామిరెడ్డి, శిల్పా రవి, హఫీజ్‌ఖాన్, గంగుల బిజేంద్రారెడ్డి, కంగాటి శ్రీదేవి, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆర్థర్, ఎమ్మెల్సీలు వెన్నపూసగోపాల్‌రెడ్డి, ఇసాక్, రమేశ్ యాదవ్, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, నీటిపారుదలశాఖ కార్పొరేషన్ చైర్మన్ కర్రా గిరిజ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులు

సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ శ్రేణులు నివాళులర్పించాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పేర్కొన్నారు.

చల్లా కుటుంబానికి దెబ్బపై దెబ్బ

భగీరథ మృతికి కారణాలను ఆయన సతీమణి వివరించారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సోకిందన్నారు. అయ్యప్ప మాల ధరించిన భగీరథ శబరిమల వెళ్లి వచ్చిన తర్వాత తరచూ దగ్గే వాడని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటంతో ఆస్పత్రికి వెళ్లామన్నారు. వెంటిలేటర్‌పై చికిత్స అందించినా పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారని విలపించారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న చల్లా రామకృష్ణారెడ్డిని ఏడాదిన్నర కిందట కోవిడ్‌తో కోల్పోయామని, ఇంతలోనే కుమారుడు దూరం కావడం తమకు కోలుకోలేని దెబ్బ అని భగీరథ తల్లి రోదించారు.

విద్యుత్ ప్రమాద మృతుల కుటుంబాలకు
పరిహారం పంపిణీ

- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.2 లక్షలు
- 24 గంటల్లోనే చెక్కులు అందజేసిన ప్రజాప్రతినిధులు
- ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన దర్గాహొన్నూరు గ్రామస్తులు



మృతుల కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రాయదుర్గం/బొమ్మనహాళ్: అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు వద్ద బుధవారం జరిగిన కరెంటు ప్రమాదంలో మృత్యువాత పడిన నలుగురు మహిళా కూలీ కుటుంబాలతో పాటు గాయపడినవారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. కూలీల కుటుంబాల్లో తీరని విషాదం మిగిల్చిన ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. గంటల వ్యవధిలోనే పరిహారం ప్రకటించారు. అంతేగాకుండా 24 గంటల్లోపే ప్రజాప్రతినిధుల ద్వారా బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి గురువారం దర్గాహొన్నూరులో బాధిత కుటుంబాలను ఓదార్చారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్‌రెడ్డిలతో కలిసి మృతులు వన్నక్క, రత్నమ్మ, శంకరమ్మ, పార్వతి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. ప్రమాదంలో గాయపడిన సుంకమ్మ, మహేష్, లక్ష్మి, చిట్టెమ్మ, ఓబుళలమ్మలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందించారు. కాపు రామచంద్రారెడ్డి సొంతంగా మృతుల కుటుంబాలకు, గాయపడినవారికి తక్షణ సాయంగా రూ.10 వేల చొప్పున అందజేశారు.

అంత్యక్రియలు పూర్తి

కరెంటు కాటుకు గ్రామానికి చెందిన నలుగురు మహిళలు మృత్యువాత పడటంతో దర్గాహొన్నూరులో విషాదం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం బుధవారం రాత్రి 11 గంటలకు మృతదేహాలను గ్రామానికి తీసుకొచ్చారు. విగతజీవులుగా ఉన్న తమవారిని చూసి బంధువులు, కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుల పిల్లలు తమ తల్లుల మృతదేహాలపైపడి రోదించిన తీరుతో అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు. గురువారం ఉదయం నలుగురి అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యలో అగ్రగామి ఏపీ

▶ మొదటి పేజీ తరువాయి

అందరికీ అందుబాటులోకి తీసుకొస్తూ, ద్విభాషా పాఠ్యపుస్తకాలను పరిచయం చేస్తూ తీసుకున్న చర్యలతో పాఠశాల విద్యలో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. 2020–21 విద్యా సంవత్సరంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు విద్యారంగంలో కనబరిచిన పనితీరుకు సంబంధించిన ఈ సూచికల గ్రేడింగ్‌ను (పీజీఐ) కేంద్ర విద్యా శాఖలోని పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం గురువారం విడుదల చేసింది. 2020–21 పెర్‌ఫార్మెన్సు గ్రేడింగ్ ఇండెక్సులో ఆంధ్రప్రదేశ్ లెవెల్–2లో నిలిచింది. లెవెల్–1ను మాత్రం ఈ విద్యా సంవత్సరంలో దేశంలోని ఏ రాష్ట్రమూ సాధించలేకపోయింది. లెవెల్–2లో మన రాష్ట్రంతో పాటు కేరళ, పంజాబ్, చండీఘడ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌లు నిలిచాయి. పెర్‌ఫార్మెన్సు గ్రేడింగ్ ఇండెక్సును వివిధ అంశాల వారీగా 1000 పాయింట్లను ప్రామాణికంగా తీసుకొని కేంద్రం ఆయా రాష్ట్రాలకు లెవల్ స్థాయిలను ప్రకటిస్తుంటుంది. ఇందులో 901 నుంచి 950 మధ్య పాయింట్లను సాధించిన రాష్ట్రాలు లెవల్ 2లో నిలుస్తాయి. 2017–18, 2018–19 సంవత్సరాల్లో వరుసగా లెవల్–6కు పరిమితమైన ఆంధ్రప్రదేశ్... ఇప్పుడు ఏకంగా నాలుగు స్థాయిలు మెరుగుపరుచుకుని అగ్ర రాష్ట్రాల సరసన లెవల్–2లో నిలవటం విశేషం.

ప్రమాణాల పెంపునకు వీలుగా పీజీఐ

14.9 లక్షల పాఠశాలలు, వివిధ సామాజిక, ఆర్థిక రంగాలకు చెందిన సుమారు 26.5 కోట్ల విద్యార్థులు, 95 లక్షల మంది ఉపాధ్యాయులతో భారత విద్యా వ్యవస్థకు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యావ్యవస్థగా పేరుంది. మన దేశంలో... విద్యా రంగంలో ఉన్నతమైన ప్రమాణాలు సాధించడం, అందరికీ ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి వీలైన ప్రణాళికలను రూపొందించడం వంటి లక్ష్యాలతో కేంద్రం ఏటా ఈ పెర్‌ఫార్మెన్సు గ్రేడింగ్ ఇండెక్సులను ప్రకటిస్తోంది. దీనికోసం ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని విద్యా రంగ పరిస్థితులను మదింపుచేసి ఈ పీజీఐ స్థాయిలను నిర్ణయిస్తోంది. 1000 పాయింట్ల పీజీఐలో... ఆయా రాష్ట్రాలు సాధించిన అభ్యసన ఫలితాలు, పాఠశాలల అందుబాటు, పాఠశాలల్లో ప్రాథమిక సదుపాయాల కల్పన, అందరికీ సమాన విద్య అందుబాటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని పాయింట్లను కేటాయిస్తూ... దాని ఆధారంగా ఆయా రాష్ట్రాల లెవల్‌ను ప్రకటిస్తున్నారు.

డిసెంబర్ 23 నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జైన్



కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో 17 వేల జగనన్న కాలనీల్లో డిసెంబర్ 23 నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ చెప్పారు. కర్నూలు కలెక్టరేట్‌లో గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 21 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. మూడో ఆప్షన్ కింద ఇళ్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకొస్తే లబ్ధిదారులతో ఎంవోయూ చేయిస్తామన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.15 లక్షలు ఖర్చుచేస్తుండగా.. ఇందులో రూ.1.80 లక్షలు సబ్సిడీ పోగా, మిగిలిన రూ.35 వేలను లబ్ధిదారుడికి పావలా వడ్డీ కింద ఇప్పిస్తామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ప్రజా ప్రతినిధులు 15 వేల సచివాలయాల పరిధిలో తిరిగి వివిధ పనుల కోసం ప్రతిపాదనలు పంపారని, వాటిలో 3,344 పనులకు ఆమోదం తెలిపామని, ఇందులో 2,317 పనులు ప్రారంభమయ్యాయని కూడా చెప్పారు.

ఎకరాకు రూ.25 లక్షల పరిహారం

- సంతృప్తి వ్యక్తంచేసిన భావనపాడు పోర్టు నిర్వాసితులు
- రెవెన్యూ మంత్రి . ధర్మాన ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: భావనపాడు పోర్టు ప్రభావిత గ్రామాల్లోని రైతులకు ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, దీనికి రైతులు సంతృప్తి వ్యక్తంచేశారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఆయన గురువారం మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో కలిసి మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులతో డీఎల్ఎన్‌సీ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. గతంలో ఎకరాకు రూ.20 లక్షలు చొప్పున పరిహారాన్ని అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని, రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మరో రూ.5 లక్షలు పెంచుతూ రూ.25 లక్షల పరిహారాన్ని అందించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. దీనిపై నిర్వాసితులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలువురు నిర్వాసిత రైతులను మంత్రులు సత్కరించారు. రైతుల త్యాగాలు మరువలేమని మంత్రులు చెప్పారు. త్వరలోనే పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని, అక్కడి నుంచి మంజూరు ఉత్తర్వులు వచ్చిన వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో జయరావు, తహసీల్దార్ చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌తో ఎస్‌బీఐ సీజీఎం బృందం భేటీ

సాక్షి, అమరావతి: ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) నవీన్ చంద్ర ఝా తో కూడిన అధికారుల బృందం గురువారం సచివాలయం మొదటి బ్లాక్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ సమీర్ శర్మతో భేటీ అయ్యింది. ఎస్‌బీఐ ద్వారా అమలు చేస్తోన్న పథకాలు, బీమా పథకాలు, ఉద్యోగులకు, ప్రజలకు అమలు చేస్తోన్న పథకాల గురించి సీజీఎం బృందం సీఎస్‌కు వివరించింది.

పింఛన్ల పంపిణీ

రాష్ట్రంలో గురువారం కూడా పింఛన్ల పంపిణీ కొనసాగింది. వివిధ ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందించారు.



కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు హుస్సేనమ్మకు పింఛన్ ఇస్తున్న నంద్యాల జిల్లా బెలూం గ్రామ వలంటీర్ రాముడు



ఒంగోలు నగరంలోని 9వ డివిజన్ కొప్పోలులో పి.రాఘమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్నేహ



కాకినాడ జిల్లా ఉప్పాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శామ్యూలుకు పింఛను అందిస్తున్న యు. కొత్తపల్లి మండలం ఉప్పాడ వలంటీర్ బలరాం



గుంటూరులోని రామిరెడ్డినగర్‌లో జిన్నాతున్‌కు వితంతు పింఛన్ అందిస్తున్న వార్డు వలంటీరు ఫర్హీనా

సీడీఎంఏలో విజిలెన్స్ వారోత్సవాలు

సాక్షి, అమరావతి: అవినీతి రహిత సమాజం కోసం తాము పాలుపంచుకుంటామని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయంలో సిబ్బంది ప్రమాణం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రహిత సేవల కోసం అక్టోబర్ 31 నుంచి ఈ నెల 6 వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం వడ్డేశ్వరంలోని రాష్ట్ర కార్యాలయంలో సీడీఎంఏ ప్రవీణ్ కుమార్ అధికారులు, సిబ్బందితో ప్రమాణం చేయించారు.

లబ్ధి కోసమే ఎన్‌వోసీ!

- అది వాల్యుబుల్ సెక్యూరిటీనే
- అందువల్ల సెక్షన్ 467 వర్తిస్తుంది
- ప్రాథమికంగా అభిప్రాయపడ్డ హైకోర్టు
- అదనపు ఏజీ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి
- పూర్వాపరాల కోసం కేసు డైరీ ఇవ్వాలని ఆదేశం
- తదుపరి విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: సీఐడీ నమోదు చేసిన ఐపీసీ సెక్షన్ 467 (వాల్యుబుల్ సెక్యూరిటీ ఫోర్జరీ) తమకు ఎంతమాత్రం వర్తించదన్న టీడీపీ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఆయన కుమారుడు రాజేష్ వాదనను హైకోర్టు ప్రాథమికంగా తోసిపుచ్చింది. ప్రాథమిక ఆధారాలను బట్టి ఆ సెక్షన్ వారికి వర్తిస్తుందని అభిప్రాయపడింది. ప్రయోజనం పొందాలన్న ఉద్దేశంతోనే జల వనరుల శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందారని, అందువల్ల అది వాల్యుబుల్ సెక్యూరిటీ కిందకే వస్తుందని హైకోర్టు పేర్కొంది. ఈ విషయంలో అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనతో న్యాయస్థానం ప్రాథమికంగా ఏకీభవించింది. అయ్యన్నపాత్రుడు, రాజేష్‌పై సీఐడీ నమోదు చేసిన కేసుకు సంబంధించిన పూర్వాపరాలన్నీ తెలుసుకునేందుకు ఆ కేసు డైరీని తమ ముందుంచాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నంలో పంట కాలువకు చెందిన భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు జల వనరుల శాఖ ఎన్‌వోసీని ఫోర్జరీ చేశారంటూ ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అయ్యన్నపాత్రుడు, రాజేష్‌లపై సీఐడీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయడంతో పాటు తమకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలంటూ అయ్యన్నపాత్రుడు, రాజేష్ అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ జరిపారు.

అరెస్ట్ చేయొద్దంటే ఎలా...?

సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. లబ్ధి పొందాలన్న ఉద్దేశంతోనే ఎన్‌వోసీని ఫోర్జరీ చేశారని, అందువల్ల అది ఐపీసీ సెక్షన్ 467 కింద వాల్యుబుల్ సెక్యూరిటీ కిందకే వస్తుందన్నారు. ఇందుకు సంబంధించి ఆయన ఐపీసీ సెక్షన్ 30 చదివి వినిపించారు. దీని ప్రకారం న్యాయపరమైన హక్కు కల్పించేది ఏదైనా వాల్యుబుల్ సెక్యూరిటీయే అవుతుందన్నారు. ఈ సెక్షన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి ఈ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఓ తీర్పును ఉదహరిస్తూ దాని ప్రకారం ప్రస్తుతం పిటిషనర్లు పొందినట్లు చెబుతున్న ఎన్‌వోసీ వాల్యుబుల్ సెక్యూరిటీ కిందకే వస్తుందని ప్రాథమికంగా అభిప్రాయపడ్డారు. తప్పు చేసిన వ్యక్తులను అరెస్ట్ చేస్తే రాజకీయ కక్ష సాధింపుగా ఆరోపించడం సరికాదని పొన్నవోలు పేర్కొన్నారు. లేని డాక్యుమెంట్ ఆధారంగా భవనం కట్టారని, ఇందుకోసం ఫోర్జరీ ఎన్‌వోసీ సృష్టించారన్నారు. అసిస్టెంట్ ఈఈని బెదిరించి ఎన్‌వోసీపై సంతకం చేయించి ముద్ర వేయించారని తెలిపారు. నిందితులను ప్రశ్నించి వాస్తవాలను రాబట్టేందుకే వారిని అరెస్ట్ చేశామని నివేదించారు. కేసు నమోదు తరువాత వాస్తవాలను రాబట్టేందుకు నిందితులను అరెస్ట్ చేసే హక్కు దర్యాప్తు అధికారులకు ఉందన్నారు. ఈ హక్కును ఎవరూ కాలరాయలేరని, అరెస్ట్ చేయవద్దంటే సంబంధిత సెక్షన్‌ను చట్టం నుంచి తొలగించడమే మేలన్నారు. నిందితుల అరెస్ట్‌పై ఏ చట్టంలో కూడా ఎలాంటి నిషేధం లేదన్నారు. అయ్యన్న లాంటి వారి వల్ల దోపిడీ రాజ్యం తయారైందని, అలాంటి వారిని అరెస్ట్ చేసి శిక్ష పడేలా చేస్తే అది రామరాజ్యం అవుతుందన్నారు.

కక్ష సాధింపు...

అంతకు ముందు అయ్యన్న, రాజేష్ తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగానే ఈ కేసు నమోదు చేశారన్నారు. గతంలో తాము ఎన్‌వోసీ పొందామని, వాటి కాపీలను ఓ కేసులో హైకోర్టు ముందుంచామన్నారు. వాటిని జారీ చేసిన తేదీకి, ఫోర్జరీ తేదీకి పొంతన లేదన్నారు. ఏ రకంగానూ తమకు 467 సెక్షన్ వర్తించదన్నారు. మిగిలినవన్నీ సాధారణ సెక్షన్లేనని, వాటికి సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఎందుకీ గలీజు రాతలు

- యుగపురుషుడు కందుకూరి ఆశయాలపై పచ్చ రాతలు
- ఆస్తులను సర్కారు స్వాధీనం చేసుకుంటుందంటూ తప్పుడు ఆరోపణలు
- హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశీ బాలమునికుమారి



జీవో కాపీలు చూపిస్తున్న కాశీ బాలమునికుమారి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో స్థాపించిన హితకారిణి సమాజానికి సంబంధించిన ఆస్తులను సర్కారు స్వాధీనం చేసుకుంటుందంటూ పచ్చ మీడియాలో రాసిన గలీజు రాతల్లో వాస్తవం లేదని హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశీ బాలమునికుమారి చెప్పారు. హితకారిణి సమాజం ట్రస్టు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎవరి మెప్పు పొందడానికి ఇటువంటి రాతలు రాస్తున్నారంటూ మండిపడ్డారు. నిజాలు తెలుసుకోకుండా భూముల స్వాధీనానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ రాయడం ఎంతవరకు సబబని నిలదీశారు. కందుకూరి వీరేశలింగం పంతులు ఏ లక్ష్యంతో ఈ సమాజాన్ని స్థాపించారో.. అదే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను మహిళలకే అందిస్తున్నారని చెప్పారు. అందుకే దళిత మహిళ అయిన తనను ఈ హితకారిణి సమాజానికి చైర్‌పర్సన్‌ను చేసి అభివృద్ధి పథంలో నడిపించాలని ఆదేశించారని తెలిపారు.

పచ్చ మీడియాపై లీగల్ చర్యలు

ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం చేసి, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు జీతాలు చెల్లించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో చర్యలు తీసుకున్నారని చెప్పారు. హితకారిణి సమాజం ఆస్తులను ప్రభుత్వం తీసుకోలేదని బాలమునికుమారి స్పష్టం చేశారు. హితకారిణి సమాజంలో అద్దెకిచ్చిన దుకాణాలపై పెత్తనం తమకే ఇవ్వాలంటూ విద్యాశాఖ పట్టుబడుతోందని రాయడం కూడా సత్యదూరమని చెప్పారు. ఆ దుకాణాల అజమాయిషీ ఎప్పటికీ హితకారిణి సమాజం అధీనంలోనే ఉంటుందని స్పష్టం చేశారు. విలీనం చేసుకుంటున్నప్పుడే ఆస్తులు తమకు అవసరం లేదని, కేవలం విద్యాసంస్థలను అభివృద్ధి చేయడానికే విలీనం చేసుకుంటున్నామని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారని తెలిపారు. ఎటువంటి ఆధారం లేకుండా పచ్చ మీడియాలో అసత్య కథనం ప్రచురించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. దీనిపై చట్టప్రకారం న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజమహేంద్రవరం నగరంలోని దానవాయిపేట, ఇన్నీసుపేటలోని సమాజం ప్రాంగణాలన్నీ కలిపి 31 ఎకరాల్లో ఉండగా.. వీటి విలువ దాదాపు రూ.200 కోట్లని, ఇంత విలువైన భూములను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని చూస్తోందని రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యాశాఖ భూములు ఇచ్చేయాలని పట్టుబడుతున్నట్టు తప్పుడు కథనం రాయడం మంచిది కాదన్నారు. సమాజం ఆస్తులను భద్రంగా కాపాడుతున్నామని, కందుకూరి ఆశయాలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. ఆ భూములను స్వాధీనం చేయాలంటూ దేవదాయ, ధర్మదాయ శాఖ జీవో జారీ చేసినట్లు రాయడం కూడా సరికాదన్నారు. ఉద్దేశపూర్వకంగా కందుకూరి విద్యాసంస్థలపై, హితకారిణి సమాజంపై తప్పుడు కథనాలు రాస్తే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈనాడు చైర్మన్ రామోజీరావుకి వయసు మీదపడటంతో పత్రిక బాధ్యత చూడలేకపోతున్నారేమోనని, అందుకే ఆ పత్రికలో ఇటీవల తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని విమర్శించారు. హితకారిణి సమాజం ఎంతో ప్రతిష్టాత్మకమైనదని, దీనిపై తప్పుడు కథనాలు రాయడం అందరికీ ఆగ్రహం కలిగిస్తుందని పేర్కొన్నారు. హితకారిణి సమాజం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లు దేవులపల్లి సరితారాణి, గుడాల ఆదిలక్ష్మి, దూనబోయిన అరుణకుమారి, ఉల్లూరి రాజు, మద్దు సతీష్, కందుకూరి రాజ్యలక్ష్మి ఎంబీపీ మహిళా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యాప్రతిమ, కందుకూరి రాజ్యలక్ష్మి డీఈడీ మహిళా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయభాను పాల్గొన్నారు.

'అయ్యన్న' అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

కొద్దిసేపు పోలీసులు నిరీక్షించారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించారు. అదే సమయంలో అయ్యన్న తనయుడు రాజేష్ బయటకు రాగా.. కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి కావడంతో ఆయనను ముందుగా అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఇంతలో అయ్యన్నపాత్రుడు బయటకొచ్చి.. నన్ను అరెస్టు చేసేందుకు ఇంతమంది రావటం అవసరమా.. అని ప్రశ్నించారు. అరెస్టుకుగల కారణాలు తెలియజేస్తూ నోటీసును అయ్యన్నపాత్రుడికి పోలీసులు అందజేశారు. దీనిపై అయ్యన్న, సీఐడీ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎట్టకేలకు అయ్యన్నపాత్రుడు నోటీసుపై సంతకం చేశారు. అరెస్టుచేసి ఇంట్లో నుంచి బయటకు తీసుకువస్తుండగా నోటీసును తన చేతికిస్తేనే వస్తానని అయ్యన్నపాత్రుడు మెలిక పెట్టారు. పోలీసులు ఆయన్ను వాహనంలోకి ఎక్కించి విశాఖకు తరలించారు. మరోవైపు.. శాంతి యాత్ర పేరుతో టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టగా పోలీసులు వారిని అరెస్టుచేశారు.

సీఐడీ కార్యాలయం వద్ద హైడ్రామా

నర్సీపట్నంలో అరెస్టుచేసిన అయ్యన్నపాత్రుడు, రాజేష్‌లను పైనాపిల్ కాలనీలో ఉన్న సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చారు. టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నాయకులు అక్కడికి చేరుకుని కార్యాలయంలోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అయినా వారిని తోసుకుని వెళ్లడానికి ప్రయత్నించిన వెలగపూడి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మరికొంత మందిని పోలీసులు అరెస్టుచేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అయ్యన్న, రాజేష్‌ను వైద్య పరీక్షల నిమిత్తం సింహాచలంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం తిరిగి సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి సాయంత్రం 4.30 గంటలకు విశాఖ కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్లారు.

రిమాండ్ రిపోర్ట్ తిరస్కరించిన కోర్టు

సాయంత్రం 5.40 గంటలకు ప్రధాన మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ ముందు వారిని పోలీసులు హాజరుపరిచారు. అయ్యన్న, రాజేష్‌లపై రిమాండ్ రిపోర్టును ఏపీపీ ఆదినారాయణ ద్వారా సీఐడీ అధికారులు కోర్టుకు సమర్పించారు. దానిపై ఇరువర్గాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. సీఐడీ అధికారులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పెట్టిన సెక్షన్లు, నమోదు చేసిన కేసుతో పొంతనలేదని జడ్జి రిమాండ్ రిపోర్టును తిరస్కరించారు. దీంతో పోలీసులు వారికి 41ఏ నోటీసులు అందజేసి స్టేషన్ బెయిల్ ఇచ్చారు.


ఈఈ ఫిర్యాదుతో 'ఫోర్జరీ' వెలుగులోకి..

ఇక చింతకాయల విజయ్ పేరుతో నర్సీపట్నంలో అయ్యన్న కుటుంబీకులు 2017లో ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. ఇందుకోసం నర్సీపట్నం మున్సిపాలిటీ నుంచి బిల్డింగ్ ప్లాన్ అనుమతి కోసం అదే ఏడాదిలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమయంలో (సెటిల్‌మెంట్ డీడ్ నెం-3660 ఆఫ్ 2017) సర్వే నెంబర్లు 277, 278/1లోని 387.33 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణానికి అనుమతి కోరారు. దక్షిణం, పశ్చిమం వైపునకు పంట కాలువ ఉన్నట్లు ప్లాన్‌లో చూపించారు. నిర్మాణ సమయంలో ఈ కాలువను ఆక్రమించి నిర్మాణాన్ని చేపట్టారు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి పెట్టడంతో ఫోర్జరీ సంతకాలతో ఎన్‌వోసీ సృష్టించడమే కాకుండా ఏకంగా కోర్టునే తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారు. 2019 ఫిబ్రవరి 25న ఇంటి నిర్మాణం కోసం ఎన్‌వోసీని జలవనరుల శాఖ ఈఈ మల్లికార్జునరావు సంతకంతో ఇచ్చినట్లుగా కోర్టులో సమర్పించారు. దీనిని పరిశీలించిన సదరు ఈఈ.. ఎన్‌వోసీలో ఉన్నది తన సంతకం కాదని గుర్తించారు. దీనిపై కార్యాలయంలోని ఫైళ్లను పరిశీలించగా.. తాను ఇవ్వలేదన్న సంగతి స్పష్టమైంది. అదే విధంగా కోర్టుకు సమర్పించిన ఎన్‌వోసీ పత్రాల్లో ఉన్న సంతకం తనది కాకపోవడంతో జలవనరుల శాఖ ఈఈ మల్లికార్జునరావు సీఐడీ అధికారులకు సెప్టెంబర్ 30న ఫిర్యాదు చేశారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని చెప్పారు. సంతకం కింద తేదీ వివరాలు పేర్కొనడం కూడా ఫోర్జరీనే అని తెలిపారు. కార్యాలయం సీల్ కూడా తమది కాదని స్పష్టంచేశారు. ఈ మేరకు సీఐడీకి సెప్టెంబరు 30న ఈఈ ఫిర్యాదు చేయగా... దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత ఇన్‌స్పెక్టర్ పైడిరాజు విచారణ అధికారిగా తన విచారణ నివేదికను సమర్పించారు. ఈ నివేదికలో ఫోర్జరీ ఎన్‌వోసీ వ్యవహారం స్పష్టంగా తేటతెల్లమైంది.

ఫోర్జరీ కారణంగానే అరెస్టు : సీఐడీ డీఐజీ

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీలతో ప్రభుత్వాన్ని మోసం చేసిన కేసులో అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారుడు రాజేష్‌ను అరెస్టుచేసినట్లు సీఐడీ విభాగం డీఐజీ సునీల్ నాయక్ వెల్లడించారు. మంగళగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నీటిపారుదల శాఖ స్థలం కబ్జా, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేశారంటూ అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారులు విజయ్, రాజేష్‌లపై నీటిపారుదల శాఖ ఈఈ మల్లికార్జునరావు ఫిర్యాదు చేశారని చెప్పారు. దాంతో సెక్షన్లు 464, 467, 471, 474, 120 (బి), 34 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఫోర్జరీ చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని సునీల్‌నాయక్ తెలిపారు. దీంతో అయ్యన్నపాత్రుడు, రాజేష్‌లను అరెస్టు చేశామని వివరించారు.

ఎవరినీ వదలం.. వందరెట్లు ప్రతీకారం తీర్చుకుంటాం: చంద్రబాబు



సాక్షి, అమరావతి: ఖబడ్దార్ జగన్... ఇంతకు పది రెట్లు అనుభవిస్తావ్.. అధికారులకు వార్నింగ్ ఇస్తున్నా.. ఎవర్నీ వదలం.. వందరెట్లు ప్రతీకారం తీర్చుకుంటాం.. అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు హెచ్చరించారు. టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడి అరెస్టును ఖండించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయ్యన్నపాత్రుడి అక్రమ అరెస్ట్ అరాచక పాలనకు పరాకాష్ట అని చెప్పారు. ఈ ప్రభుత్వం మొదట్నుంచీ ఒక టెక్నిక్ ఫాలో అవుతోందని, ప్రభుత్వ వైఫల్యం బయటపడినప్పుడల్లా దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు టీడీపీ వాళ్లపై తప్పుడు కేసులు బనాయించి జైలుపాలు చేస్తోందని ఆరోపించారు. విశాఖలో భూ కబ్జాలు, బాబాయ్ హత్య కేసులో సీబీఐకి షర్మిల వాంగ్మూలం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు అయ్యన్నపాత్రుడిపై కేసు బనాయించి అరెస్ట్ చేశారన్నారు. విశాఖలో రుషికొండను బోడిగుండు చేసేయడంపై టీడీపీ పోరాడుతోందని చెప్పారు. దాన్నుంచి దృష్టి మరల్చేందుకు అయ్యన్నను అరెస్టు చేయించారన్నారు. అయ్యన్నపాత్రుడు ఇల్లు కట్టుకున్న స్థలంలోని నాలా భూమిలో రెండుసెంట్లకు అనుమతులు ఇవ్వకుండా.. ఇప్పుడు ఇల్లు కట్టారని కేసు పెట్టారన్నారు. ఇలాంటి తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టలేరని, ఇంతకు వందరెట్లు ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఓటమి తర్వాత వైఎస్సార్‌సీపీ బంగాళాఖాతంలో కలిసిపోతుందని అన్నారు. 'జనసేన నేత పవన్‌కళ్యాణ్ ఎక్కడ ఉంటే అక్కడ రెక్కీ నిర్వహిస్తారా? ఎంత ధైర్యం మీకు?..' అని పేర్కొన్నారు. మానవత్వం లేని ముఖ్యమంత్రి బటన్ నొక్కినంత మాత్రాన ఉపయోగం ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు.

రాష్ట్రమంతా ఆందోళన చేయాలని పిలుపు

భూకబ్జా కేసులో టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడు అరెస్టు కావడంపై టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం పార్టీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఆందోళనలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ నాయకుడి అరెస్టు అని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. చంద్రబాబు ఆదేశాలతో పలువురు టీడీపీ నేతలు మీడియా సమావేశాలు నిర్వహించారు.

అయ్యన్న నేరాలకు బీసీలకు సంబంధమేంటి?

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: అయ్యన్నపాత్రుడిని అరెస్టుచేస్తే బీసీ నేతను అరెస్టుచేశారని టీడీపీ బీసీ నేతలు మాట్లాడడం సిగ్గుచేటని పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు మండిపడ్డారు. అయ్యన్న తప్పుచేస్తే బీసీలకు ఏం సంబంధమని వారు సూటిగా ప్రశ్నించారు. ఆరోపణలు వచ్చినప్పుడు నిరూపించుకోకుండా బీసీలపై దాడి అంటూ రాజకీయ లబ్ధిపొందేందుకు యత్నించడం చాలా హేయమని వారు వ్యాఖ్యానించారు. ఫోర్జరీ ఆరోపణలతో అయ్యన్నను సీఐడీ అరెస్టుచేసిన నేపథ్యంలో చంద్రబాబు సహా టీడీపీ నేతలు స్పందిస్తున్న తీరుపై మంత్రులు బూడి ముత్యాలనాయుడు, జోగి రమేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీమంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఘాటుగా స్పందించారు. వారు ఏమన్నారో వారి మాటల్లోనే..

అడ్డంగా దొరికిపోయిన దొంగ అయ్యన్న

'అయ్యన్నపాత్రుడు నేరాలకు బీసీలకు ఏం సంబంధం ఉంది? దొంగ పనులు చేసి అడ్డంగా దొరికిపోయిన దొంగ అయ్యన్నను పోలీసులు అరెస్టుచేస్తే బీసీలకు అన్యాయం చేస్తున్నట్లు టీడీపీ నేతలు వక్రీకరించడం అన్యాయం. అయ్యన్న చేసిన తప్పులకు అయ్యన్నే బాధ్యుడు. వాటితో బీసీలకు ఏం సంబంధం? చట్టం ఎవరికీ చుట్టంకాదు. పంట కాలువను ఆక్రమించి ఇంటి గోడను నిర్మించిన ఆయనపై సీఐడీ చట్టప్రకారమే కేసు నమోదు చేసింది. ఆక్రమించిన ఇరిగేషన్ భూమిలో ప్రహరీ నిర్మాణానికి తాను ఎన్‌వోసీ ఇవ్వలేదని, అయ్యన్న హైకోర్టుకు నకిలీపత్రాలు సమర్పించారని జలవనరుల శాఖ ఈఈ సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐడీ జరిపిన దర్యాప్తులో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యాకే అరెస్టుచేశారు. ఇందులో కక్ష సాధింపు ఎక్కడ ఉందో చంద్రబాబు, టీడీపీ నేతలు చెప్పాలి..' అని అన్నారు.

తప్పుడు పనులకు టీడీపీ లైసెన్స్ ఇచ్చిందా?



అయ్యన్నకు ఇలాంటి తప్పుడు పనులు చేయడానికి ఆ పార్టీ ఏమైనా లైసెన్స్ ఇచ్చిందా? అరెస్టుచేసిన సమయంలో వీడియోలను పరిశీలిస్తే అయ్యన్న పోలీసులను తీవ్రస్థాయిలో బెదిరించారన్నది స్పష్టమవుతోంది. అయ్యన్న అరెస్టును బీసీలకు ముడిపెట్టి.. రాజకీయంగా లబ్ధిపొందాలని ప్రయత్నిస్తే బీసీలు వాటిని తిప్పికొడతారు. ఇక విశాఖ భూములపై తాము ప్రశ్నిస్తున్నందుకే తప్పుడు కేసులు పెడుతున్నారంటున్న టీడీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం. ఫోర్జరీలు చేసేవాడు సామాజిక కార్యకర్త అవుతాడా? టీడీపీ నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, యరపతినేని శ్రీనివాసరావు, యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమ.. వీళ్లంతా ఏమైనా సంఘ సేవకులా? వీళ్లంతా రాష్ట్రాన్ని దోచుకున్న దోపిడీదారులు. ఈ ముఠాకు నాయకుడు చంద్రబాబు. నారా లోకేశ్ సోషల్ మీడియాను అడ్డంపెట్టుకుని సీఎం జగన్‌ను, ఆయన కుటుంబ సభ్యులతోపాటు వైఎస్సార్‌సీపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనిపై సీఐడీ పోలీసులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి.

– తాడేపల్లిలో మీడియాతో మంత్రి బూడి ముత్యాలనాయుడు

తప్పులు కప్పి పుచ్చుకునేందుకే రాద్ధాంతం



అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలతో రాద్ధాంతం చేస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే అయ్యన్నపాత్రుడిపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. పోలీసులు చట్టప్రకారం ఆయన్ను అరెస్టుచేస్తే బీసీలపై దాడిగా టీడీపీ నేతలు ఆరోపణలు చేయటం సిగ్గుచేటు. ఆరోపణలు వచ్చినప్పుడు నిరూపించుకోకుండా బీసీలపై దాడి అంటూ రాజకీయ లబ్ధిపొందేందుకు యత్నించడం హేయం. అయ్యన్న తప్పులను కాపాడేందుకు టీడీపీ నాయకులు చేస్తున్న గగ్గోలును కట్టిపెట్టాలి.

– మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

అయ్యన్న అతిపెద్ద భూకబ్జాదారుడు



రాష్ట్రంలో అత్యధికంగా భూకబ్జాలు చేసిన వ్యక్తి, గంజాయి దొంగ అయ్యన్నపాత్రుడే. న్యాయస్థానాలకు తప్పుడు పత్రాలు సమర్పించి రెవెన్యూ రికార్డుల్లో టాంపరింగ్ చేశారు. అధికారులు చెబుతున్నా పట్టించుకోకుండా ఇష్టానుసారం అక్రమ నిర్మాణం చేపడితే చర్యలు తీసుకోకూడదా? ఆక్రమించిన భూమి ఎవరి నుంచి వచ్చిందో చెప్పాలి. ఆయన కొడుకు రాజేష్ ఐటీడీపీ ద్వారా సీఎంను, మహిళా మంత్రులపై సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నాడు.

– ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

చట్టం ముందు ఎవరైనా ఒక్కటే



తప్పుచేసిన వారు ఎవరైనా శిక్షార్హులే. అయ్యన్నపాత్రునికి ఒక న్యాయం చంద్రబాబుకు ఒక న్యాయం ఉండదు. బీసీలపై దాడి, అర్ధరాత్రి అరెస్టు అంటూ చంద్రబాబు వెకిలివాగుడు వాగుతున్నాడు. ప్రజా ప్రతినిధులు, పలుకుబడిగల నేతలను పోలీసులు రాత్రివేళల్లోనే అదుపులోకి తీసుకుంటారు. ఇది ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. ఇక పవన్ కళ్యాణ్‌ని చంపేందుకు రెక్కీ నిర్వహిస్తున్నారని జనసేన నేత నాదెండ్ల మనోహర్ అనడం హాస్యాస్పదం. కుట్రచేస్తే అది చంద్రబాబే చెయ్యాలి. – కొడాలి నాని, గుడివాడ ఎమ్మెల్యే

ఫోర్జరీ చేయడం నేరం కాదా?



ఒకవైపు అయ్యన్న తప్పు చేశాడంటూనే చంద్రబాబు మరోవైపు మమ్మల్ని తప్పుపట్టడం, దూషించటం ఏమిటి? ఫోర్జరీ డాక్యుమెంట్‌తో ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించుకుంటే తప్పుకాదా? అయ్యన్నపాత్రుడిని అరెస్టుచేస్తే బీసీ నేతను అరెస్టుచేశారని మాట్లాడుతున్నారు.. బీసీ నాయకులు తప్పుచేస్తే అరెస్టు చేయరా? అయినా అయ్యన్న తప్పుచేస్తే బీసీలకు ఏం సంబంధం? ఆ ఘటనకు కులాన్ని ఎందుకు ఆపాదిస్తున్నారు. కులాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారు. రెండు సెంట్ల భూమి ఆక్రమించుకుంటే, కేసు పెడతారా? అరెస్టు చేస్తారా? అని చంద్రబాబు అంటున్నారు. అంటే అయ్యన్న చేసింది తప్పే అని ఒకవైపు అంటూనే, మరోవైపు అరెస్టు చేయడాన్ని తప్పుపడుతున్నారు. ఫోర్జరీ డాక్యుమెంటు సృష్టించి దాన్ని హైకోర్టులో సమర్పించడం చంద్రబాబుకు తప్పుకాదు. ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేయొచ్చు.. కానీ కేసు పెడితే మాత్రం ఓర్చుకోలేరు. ఇక పవన్ కళ్యాణ్ గురించి ఆలోచించే టైమ్ కూడా మాకులేదు. అలాంటప్పుడు ఆయనపై రెక్కీ చేయాల్సిన అవసరం అంతకన్నాలేదు. ఈ విషయంలో మాపై నిందలు వేస్తే చంద్రబాబుకే నష్టం.

– మంత్రి జోగి రమేష్

అయ్యన్న పెద్ద కబ్జా కోరు



టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు పెద్ద కబ్జా కోరు, గంజాయి మాఫియా నడిపే 420. ఫోర్జరీ పత్రాలతో జలవనరుల శాఖకు చెందిన భూమిని ఆక్రమించుకుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా. అవినీతికి పరాకాష్ట అయిన అయ్యన్నపాత్రుడిని అరెస్ట్ చేస్తే.. చంద్రబాబు, లోకేశ్ వెనకేసుకురావడం, గందరగోళం సృష్టించడం సిగ్గుచేటు. ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుంటే బీసీలను ఇబ్బంది పెడుతోందని మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. ఎస్సీ, బీసీలను హేళన చేసినందుకు గత ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు టీడీపీ తాట తీశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రంలో బీసీలకు తగిన న్యాయం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మాత్రమే.

– మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ఈ ప్రాపంచిక జీవితం తాత్కాలికం. శాశ్వత నివాస స్థలం పరలోకమే. చెడు చేసినవాడికి, అతడు చేసినంత చెడుకు ప్రతిఫలం లభిస్తుంది.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, నవంబర్, 4

రాజధాని నిండా రాకాసి గాలి

రాజకీయాలు కలుషితమయ్యాయనే ఆవేదన వింటుంటాం. కానీ, కాలుష్యం మీదా రాజకీయాలు సాగుతున్న పరిస్థితి దేశ రాజధానిలో చూస్తున్నాం. ఢిల్లీలోని వాయు కాలుష్యం ఇప్పుడు జాతీయ అత్యవసర పరిస్థితికి వచ్చింది. రాగల మూడు రోజులు దారుణంగా ఉంటాయని వార్త. అదే సమయంలో ఈ అంశంపై కేంద్రంలోని బీజేపీ, ఢిల్లీని ఏలుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ల మధ్య రాజకీయ మాటల యుద్ధం ఏవగింపు కలిగిస్తోంది. పాలన గాలికొదిలేసి, పీల్చేగాలి కూడా సవ్యంగా లేకుండా చేస్తున్న ప్రబుద్ధులు ఆరోపణల పర్వంలో మాత్రం పైచేయి కోసం ప్రయత్నించడం విచారకరం. జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో కాలుష్యానికి వాహనాలు, పంట వ్యర్థాల దహనం, దీపావళి టపాసులు, పరిశ్రమలు, గాలి వేగం లాంటి భౌగోళిక పరిస్థితులు – ఇలా ఎన్నో కారణాలు. ప్రతి ఏటా శీతకాలం మొదలయ్యేసరికి హాయిగా శ్వాస పీల్చుకోలేని పరిస్థితి ఏళ్ళ తరబడిగా వేధిస్తున్నా తగు చర్యలు తీసుకోకపోవడం స్థానిక, కేంద్ర ప్రభుత్వాల సమష్టి వైఫల్యం.

ఇవాళ ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరాల్లో ఢిల్లీ ఒకటి. కళ్ళెదుట ఉన్నది కనిపించనివ్వని దట్టమైన పొగమంచు, దుమ్మూధూళి, పొగ, మసి. ప్రతి శీతకాలంలో లానే ఈసారీ నగరం ఓ విషవాయు గృహంగా మారింది. ఉత్తరాదిలో రోజూ వేలల్లో సాగుతున్న పంట వ్యర్థాల దహనం, ఇతర కాలుష్యాలు మహానగర వాయునాణ్యతను గురువారం సైతం 'అత్యంత ప్రమాదకర స్థాయి'లో నిలిపాయి. ఒంట్లోని రక్తంలోకీ ప్రవేశించేటంత సూక్ష్మమైన, ప్రమాదభరిత ధూళికణాలు పిఎం2.5 సగటున ప్రతి ఘనపు మీటర్‌లో 588 ఉన్నాయని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతించిన దానికన్నా ఇది 40 రెట్లు ఎక్కువ. ఢిల్లీలోనే కాదు, దేశంలో అనేక నగరాల్లో పీల్చేగాలి విషతుల్యమైందన్న కాలుష్య నివారణ మండలి మాట దిగ్భ్రాంతికరం.

పొరుగున పంజాబ్‌లోని పొలాల్లో వరి పంట వగైరా కోయగా మిగిలిన దుబ్బులను తగలబెట్టడంతో ఢిల్లీ విషవాయు నగరిగా మారుతోందంటూ, ఢిల్లీ, పంజాబ్‌లను రెంటినీ పాలిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని కేంద్ర పర్యావరణ మంత్రి దుమ్మెత్తిపోశారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితరులు కాలుష్య నియంత్రణకు స్మోక్ టవర్ల ఏర్పాటు, చెట్ల పెంపకం, నీటి జల్లులు సహా చేయగలిగినదంతా చేస్తున్నామంటున్నారు. రాజకీయాలు అటుంచితే, ఢిల్లీలో ఏటా ఈ సమస్య తలెత్తుతుండడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఎవరు కాదన్నా మహానగరిలోని ఈ కాలుష్యానికి వరి మోళ్ళ దహనం దోహదం చేస్తోంది. పంజాబ్‌లో అధికారంలోకి రాక ముందు అంతా అక్కడి రైతుల పాపమే అన్న ఆప్ ఇప్పుడక్కడ అధికారంలో ఉండీ, నివారించలేకపోతోంది. పంజాబ్ తదితర రాష్ట్రాల్లోని రైతులు ఇతర మార్గాలను అనుసరించేలా చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. గత నెల రోజుల్లో ఈ దుబ్బులు కాల్చడం ఎక్కువైంది.

దీనికి కారణాలు చాలానే. నీటి అవసరం ఎక్కువైన వరిసాగు వల్ల భూగర్భ జలాలు క్షీణిస్తాయంటూ పంజాబ్ లాంటి చోట్ల మేలో పంట వేయడంపై నిషేధం పెట్టారు. వర్షాలొచ్చాక జూన్ మధ్యలో ఆలస్యంగా నాట్లు వేయడంతో, అక్టోబర్ ఆఖరులో కానీ పంట చేతికి రాదు. ఆ వెంటనే రబీ సీజన్‌కు వారమే వ్యవధి. దాంతో, త్వరితగతిన పొలాల్ని సిద్ధం చేసేందుకు మోళ్ళను కాల్చడమే రైతుకు మార్గమవుతోంది. అప్పుడే ఉత్తరాదిలో చలికాలం. ఉష్ణోగ్రతలు పడిపోతాయి. వాయువేగం తగ్గుతుంది. వెరసి, కాలుష్యం పెరుగుతోంది. అదే గనక మేలోనే పంట వేయనిస్తే, సెప్టెంబర్‌కే చేతికొస్తుంది. అప్పటికి ఉష్ణోగ్రతలు, గాలి ఎక్కువగానే ఉంటాయి కాబట్టి సమస్య తీవ్రంగా ఉండకపోవచ్చు. అలాగే, పంజాబ్‌లో అధిక శాతం రైతులు నిరుపేదలు కావడంతో కాల్చడానికి బదులు కొయ్యకాళ్ళను తొలగించే యంత్రాలను వాడే స్థోమత లేదు. పైపెచ్చు, ఇతర ప్రత్యామ్నాయాలన్నీ శ్రమతో కూడినవి. అందుకే వ్యర్థాలను కాల్చడాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇది గ్రహించి, ఈ పద్ధతిని మార్చడంపై అత్యవసరంగా పాలకులు, వ్యవసాయ నిపుణులు దృష్టి పెట్టాలి.

ఒక్క శీతకాలంలోనే కాదు... ఏడాది పొడుగూతా ఎన్సీఆర్‌లో సగటున పిఎం2.5 గరిష్ఠ పరిమితి కన్నా 20 రెట్లు ఎక్కువ ఉంటోంది. ఇది ఆందోళనకరం. ఇటీవల ఢిల్లీలో వాయు నాణ్యత సూచి (ఏక్యూఐ) 400 మార్కును దాటేయడంతో ఆరోగ్యవంతులకూ ప్రమాద ఘంటిక. 2021 నుంచి ఎన్సీఆర్‌లో కొన్ని చర్యలు చేపట్టకపోలేదు. వాయునాణ్యత నిర్వహణకు కమిషన్ పెట్టారు. రోజూ ఏక్యూఐ నమోదు, ఎప్పటికప్పుడు వచ్చే కాలుష్యప్రమాదంపై గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్‌ప్లాన్ (గ్రాప్) లాంటివి చేపట్టారు. వీటిని కట్టుదిట్టంగా అమలు చేస్తూ, సంస్థలు సమన్వయంతో సాగితేనే ఫలితం.

అలాగే, గాలిలో నైట్రోజన్ డయాక్సైడ్ స్థాయిని పెంచుతున్న వాహన కాలుష్యానికి పరిష్కారం – వీలైనంతగా ప్రజారవాణా వ్యవస్థను ఆశ్రయించడమే. ప్రభుత్వాలు స్థానికంగా బస్ సర్వీసులు పెంచాలి. మెట్రో స్టేషన్లు సహా ఇతర రవాణా వసతులకు బస్ సర్వీసులను అనుసంధానించాలి. నడక– సైకిల్ వినియోగానికి ప్రాథమిక వసతులను పెంచాలి. పౌరులు సైతం ఢిల్లీ సర్కార్ అభ్యర్థించినట్టు పదుగురు కలసి ఒకే కారులో (కార్ పూలింగ్)లో పనికి వెళ్ళడం, వాహన రద్దీని నివారించేలా వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఆశ్రయించడం, అనధికారిక నిర్మాణాలు – వ్యర్థాల దహనాన్ని నిరోధించడం లాంటివి అనుసరించాలి. స్థానిక సర్కార్లపైనే నెట్టేయడం కాక కేంద్ర ప్రభుత్వమూ తన బాధ్యత నిర్వర్తించాలి. సమష్టిగా చర్యలు చేపడితేనే ఫలితం. ఆ దిశగా ప్రతి అడుగూ అమూల్యమైనదే!

దిగుబడి అబద్ధం, అనారోగ్యం నిజం

విశ్లేషణ



డాక్టర్ దొంతి నరసింహారెడ్డి

జన్యుమార్పిడి ఆవాల విత్తన వినియోగానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చిందని అక్టోబర్ 31 నాడు మూడు జాతీయ వ్యవసాయ శాస్త్ర సంస్థల (ఐసీఎంఆర్, ఎన్ఏఎస్ఎస్, టీఏఎస్ఎస్) అధిపతులు ప్రకటించారు. జన్యుమార్పిడి ఉత్పత్తుల వరదకు గేట్లు తెరవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అనిపిస్తోంది. జన్యుపరంగా మార్పుచేసిన ఆహార పంటల వాణిజ్య సాగును అనుమతించడం వల్ల కలిగే తీవ్రమైన పర్యవసానాలను ప్రభుత్వం అర్థం చేసుకోలేదు. జన్యుమార్పిడి విత్తనాలు దిగుబడులు తేకపోగా, అనారోగ్యానికి కారణం అవుతాయని గత అనుభవాలు చెబుతున్నాయి. అయినా అవాంఛిత, హానికరమైన సాంకేతిక పరిజ్ఞాన వాడకానికి ప్రపంచంలోనే అతిపెద్ద చెత్తబుట్టగా భారత్ మారడానికి సిద్ధమవుతోంది.

యూరోపియన్ యూనియన్ జన్యుమార్పిడి (జీఎం) పంటలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడుతున్నది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ వ్యతిరేకత తరువాత, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కూడా జన్యుమార్పిడి పంటలను అనుమతించబోనని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పాలన ఉన్నప్పటికీ చైనా కూడా ప్రమాదకరమైన సాంకేతిక పరిజ్ఞానం పట్ల అప్రమత్తంగా ఉంది. ఈ తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో జన్యుమార్పిడి విత్తన రంగం మరెక్కడకు మారగలదు, భారతదేశం తప్పితే.

సాంకేతిక ఆవిష్కరణ పేరిట, జన్యుమార్పిడి ఆవాల (డీఎంహెచ్–11 రకం) వాణిజ్య సాగుకు ఆమోదం ఇవ్వవలసి వస్తే, శాస్త్రీయ నిబంధనల ప్రక్రియ ఎంత అశాస్త్రీయంగా మారిందో అర్థమవుతుంది. జన్యు ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ (జీఈఏసీ) జీఎం ఆవాలకు ఆమోదం మంజూరు చేసిన పద్ధతి అన్ని శాస్త్రీయ నిబంధనలను ఉల్లంఘిస్తుంది. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి జన్యు మార్పిడి టెక్నాలజీని ప్రవేశపెట్టాలని నీతి ఆయోగ్ చేసిన సిఫారసును ధ్రువీకరించడానికి జీఈఏసీ తన నియంత్రణను బలహీనపరిస్తే, విధాన రూపకర్తలు వ్యవసాయ సంక్షోభాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమయినట్లే.

జన్యు మార్పిడి ఆవాలు 30 శాతం ఎక్కువ దిగుబడిని ఇస్తాయి, అందువల్ల రూ.1,71,000 కోట్ల వంటనూనె దిగుమతి బిల్లును తగ్గించడానికి అవకాశం లభిస్తుందని ఒక అసంబద్ధ వాదన చేస్తున్నారు. ఆమోదించిన డీఎంహెచ్–11 రకం అధిక దిగుబడినిచ్చేది కాదు. దీని ఉత్పాదకత ప్రస్తుతం వాడుతున్న మూడు ఇతర నాన్-జీఎం రకాల కంటే తక్కువ. అన్ని శాస్త్రీయ నిబంధనల ప్రకారం, ఇది అసలు పరిశీలించాల్సిన రకం కూడా కాదు. అధిక ఉత్పాదకతతో ఇప్పటికే నాలుగు ఆవాల రకాలు ఉన్నాయని ఒక శాస్త్రవేత్త సెంటర్ ఫర్ జెనెటిక్ మానిప్యులేషన్ ఆఫ్ క్రాప్ ప్లాంట్స్, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ సౌత్ క్యాంపస్‌లో జరిగిన సమావేశంలో చెప్పారు. మూడు రకాలు ఒకే డీఎంహెచ్ శ్రేణిలో ఉన్నాయి. సంప్రదాయ రకం అయిన డీఎంహెచ్–4, జన్యుమార్పిడి ఆవాల కంటే 14.7 శాతం అధిక దిగుబడి ఇస్తుంది. రెండు విత్తన కంపెనీల (పయనీర్, అడ్వాంటా ఉత్పత్తి చేసిన) మరో రెండు రకాలు కూడా 30 శాతం అధిక దిగుబడిని ఇస్తాయి. కాబట్టి వంటనూనెల దిగుమతులను తగ్గించేందుకే అనుమతి ఇస్తున్నారన్న వాదనలో అర్థం లేదు.

2016–17లో భారతదేశం గణనీయ స్థాయిలో ఆవాలను పండించింది. అధిక ఉత్పత్తి నేపథ్యంలో ధరలు పడిపోయినాయి. రైతులకు సగటున క్వింటాలుకు రూ.400–600 వరకు ధరలు తగ్గాయి. దాదాపు 65 లక్షల హెక్టార్లలో సాగయ్యే ఆవాల పంట, దిగుబడి సమస్యలను ఎన్నడూ ఎదుర్కోలేదు. ఉన్న సమస్య కనీస మద్దతు ధర గానీ, గిట్టుబాటు ధర గానీ రాకపోవడం. నీతి ఆయోగ్ రైతులకు భరోసా ధర కల్పించే ప్రయత్నం చేయకుండా, దిగుబడి మాత్రమే సమస్య అన్నట్లుగా, అధిక దిగుబడితోనే అధిక ఆదాయం వస్తుందనే భావన కల్పిస్తున్నది.



1985లో అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం వంటనూనెల దిగుమతులను తగ్గించడం ద్వారా విదేశీ మారకంలో లోటును తగ్గించాలని భావించింది. ఈ నేపథ్యంలోనే ఆయిల్ సీడ్ టెక్నాలజీ మిషన్ ప్రారంభమైంది. ఫలితంగా, 1993–94 నాటికి భారత్ దాదాపు స్వయం సమృద్ధి సాధించింది. వంటనూనెల ఉత్పత్తి 97 శాతం దేశీయం కాగా, కేవలం 3 శాతం మాత్రమే దిగుమతి చేసుకున్నారు. కానీ ఈ 'ఎల్లో రివల్యూషన్' ఎక్కువ కాలం నిలవలేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వాలు క్రమంగా దిగుమతి సుంకాలను తగ్గించాయి. భారతదేశం విధించగల 300 శాతం దిగుమతి సుంకాల పరిమితికి వ్యతిరేకంగా, సుంకాలు దాదాపు సున్నాకు తగ్గిపోయాయి. చౌక నూనె దిగుమతులు పెరిగినాయి. ప్రధానంగా పామాయిల్ దిగుమతులు దేశీయ మార్కెట్లను ముంచెత్తాయి. కేవలం 3 శాతం దిగుమతుల నుంచి, మళ్లీ 60 శాతానికి పైగా దిగుమతి చేసుకోవడం మొదలైంది. ఫలితంగా, వర్షాధార భూములలో ఎక్కువగా పండించే నూనెగింజల రైతులు ఇతర పంటలకు మారవలసి వచ్చింది. దేశీయ వంటనూనె పరిశ్రమ నష్టాల్లోకి పోయింది. కొన్ని భారతీయ కంపెనీలు శ్రీలంకకు కూడా తరలివెళ్లాయి.

వంట నూనెల దిగుమతి ఖర్చును తగ్గించడమే లక్ష్యం అయితే, మొదట దేశీయ నూనె ఉత్పత్తికి అనుకూల వాతావరణాన్ని కల్పించాలి. దిగుమతి సుంకాలను పెంచకపోతే, విదేశీ మారకంలో తరుగును తగ్గించే ఏ చర్య అయినా అర్థరహితం అవు తుంది. ఈ విషయం నీతి ఆయోగ్‌కు తెలుసు. వంటనూనె ఉత్పత్తిని దేశీయంగా పెంచాలనే ఉద్దేశం ఉంటే భారతదేశం 'పసుపు విప్లవం' మార్గంలో నడవవలసి ఉంటుందని దానికి తెలుసు. అయినా కొన్ని విత్తన కంపెనీల వ్యాపార అభివృద్ధికే జన్యుమార్పిడి ఆవాల అనుమతి ఇచ్చారు.

జన్యుమార్పిడి ఆవాల రకం వాస్తవానికి రసాయన కలుపు నాశిని తట్టుకునే పంట. కానీ జీఈఏసీ దీనిని ఖండించింది. కాకపోతే, ఖరీదైన కలుపు నాశక రసాయనాలను రైతులు కొనలేరు కనుక వాటిని వాడే అవసరం ఉండదని వాదిస్తున్నారు. ఇది అశాస్త్రీయ వాదన. జన్యుమార్పిడి ఆవాల రకం అనుమతి వెనుక కలుపునాశక రసాయనాల కంపెనీల వ్యాపార విస్తరణ కూడా ముడిపడి ఉంది. ఇప్పటికే, హెచ్‌టీ బీటీ ప్రత్తి గింజలకు అనుమతి లేకున్నా చట్ట వ్యతిరేకంగా వేల ఎకరాలలో సాగు అవుతోంది. ఈ పంట కోసం గ్లైఫోసేట్ రసాయన వినియోగం పెరిగింది. ఇటీవల దాని ఉపయోగం అత్యంత ప్రమాదకరం అని గుర్తించిన ప్రభుత్వం, రైతులు కాకుండా, రసాయన పిచికారీ కంపెనీలు మాత్రమే చేయాలని నిబంధన తెచ్చింది. జన్యుమార్పిడి ఆవాల రకాన్ని అనుమతి ఇచ్చిన కొద్ది రోజులలోనే ఆ నిబంధన తేవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ రెండు అనుమతులు ఒకదానికొకటి సంబంధం లేనట్లు ఉన్నా, జన్యుమార్పిడి విత్తనాలు ఈ కలుపునాశక రసాయనం తట్టుకునే రకాలు కావడం విశేషం. అంటే, జన్యుమార్పిడి ఆవాల రకం విత్తనాలు రైతులు వాడితే తప్పనిసరిగా కలుపునాశక రసాయనం కొనవలసిందే. అవి వాడి రైతులు మరణిస్తే, మొత్తం ప్యాకేజికే చెడ్డ పేరు వస్తుంది కాబట్టి గ్లైఫోసేట్ రసాయన వినియోగం రైతులు కాకుండా ప్రత్యేక కంపెనీలు పిచికారీ చేసే విధంగా నిబంధన తెచ్చారు. దీని వలన, రెండు ప్రయోజనాలు: గ్లైఫోసేట్ రసాయన వినియోగం చట్టబద్ధం అవుతుంది, జన్యుమార్పిడి పంటల విస్తీర్ణం పెరుగుతుంది. భారత దేశంలో గ్లైఫోసేట్ రసాయన వినియోగం కేవలం తేయాకు తోటలలోనే చేయాలి. ఇంకెక్కడైనా చేస్తే అది చట్టవిరుద్ధం. ప్రత్యేకంగా ఆహార పంట మీద చేయడానికి వీలు లేదు. జన్యుమార్పిడి ఆవాల ద్వార హానిచేసే రసాయన అవశేషాలు కూడా వినియోగదారులకు అందుతాయి.

జన్యుపరంగా మార్పు చేసిన విత్తనాలు ప్రమాదకరమైనవి. ఆహార పదార్థాల జన్యు నిర్మాణం పక్కదారి పట్టినట్లయితే, జీవ క్రియలు, బయోకెమిస్ట్రీ ప్రభావితమవుతాయి. దాని వలన అలర్జీలు, అనేక ఇతర వ్యాధులు రావచ్చు. ఏ1, ఏ2 పాల నుండి లాక్టోస్ అలర్జీ, గోధుమల నుండి గ్లూటెన్ అలెర్జీ వంటి వాటిని ఇప్పటికే చూస్తున్నాం.

బహుళజాతి కంపెనీల లాభాపేక్ష ఆధారంగా విధానాలు రూపుదిద్దుకుంటున్నాయి. విత్తనాల మీద రైతుల హక్కులు తగ్గుతున్నాయి. బీటీ పత్తికి అనుమతి ఇచ్చిన 20 ఏళ్ళలో రైతుల పరిస్థితి మెరుగు పడకపోగా ఆత్మహత్యలు, అనారోగ్యం పెరిగినాయి. జన్యు మార్పిడి పంటల వల్ల లాభపడేది రైతులు, వినియోగదారులు కాదు. విత్తన కంపెనీలు మాత్రమే. భవిష్యత్తు పరిణామాలను దృష్టిలో పెట్టుకుని భారత పౌరులు జీఎం ఆవాలను వ్యతిరేకించాలి.

వ్యాసకర్త వ్యవసాయ విధాన విశ్లేషకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అసలైన థ్రిల్



టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పనిచేస్తున్నప్పుడు, జనాలు 'పులిని చూడాలనుంది' అనేవాళ్లు. 'చూడాలి' అనుకుంటే 'జూ'కు వెళ్లండి. కానీ పులి జాడను పసిగట్టడంలోని థ్రిల్‌ను అనుభవించాలంటే (దాని అడుగుల గుర్తులు, అలెర్ట్ కాల్స్ లాంటివి) టైగర్ రిజర్వుకు రమ్మని చెప్పేదాన్ని.

– విజయ రాత్రే, ఐఎఫ్ఎస్ అధికారి

మనవాడే చూడు!



గుజరాత్‌లో మళ్లీ బీజేపీ తిరుగులేని ఆధిక్యంతో గెలుస్తుంది. ఎందుకంటే: అత్యధిక గుజరాతీలు తమలోని ఒకరు చెప్పినట్టుగా యావద్దేశం ఆడటాన్ని గర్వంగా భావిస్తారు. మిగిలినవన్నీ చిన్న విషయాలు.

– రాకేశ్ నాయక్, ఇంజినీర్

ఎట్లా భరించాలి?



అందరూ దగ్గుతున్నారు. అందరూ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీలోని గాలి ఎంత విషపూరితమైందంటే, ఇంట్లో ఉన్నా ఉపయోగం లేకుండా ఉంది. తీవ్రమైన తలనొప్పి, కళ్లల్లో నీళ్లు, ఇంకా గాలిలో దారుణమైన తారు వాసన. ఇది ఇంతటితో ఆగేట్టు లేదు.

– సౌమ్య లఖానీ, సంపాదకురాలు

బతకాలా, వద్దా?



లండన్ ఏక్యూఐ(ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ – వాయు నాణ్యతా సూచీ) 3. న్యూయార్క్‌ది 47 దగ్గరుంది. మా సొంత నగరం పుణేలో ఇది 99. కానీ గురుగ్రామ్‌లో (ఢిల్లీకి 30 కిమీ) 500. దీన్ని ఎలా భరిస్తాం?

– డాక్టర్ జోయీతా, ఫిజీషియన్

అందుకే ఆ ముద్ర




'నైపుణ్యం లేని కార్మికులు' అనేది అంతిమంగా జనానికి తక్కువ కూలీ ఇవ్వడాన్ని సమర్థించుకోవడానికి ఉపయోగించే ప్రచార పదజాలం.

– జేసన్ హికెల్, ప్రొఫెసర్

ఇన్‌బాక్స్

ఈరోజు మనిషి!



నేల నాలుగు చెరుగులా
జాతి విద్వేషాల
కులమత జాడ్యాల
వర్ణవ్యత్యాసాల ఎదురుదాడిలో
నిర్వాసితుడిగా నిలుచున్నాడు –
ఈరోజు మనిషి.

తుపాకులు శాసించే పాలనలో
ముడుచుకున్న జెండాలపై
కమ్ముకున్న అపనమ్మకపు నీడల్లో
అస్తిత్వ రక్షణే ఎడతెగని పోరాటం.

మునుగు దాస్యాలను
శిరస్సు బంధనాలను
మంటల్లో తగలేస్తూ
కేశఖండనకు వెనుకాడక
విస్తరిస్తున్న మాతృస్వామ్యం.

కాషాయ హరిత వర్ణవలయాల–
రంగుల భ్రమల మధ్య
కోరలు చాస్తున్న మతమౌఢ్యం.

నెత్తుటి పాదాల కింద
నలుగుతున్న వర్తమాన చరిత్రలో
యుద్ధ నేరస్థుల్లా కొత్త నియంతలు.
ఇదే రోజు ప్రతిఘటనా ప్రతిహింసల–
ఆత్మరక్షణాయుధాలతో
విజృంభిస్తున్న విశ్వమానవుడు!!

– నిఖిలేశ్వర్ । 91778 81201

కళ్లముందున్న వివక్ష కనబడదా?




మల్లెపల్లి లక్ష్మయ్య

రమేష్ మెష్రం అనే విద్యార్థి ఉద్యోగం కోసం ఒక కంపెనీకి దరఖాస్తు చేసుకున్నాడు. దానికి కావాల్సిన అర్హతలన్నీ అతడికి ఉన్నాయి. కావాల్సిన డాక్యుమెంట్స్ అన్నీ పంపాడు. కానీ పిలుపు రాలేదు. తన పేరును కొంచెం మార్చి, అంటే ఇంటి పేరును సంక్షిప్తీకరించి పంపిస్తే పిలుపు వచ్చింది. ఇంటర్వ్యూలకు వెళ్ళినప్పుడు అభ్యర్థుల కుటుంబ నేపథ్యం గురించి మాట్లాడడం జరుగుతుంది. ఆధిపత్య కులాలైతే సంక్షిప్తంగా మాట్లాడడం, దళితులు, వెనుకబడిన కులాలైతే, వారి కుల వివరాలు తెలియకపోతే, మీ తండ్రి ఏం చేస్తారు? గ్రామమా? పట్టణమా? ఎటు వంటి జీవనోపాధి ఉండేది?... అట్లా కులం తెలిసేదాకా లాగడం జరుగుతుంటుంది. ఒక వ్యక్తి కులం గురించి తెలిసేదాకా ప్రయత్నం చేసే అలవాటు కంపెనీలకు ఉందని పదిహేనేళ్ళ క్రితమే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ దళిత్ స్టడీస్(ఐఐడీఎస్) బయటపెట్టింది. ఆ సర్వే సంచలనం రేపింది. దానిని 2010లో 'బ్లాకెడ్ బై కాస్ట్' పేరుతో పుస్తకంగా కూడా ముద్రించారు. దానికి ఐఐడీఎస్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ నేతృత్వం వహించారు.

ఇప్పుడు దీని ప్రస్తావన ఎందుకనే ప్రశ్న చాలా మందికి వచ్చే అవకాశం ఉంది. 'ఆక్స్‌ఫామ్' అనే అంతర్జాతీయ అధ్యయన సంస్థ ఇటీవల 'ఇండియా డిస్క్రిమినేషన్ రిపోర్టు–2020' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో కులం, మతం, స్త్రీ–పురుషులు – ఇలా రకరకాల వివక్ష కొనసాగుతోందనీ, ఉద్యోగాలు పొందడంలో, వైద్య సౌకర్యాలు అందుకోవడంలో వివక్ష ఎదురవుతోందనీ ఆ నివేదిక వెల్లడించింది. ఈ నివేదికను నేషనల్ సర్వే ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ అన్‌ఎంప్లాయ్‌మెంట్, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేల ఆధారంగా రూపొందించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకూ, మిగతా సమాజానికీ మధ్య నెలవారీ సంపాదనలో తేడా ఉందని గుర్తించారు. ఎస్సీ, ఎస్టీలు నెలకు 10,533 రూపాయలు సంపాదిస్తే, సమాజంలోని మిగతా వ్యక్తులు నెలకు సరాసరిగా రూ. 15,878 పొందుతున్నారని వెల్లడించారు. పురుషులు, మహిళల మధ్య కూడా వేతనాలు, కూలీ విషయంలో వ్యత్యాసముందని తేల్చారు. మగవారు నెలకు రూ. 19,779 సంపాదిస్తే, మహిళలు రూ. 15,578 మాత్రమే పొందుతున్నారు. పట్టణాల్లో ముస్లింలు నెలకు రూ. 13,672 సంపాదిస్తే, ఇతరులు రూ. 20,345 సంపాదిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధిలో ఎస్సీ, ఎస్టీలు 7,337 రూపాయలు పొందితే, ఇతరులు 9,174 రూపాయలు సంపాదిస్తున్నారు.

ఆర్థిక వృద్ధిలోనూ, ఆదాయం పెరగడానికి ప్రారంభించే వ్యాపారాల్లోనూ అప్పు అనేది ముఖ్యం. ఒక వ్యక్తి లేదా ఇద్దరు ముగ్గురు ఉమ్మడిగా లక్షల కోట్లు బ్యాంకుల నుంచి పొందితే, 120 కోట్ల మంది కేవలం కొన్ని కోట్ల రూపాయలను మాత్రమే అప్పుగా పొంద గలిగారు. ఎస్సీలు తాము తీసుకున్న రుణాల్లో

కొత్త కోణం



34 శాతం వాణిజ్య బ్యాంకులు, 9 శాతం సహకార బ్యాంకుల నుంచి తీసుకున్నట్టు లెక్కలు చెపుతున్నాయి. ఎస్టీలు 31 శాతం వాణిజ్య బ్యాంకులు, 29 శాతం సహకార బ్యాంకుల నుంచి తీసుకున్నట్టు లెక్కలు చెపుతున్నాయి. ఎస్సీలు అతి తక్కువ బ్యాంకు రుణాలు పొందడానికి ప్రధాన కారణం, దాదాపు 90 శాతం మందికి పైగా దళితులకు నికరమైన వ్యవసాయ భూమి లేదు. ఒకవేళ ఉన్నా అది అరెకరం, ఎకరానికి మించదు.

96 శాతం ఉద్యోగాలు కేవలం ప్రైవేట్ రంగంలోనే ఉన్నాయి. నాలుగుశాతం ఉద్యోగాలు ప్రభుత్వ అధీనంలోని సంస్థల్లో ఉన్నాయి. 2018–19లో నిరుద్యోగుల శాతం ఎస్సీ, ఎస్టీల్లో 9.9 శాతంగా ఉంటే, అది ఇతరుల్లో 7.9 శాతంగా ఉంది. నిజానికి ఉద్యోగాల మీద ఆధారపడేది ఎక్కువగా ఎస్సీ, ఎస్టీలే. వారి చేతిలో భూమి లేదు. వ్యాపారాల్లేవు. ఆర్థిక వనరులు లేవు. ఎస్సీ, ఎస్టీలకు అత్యంత అవసరమైనవే... ఉపాధి, ఉద్యోగం. కానీ వాళ్ళకు ఆ రెండూ ఆమడ దూరంలో ఉన్నాయి.


ఒక గ్రామానికి సంబంధించిన వివరాలను నేను రెండు రోజుల క్రితం సేకరించాను. ఆ గ్రామంలో ఉన్న ఆధిపత్య కులాలు భూమిని కలిగి ఉన్నాయి. అదే ఆధారంతో ఉద్యోగార్హమైన చదువులు చదివారు. విదేశాల్లో తమ పిల్లలను చదివించి, ఉద్యోగాల్లో స్థిరపరిచారు. వెనుకబడిన కులాలకు ఆదాయాన్ని పొందే కుల వృత్తులున్నాయి. వాటి ద్వారా బతుకు దెరువుకు ఇబ్బంది లేని జీవితాలను గడుపుతున్నారు. 25 శాతానికి పైగా ఉన్న ఎస్సీలు మాత్రం బతుకు వెళ్ళదీయడానికి పరుగులు పెడుతున్నారు. వారు భద్రత కలిగిన ఉద్యోగాల్లో లేరు. తరతరాలుగా కుల వ్యవస్థ అవలంబించిన వివక్ష ప్రజల జీవితాలను నియంత్రిస్తున్నది.

పరిస్థితి ఇట్లా ఉంటే, ఇటీవల కొంతమంది తప్పుడు భావాలను ప్రచారం చేస్తున్నారు. దళితులు కొందరి పట్ల విద్వేషాన్ని రెచ్చగొడు తున్నారని మాట్లాడుతున్నారు. పైన పేర్కొన్న వాస్తవాలు దళితులను రోజురోజుకీ ఇంకా పేదరికంలోకి, అభద్రతలోనికి నెడుతున్నాయి. వేలాది మంది దళితులు ఆధిపత్య కులాల చేతుల్లో హత్యలకు, అత్యాచారాలకు గురయ్యారు. ఎక్కడా కూడా దళితులు తిరిగి అణచివేతకు పూనుకోలేదు. దళితుల మీద నిందలు వేసేవాళ్లు అధ్యయనం చేయడం మంచిది. అంతిమంగా ఈ వివక్షను, హింసను ఎట్లా నివారించాలో, నిర్మూలించాలో ఆలోచిస్తే మంచిది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు
మొబైల్: 81063 22077

మేడిపండు ప్రజాస్వామ్యం

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

భారత రాజ్యాంగంలో పేర్కొన్న పార్లమెంట్, శాసనసభల వ్యవస్థలు, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం వంటివి చెప్పే ప్రజాస్వామ్యం మేడిపండు లాంటిదని కొన్ని సంవత్సరాలుగా రుజువవుతూనే ఉంది. నేడు తెలంగాణలో ఫామ్ హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం ఆ కంపును మరింత వ్యాపింప చేసింది.

మొదట్లో పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం లేని కారణంగా కొందరు పార్టీలు మారి కొన్ని ప్రభుత్వాల పతనానికి కారకులయ్యారు. 1952–67 మధ్య కాలంలో ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కేరళ, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపులు జరిగి ప్రభుత్వాలు మారిపోయాయి. 1967లో లోక్‌సభతో పాటు 16 రాష్ట్రాల్లో సాధారణ ఎన్నికలు జరగగా... ఎనిమిది రాష్ట్రాల్లో కాంగ్రెస్ మెజారిటీ కోల్పోయింది. రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పెద్ద పార్టీగా ప్రభుత్వాలు ఏర్పాటు చేసి, తర్వాత పార్టీ ఫిరాయింపులు చేయించి మెజారిటీ పొందింది. 1967–71 మధ్య పార్లమెంట్, శాసన సభకు ఎన్నికైన 4 వేలమంది సభ్యుల్లో 2 వేల మంది పార్టీ ఫిరాయింపులు చేశారు.



పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 1979లో తొలి సారి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రూపొందించింది. 1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 52వ రాజ్యాంగ సవరణ చేసి ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చింది. 2003లో వాజ్‌పేయి ప్రభుత్వం 91వ రాజ్యాంగ సవరణ ద్వారా 10వ షెడ్యూల్‌లోని పార్టీ ఫిరా యింపుల నిరోధక చట్టానికి మరికొన్ని సవరణలు చేసింది. దీని ప్రకారం ఒక పార్టీ తరపున టికెట్టు పొంది ఎన్నికైన సభ్యుడు ఆ పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడూ, పార్టీ జారీ చేసిన విప్‌కు వ్యతిరేకంగా ఓటింగ్‌కు హాజరు కాన ప్పుడూ, విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేసినప్పుడూ, స్వతంత్ర సభ్యులుగా ఎన్నికైన సభ్యులు ఏదైనా పార్టీలో చేరినప్పుడూ; నామినేట్ అయిన పార్లమెంట్, శాసన సభ సభ్యులు 6 నెలల్లోపు ఏదైనా పార్టీలో చేరినప్పుడూ సభ్యత్వాలు రద్దు అవుతాయి.

ఈ చట్టంలో కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. ఒక రాజకీయ పార్టీ మొత్తం శాసన సభ్యుల్లో 2/3 వంతుల మంది వేరే పార్టీలో చేరినప్పుడు, లేదా స్వతంత్రంగా పార్టీ పెట్టినప్పుడు వారి సభ్యత్వాలు రద్దు కావు. చట్టంలో ఉన్న కంతలు ఉపయోగించుకుని కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు తన వ్యతిరేక రాష్ట్ర ప్రభుత్వాలను కూలుస్తున్నాయి. 2016లో అరుణాచల్‌ప్రదేశ్‌లో 45 కాంగ్రెస్ సభ్యుల్లో ఆ పార్టీ సీఎంతో సహా 44 మంది సభ్యులు 'పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌ప్రదేశ్'లో విలీనమయ్యారు. తెలంగాణలోనూ 2/3 మంది కాంగ్రెస్ సభ్యులు టీఆర్ఎస్‌లో చేరారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ సభ్యుల చేత రాజీనామా చేయించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టించి, తన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది బీజేపీ. 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయకుండానే టీడీపీలో చేరి కొందరు మంత్రులయ్యారు.

బీజేపీ, టీఆర్ఎస్ మధ్య తాజాగా టీఆర్ఎస్ శాసనసభ సభ్యుల కొనుగోలు వ్యవహారంలో వివాదం సాగుతోంది. పరస్పర ఆరోపణలు జుగుప్సాకరంగా సాగుతున్నాయి. ఇదంతా చూస్తుంటే దేశంలో ప్రజాస్వామ్యం ఎంత బాగా పరిఢ విల్లుతోందో అర్థమవుతోంది. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రజలు ఉద్యమించాలి.

వ్యాసకర్త రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,
రైతు కూలీ సంఘం (ఏపీ) । 98859 83526



గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.7.02 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.1.47 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ఉ.8.55 నుండి 10.26 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.21 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.07 నుండి 12.54 వరకు, **అమృతఘడియలు:** సా.6.07 నుండి 7.38 వరకు, ప్రబోధనైకాదశి ; **రాహుకాలం :** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం :** ప.3.00 నుండి 4.30 వరకు ; **సూర్యోదయం** 6.03 ; **సూర్యాస్తమయం** 5.26.

ఐఎన్ఎస్ డేగాలో యాంటీ హైజాక్ మాక్ డ్రిల్

• ప్రధాని పర్యటన నేపథ్యంలో నిర్వహించిన నౌకాదళం


హైజాక్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్న మెరైన్ కమాండోలు, సీఐఎస్ఎఫ్ బృందాలు

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళ యుద్ధ విమాన స్థావర కేంద్రం ఐఎన్ఎస్ డేగాలో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు యాంటీ హైజాక్ మాక్ డ్రిల్ నిర్వహించారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఆనుకొని ఉన్న డేగాలో హైజాక్ వంటి హఠాత్పరిణామాలు సంభవించినప్పుడు ఏ విధంగా ఎదుర్కొనాలనే అంశంపై ఈ యాంటీ హైజాక్ ఆపరేషన్ చేపట్టారు. ప్రతిఏటా ఈ తరహా హైజాక్ ఆపరేషన్స్ నిర్వహిస్తుంటామని నౌకాదళ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 11, 12 తేదీల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టిన యాంటీ హైజాక్ మాక్ డ్రిల్ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

రూ.37 లక్షల విలువైన పాన్ మసాలా, సిగరెట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పాన్ మసాలా, సిగరెట్ బాక్సులను చూపుతున్న జీఎస్టీ అధికారులు

నరసన్నపేట: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం మడపాం టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఎటువంటి పత్రాలు లేకుండా కంటైనర్‌లో రవాణా అవుతోన్న సిగరెట్లు, పాన్ మసాలా ప్యాకెట్లను జీఎస్టీ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.37.08 లక్షలు ఉంటుందని విజయనగరం జీఎస్టీ జాయింట్ కమిషనర్ కె.రఘునాథరెడ్డి తెలిపారు. నరసన్నపేట జీఎస్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా వాహనాలు పరిశీలిస్తుండగా 'స్వాగత్ బ్రాండ్' పేరుతో 2 రకాల ప్యాకింగ్‌లతో 96 పాన్ మసాలా బ్యాగులు, పారిస్ బ్రాండ్ టొబాకో ప్రైవేట్ లిమిటెడ్ ఇండియా పేరుతో 21 సిగరెట్ బాక్సులు గుర్తించామన్నారు. ఇవి భువనేశ్వర్ నుంచి విశాఖ వెళ్తున్నాయని, రవాణాకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేవని చెప్పారు. ఇవి బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో గత నెల 27న పట్టుబడిన సిగరెట్ల మాదిరిగానే ఉన్నాయన్నారు. ఆ సిగరెట్లను ఇప్పటి వరకూ ఎవరూ క్లెయిమ్ చేయడానికి రాలేదని, దీంతో రైల్వే స్టేషన్ నుంచి జీఎస్టీ కార్యాలయానికి తరలించామని చెప్పారు. సమావేశంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ టి.శ్రీనివాసరావు, డీసీలు యు.కేశవరావు, కమలాకర్ ఉన్నారు.

నిర్మాణ సంస్థపై ఐటీ దాడులు

సిరిపురంలోని కార్యాలయంతో పాటు పలు చోట్ల తనిఖీలు

సాక్షి, విశాఖపట్నం: దేశంలో పలు కీలక నిర్మాణ ప్రాజెక్టులు చేపడుతున్న సంస్థపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పన్ను ఎగవేత ఆరోపణలతో అక్టోబర్ 31 నుంచి విశాఖపట్నంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సిరిపురంలో ఉన్న నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు శాఖ కార్యాలయాలు, యజమాని ఇళ్లు, బంధువుల ఇళ్లల్లోనూ నాలుగు రోజులుగా ఏకకాలంలో దాడులు కొనసాగించారు. సదరు సంస్థ నేవల్ ప్రాజెక్టులు, స్మార్ట్ సిటీ, రూరల్ ఎలక్ట్రిఫికేషన్, జాతీయ రహదారులు, పైప్‌లైన్ ప్రాజెక్టుల్ని నిర్వహిస్తున్నది. అయితే.. ఆదాయపు పన్నుని ఎగవేసేందుకు లేని ఖర్చులు చూపిస్తూ సదరు సంస్థ రిటర్న్స్ ఫైల్ చేసింది. ఈ వ్యవహారంలో అనుమానాలు తలెత్తడంతో ఐటీ అధికారులు లోతైన విచారణ చేపట్టి.. పన్ను ఎగవేసేందుకు తప్పుడు లెక్కలు చూపించినట్లు రూఢీ అయిన తర్వాత.. విశాఖపట్నం ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు విభాగాధికారులు దాడులు ప్రారంభించారు. వరుసగా నాలుగు రోజుల పాటు సోదాలు నిర్వహించారు. పన్ను ఎగవేతకు సంబంధించిన ఆధారాలతో పాటు.. కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ భారీగా ఉంటుందని ఐటీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

అధైర్య పడొద్దు.. అన్ని విధాల ఆదుకుంటాం

• సీఎం ఆదేశాల మేరకు ఆరుద్రను కలిసి భరోసా ఇచ్చిన అధికారులు
• క్షణికావేశంలోనే గాయం చేసుకున్నానని తెలిపిన ఆరుద్ర

లబ్బీపేట(విజయవాడతూర్పు): తన కుమార్తె వైద్య ఖర్చుల కోసం ఏనాడు ప్రభుత్వాన్ని సాయం కోరలేదని, ముఖ్యమంత్రిని కలవలేక పోతున్నాననే ఆవేదన, క్షణికావేశంలో మాత్రమే చేతికి గాయం చేసుకున్నట్లు కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలేనికి చెందిన ఆరుద్ర తనను కలిసిన ఉన్నతాధికారులకు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం సమీపాన తన చేతికి గాయం చేసుకుని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజులపూడి ఆరుద్రను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ఎం.హరికృష్ణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీపీ కాంతి రాణా టాటా పరామర్శించారు. ఆరుద్ర, ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం న్యాయం చేస్తుందని ధైర్యంగా ఉండాలని సీఎం చెప్పారని, ఆయన ఆదేశాల మేరకే తాము వచ్చినట్లు తెలిపారు. కాగా నిస్సహాయురాలైన ఓ మహిళ తన సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడం కోసం ప్రయత్నిస్తే ఆ ఉదంతాన్ని కూడా


ప్రభుత్వాస్పత్రిలో ఆరుద్ర నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి హరికృష్ణ, సీపీ కాంతిరాణా టాటా

రాజకీయంగా ఉపయోగించుకోవడానికి ఎల్లో మీడియా ప్రయత్నించడం చూసి జనం విస్తుపోతున్నారు. ఆరుద్రను కలసిన అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని చెప్పారు. ఆరుద్ర కుమార్తె సాయి లక్ష్మికి మూడు నెలల వయసులోనే స్పైనల్ వ్యాధికి ఆపరేషన్ జరిగిందని, కొంతకాలం ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నా, తర్వాత తిరిగి అనారోగ్యానికి గురవడంతో వెల్లూరు, లక్నో వంటి అనేక ప్రాంతాల్లో వైద్యం చేసినా మెరుగుపడలేదన్నారు. అమెరికాలో అధునాతన వైద్యం చేయిస్తే కోలుకోవచ్చని కొందరు వైద్యులు చెప్పినట్లు తెలిపారు. కుమార్తె వైద్య ఖర్చుల కోసం అమలాపురంలో ఉన్న తమ ఆస్తులను రూ.62 లక్షలకు విక్రయించినట్లు ఆరుద్ర చెప్పారని కలెక్టర్ పేర్కొన్నారు. శంఖవరం మండలం అన్నవరంలోని తన ఇంటిని అమ్మడానికి ప్రయత్నిస్తే ఇరువైపులా ఉన్న కానిస్టేబుళ్లు శివయ్య, కన్నయ్య, ముత్యాలరావులు అడ్డుపడటమే కాకుండా, న్యాయపరమైన చిక్కులు సృష్టించారని, వారిపై 2020లో జిల్లా ఎస్పీకి, ఆ తర్వాత కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకున్నారని తెలిపినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో తన కుమార్తెకు విదేశాల్లో వైద్యం అందించలేక పోతున్నాననే బాధతో సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావాలని ప్రయత్నించినట్లు ఆరుద్ర తెలిపారని పేర్కొన్నారు. గత నెల 31న ఎ-కన్వెన్షన్ హాలు వద్ద సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా, భద్రతా కారణాల వలన పోలీసులు అనుమతించలేదన్నారు. ఈ నెల 2న కుమార్తెతో కలిసి సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకుని అధికారులను కలవగా, సమస్య కోర్టు పరిధిలో ఉందని, పౌర సమస్యలను స్థానికంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారని ఆమె తెలిపినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని కలవలేక పోయాననే మనస్తాపంతోనే ఆవేశంలో చేతికి గాయం చేసుకున్నానని ఆరుద్ర వివరించిందని తెలిపారు. కుమార్తె అనారోగ్యం వల్ల 2018లో గ్రూప్-2 ఉద్యోగానికి ఎంపికైనా చేరలేక పోయానని, తన ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో మరొకసారి అవకాశం కల్పించాలని ఆరుద్ర కోరినట్లు కలెక్టర్ తెలిపారు.

నూతన పరిశోధనలతోనే దేశం పురోగతి: గవర్నర్ హరిచందన్

మంగళగిరి: నూతన పరిశోధనలతోనే దేశం పురోగతి సాధిస్తుందని, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఇవి ఎంతగానో దోహద పడతాయని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విశ్వవ్యాప్తంగా అభివృద్ధి పథంలో పయనించే ఏ దేశమైనా శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందడుగు వేసినవేనన్నారు. ఇస్రో, కేంద్ర అణు ఇంధన శాఖల సహకారంతో ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏర్పాటు చేసిన శాస్త్ర సాంకేతిక ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ ప్రదర్శన 3 రోజులు నిర్వహించనున్నారు. వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్ అధ్యక్షతన జరిగిన సభలో గవర్నర్ ప్రసంగిస్తూ..సమాజానికి ఉపకరించే నూతన పరిశోధనల దిశగా కృషి చేయాలని విద్యావేత్తలు, శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. కేంద్రం అమలు చేస్తోన్న జాతీయ విద్యా విధానం సరికొత్త భారతావనికి పునాది వేసిందన్నారు. దేశాన్ని ఇది సూపర్ పవర్‌గా మార్చనుందన్నారు. అనంతరం గవర్నర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ గోపికృష్ణ, గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, వర్సిటీ వీసీ మనోజ్ కె.అరోరా, ప్రో వీసీ డాక్టర్ డి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ హరిచందన్

8న శ్రీవారి ఆలయం మూత..

• ఎస్ఎస్‌డీ టోకెన్లు రద్దు

తిరుమల: ఈ నెల 8న చంద్ర గ్రహణం కారణంగా 12 గంటల పాటు శ్రీవారి ఆలయాన్ని మూసివేస్తారు. ఆ రోజున బ్రేక్ దర్శనం, శ్రీవాణి, రూ.300 దర్శనం, ఇతర ఆర్జిత సేవలను, తిరుపతిలో ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీని టీటీడీ రద్దు చేసింది. గ్రహణ సమయం ముగిసిన తర్వాత వైకుంఠం-2 నుంచి దర్శనానికి అనుమతిస్తారు. 8న మధ్యాహ్నం 2.39 గంటల నుంచి సాయంత్రం 6.27 గంటల వరకు చంద్ర గ్రహణం ఉన్న కారణంగా ఉదయం 8.40 నుంచి రాత్రి 7.20 గంటల వరకు ఆలయ తలుపులు మూసివేస్తారు. ఆ రోజున ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ఇతర ప్రాంతాల్లో కూడా అన్న ప్రసాద వితరణ ఉండదు. రాత్రి 8.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ ప్రారంభమవుతుంది.

సర్వ దర్శనానికి 30 గంటలు

తిరుమలలో రద్దీ అధికంగా ఉంది. 31 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వ దర్శనానికి 30 గంటలు, రూ.300 దర్శనానికి 3 గంటలు పడుతోంది. బుధవారం అర్ధరాత్రి వరకు 68,995 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 29,037 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.71 కోట్లు వేశారు. తిరుమలలో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కాగా, శ్రీవారిని గురువారం సినీ నటుడు అల్లు శిరీష్ దర్శించుకున్నారు.


శ్రీవారి ఆలయం వెలుపల భక్తులు

5న డయల్ యువర్ ఈవో

డయల్ యువర్ ఈవో కార్యక్రమం ఈ నెల 5న శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి ఫోన్‌లో తెలపవచ్చు. ఇందుకుగాను 0877-2263261 నంబర్‌ను సంప్రదించాలి.

విశాఖలో ఆదిశంకరుల భారీ విగ్రహం

• విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర వెల్లడి


స్వరూపానందేంద్ర సరస్వతికి జ్ఞాపికను అందజేస్తున్న విజయేంద్ర సరస్వతి

సింహాచలం/అంబాజీపేట: విశాఖలో ఆదిశంకరాచార్యుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. ప్రపంచాన్ని ఆకర్షించేలా శంకరుల ప్రతిమ ఉంటుందని చెప్పారు. కోనసీమ జిల్లా ముక్కామలలో కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతిని స్వరూపానందేంద్ర సరస్వతి, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి గురువారం కలిసి వైదిక, ఆధ్యాత్మిక, సంప్రదాయపరమైన అంశాలపై చర్చించారు. స్వరూపానందేంద్ర మాట్లాడుతూ వానప్రస్థంలోకి అడుగుపెడుతోన్న వృద్ధ దంపతుల కోసం పురాణ, వేదాంత పరమైన ధర్మ సందేహాల నివృత్తికి ప్రత్యేక కోర్సుని ప్రవేశ పెట్టే ఆలోచన ఉందని, 2- 3 ఏళ్ల నిడివితో కోర్సుని రూపొందించాలని భావిస్తున్నామని విజయేంద్ర సరస్వతి దృష్టికి తీసుకెళ్లారు. స్వరూపానందేంద్ర యోచన పట్ల విజయేంద్ర సరస్వతి హర్షం వ్యక్తం చేశారు. అర్చకత్వం, ఆలయ సంపద పరిరక్షణ తదితర అంశాలపై కూడా ఇరువురూ చర్చించారు. హైందవ ధర్మం పరిరక్షణకు విశాఖ శ్రీశారదాపీఠం చేస్తున్న కృషిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని విజయేంద్ర సరస్వతి చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ధర్మం కోసం ధైర్యంగా మాట్లాడే పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి అని ఆయన పేర్కొన్నారు. అనేకసార్లు గురువులు జయేంద్ర సరస్వతితో కలిసి విశాఖ శ్రీశారదాపీఠాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. పీఠం నుంచి వెలువడిన అనేక వేదాంత గ్రంథాలను పరిశీలించినట్టు తెలిపారు. అమలాపురం ఎంపీ అనూరాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు యతీంద్రులను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ముక్కామలలో నిర్వహించిన బ్రహ్మసత్ర మహోత్సవ ముగింపు కార్యక్రమానికి పీఠాధిపతులు హాజరయ్యారు. పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకర భారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉభయ భాషా ప్రావీణ్యులుగా అభివృద్ధి చెందాలి

ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు

సాక్షి, అమరావతి: తెలుగు ప్రజలు ఉభయ భాషా ప్రావీణ్యులుగా అభివృద్ధి చెందాలని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. సచివాలయంలో గురువారం ఆయన పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన అందిస్తుండడం శుభపరిణామమన్నారు. ప్రపంచీకరణలో రాణించాలంటే మాతృభాషతో పాటు ఆంగ్లభాష తప్పనిసరని అభిప్రాయపడ్డారు. ఆంగ్లంలో పట్టు సాధిస్తేనే విద్యార్థులు భవిష్యత్తులో తెలుగు భాషా వికాసానికి, సంస్కృతికి ప్రపంచ వ్యాప్తంగా బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారన్నారు. తెలుగును పాలన భాషగా అన్ని శాఖల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోర్టుల్లో తెలుగులో వాదనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. అధికార భాషా సంఘానికి కొత్తరూపు తీసుకొచ్చేందుకు త్వరలోనే ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పదాలను సరళీకృతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తెలుగును మరింత సులభతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, తెలుగు-సంస్కృతం అకాడమీల చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీ పార్వతి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పి.విజయబాబు

అమరావతి రాజకీయ యాత్రను నిలిపేయాలి

• 767వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: సుప్రీం కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండగా యాత్రలు ఎందుకు చేస్తున్నారంటూ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకుని అమరావతి రాజకీయ యాత్రను నిలిపేస్తే మంచిదని బహుజన పరిరక్షణ సమితి నేతలు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 767వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో గురువారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అభూత కల్పనలు సృష్టించి ప్రాంతీయ విభేదాలతో శాంతి భద్రతలకు విఘాతం కల్పించేందుకు బాబు అండ్ కో యత్నిస్తున్నారని విమర్శించారు. అమరావతి ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు న్యాయస్థానాలను కూడా తప్పుదారి పట్టించేలా సంబంధం లేని వ్యక్తులతో తప్పుడు పిటిషన్లు వేయిస్తున్నారని ఆరోపించారు. కొంత మంది కులవాదులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో సమితి నేతలు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు పడుచూరి మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్)

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతి వాసవీ నిత్యాన్నదాన వానప్రస్థాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు పడుచూరి వెంకటేశ్వర్లు (87) బుధవారం రాత్రి మరణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా, గుంటూరు మిర్చియార్డు చైర్మన్‌గా ఆయన పనిచేశారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతిని సందర్శించే ఆర్యవైశ్య యాత్రికులకు భోజనం, వసతి కల్పించేవారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి విరాళాలు సేకరించి వాసవీ నిత్యాన్నదాన వాన ప్రస్థాశ్రమాన్ని నిర్మాణం చేసి సుమారు 25 ఏళ్ల నుంచి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.


యెకోసుకా తీరంలో భారత యుద్ధనౌక

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూకు భారత యుద్ధ నౌకలు

ఈ నెల 6 నుంచి జపాన్‌లో ఐఎఫ్ఆర్

సాక్షి, విశాఖపట్నం : జపాన్‌లో ఈ నెల 6న ప్రారంభం కానున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో పాల్గొనేందుకు భారత యుద్ధనౌకలు బుధవారం యెకోసుకా తీరానికి చేరుకున్నాయి. తూర్పు నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ శివాలిక్, ఐఎన్ఎస్ కమోర్తా యుద్ధ నౌకలు ఐఎఫ్ఆర్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ ఐఎఫ్ఆర్‌లో 13 దేశాలకు చెందిన 40 యుద్ధనౌకలు, జలాంతర్గాములు పాల్గొంటున్నాయి. ఫ్లీట్ రివ్యూని జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా సమీక్షించనున్నారు. ఐఎఫ్ఆర్‌లో పాల్గొన్న అనంతరం.. భారత యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ శివాలిక్, ఐఎన్ఎస్ కమోర్తా జపాన్‌లో జరిగే మలబార్ 26వ ఎడిషన్ విన్యాసాల్లో పాల్గొననున్నాయి. నవంబర్ 8 నుంచి 18 వరకు జరిగే మలబార్‌లో భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాల నౌకాదళాలు పాల్గొంటాయి.

కేంద్ర జలసంఘం బృందం పోలవరం పరిశీలన


ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న కేంద్ర జలసంఘం నిపుణుల బృందం

పోలవరం రూరల్: కేంద్ర జలసంఘం నిపుణుల బృందం సభ్యులు పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో చర్చించారు. పీపీఏ డైరెక్టర్ దేవేంద్రరావు, కేంద్ర జలసంఘం డిజైన్స్ విభాగానికి చెందిన చీఫ్ ఇంజనీర్ అనిల్ జైన్, డైరెక్టర్ దీపక్ సి.భట్, డిప్యూటీ డైరెక్టర్ అశ్విని కుమార్‌వర్మ, సీఎస్ఎంఆర్ఎస్ డైరెక్టర్ మనీష్‌గుప్త గురువారం ఉదయం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. దిగువ కాఫర్‌డ్యామ్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మించాల్సిన ప్రదేశంలో నిలిచిన వరద నీటిని మళ్లిస్తున్న పనులనూ పరిశీలించారు. గ్యాప్-1, గ్యాప్-2 నిర్మాణ పనుల వివరాలను మ్యాప్ ద్వారా సీఈ సుధాకర్‌బాబు వివరించారు. ఎగువ కాఫర్ డ్యామ్ సమీపంలో జరుగుతున్న శాండ్ ఫిల్లింగ్ పనులను పరిశీలించారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ అతిథి గృహంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. గోదావరి వరదల కారణంగా ఏ మేరకు పనులు నిలిచిపోయాయి, ఏమైనా నష్టాలు జరిగాయా అనే విషయాలను కూడా సమావేశంలో తెలుసుకున్నారు. వరద క్రమేపీ తగ్గుతుండడంతో రాబోయే రోజుల్లో చేయాల్సిన పనులపై సమీక్షించారు.

అత్యాధునిక విధానంలో తపాలా సేవలు

పోస్టల్ సర్వీస్ బోర్డు సభ్యురాలు, పోస్టల్ బ్యాంకింగ్ విభాగాధిపతి మంజూ పాండే

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దేశ వ్యాప్తంగా తపాలాశాఖలో అత్యాధునిక పద్ధతిలో మెరుగైన సేవలందించడమే ప్రధాన లక్ష్యమని పోస్టల్ సర్వీస్ బోర్డు సభ్యురాలు, పోస్టల్ బ్యాంకింగ్ విభాగాధిపతి మంజూ పాండే స్పష్టం చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని హెడ్ పోస్టాఫీస్‌ను గురువారం ఆమె సందర్శించారు. పోస్టల్ బ్యాంకింగ్ సర్వీస్ గురించి, పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్ కంట్రోలింగ్ విభాగాన్ని సందర్శించి ఆన్‌లైన్‌లో ఏ విధంగా సేవలు అందిస్తున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ దేశంలో తపాలాశాఖ లక్షా 55వేల బ్రాంచ్‌లతో ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. ప్రస్తుతం ఐటీ ప్రాజెక్ట్‌ను అత్యాధునీకరణతో ప్రజలకు అందేలా ప్రణాళికను రూపొందించామన్నారు. విజయవాడ రీజియన్ పోస్టల్ మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్ మూర్తి, గుంటూరు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రాజ్‌భవన్ ప్రాంగణంలోని చందనం చెట్టు మాయం

భువనేశ్వర్: ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్ ఆవరణలో ఉన్న అరుదైన చందనం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేశారు. అత్యంత భద్రత ఉండే ప్రాంతంలో ఉన్న చెట్టును మంగళవారం దుండగులు నరికేసి, ఎత్తుకుపోయారు. గవర్నర్ అధికార నివాసంలో చోటుచేసుకున్న ఘటనపై రాజ్‌భవన్ వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా కొందరు అనుమానితులపై నిఘా పెట్టామని, దోషులెవరో త్వరలోనే తేలుస్తామని పోలీసులు గురువారం చెప్పారు. చందనం చెట్ల పరిరక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఎగుమతులపై నిషేధం విధించింది. చందనం కలపను కోతకు, రవాణాకు అటవీ శాఖ నుంచి ముందుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

మహారాష్ట్రకు 2 లక్షల కోట్ల ప్రాజెక్టులు: మోదీ

ముంబై: మహారాష్ట్రలో రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల వల్ల కొత్త ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. సుమారు 75 వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేసేందుకు గురువారం ముంబైలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి ఈ మేరకు ఒక వీడియో సందేశం పంపించారు. మహారాష్ట్రకు రావాల్సిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఎన్నికలు జరిగే గుజరాత్‌కు తరలిపోతున్నాయంటూ ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు తీవ్రమైన సమయంలో ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం.

గని ప్రమాదంలో 21 మృతదేహాలు లభ్యం


జోహన్నెస్‌బర్గ్: అక్రమ మైనింగ్ కూలీల ప్రాణాలను బలి తీసుకుంది. బంగారం గనిలో అనుమతి లేకుండా తవ్వకాలు సాగిస్తూ పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటిదాకా 21 మృతదేహాలు లభ్యమయ్యాయి. దక్షిణాఫ్రికాలో జోహన్నెస్‌బర్గ్ నగరానికి పశ్చిమాన ఉన్న క్రుగెర్స్‌డార్ప్ పట్టణంలో ఈ దారుణం చోటుచేసుకుంది. బుధవారం మధ్యాహ్నం 19, గురువారం ఉదయం 2 మృతదేహాలను కనుగొన్నట్లు పోలీసులు తెలియజేశారు. గనిలో మరో చోట చనిపోయివారి మృతదేహాలను ఇక్కడికి తీసుకొచ్చి పడేసినట్లు తాము అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. ఇది ప్రైవేట్ బంగారం గని, ఇక్కడ తవ్వకాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవని చెప్పారు. క్రుగెర్స్‌డార్ప్ ప్రాంతంలో గనులు అధికంగా ఉన్నాయి. ఇక్కడ తరచుగా గనుల్లో ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది జూలైలో ఓ గనిలో సినిమా షూటింగ్ కోసం వచ్చిన 8 మంది మహిళలపై గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారం చేసి, వారివద్దనున్న సొత్తును దోచుకున్నారు.

ఉక్రెయిన్ విద్యుత్ 'రష్యా' ప్రాంతాలకు !

కీవ్: యూరప్‌లోనే పెద్దదైన ఉక్రెయిన్‌లోని జపోరిజియా అణు విద్యుత్ కేంద్రం నుంచి దేశీయ పవర్ గ్రిడ్‌కు అనుసంధానంగా ఉన్న విద్యుత్ లైన్లు రష్యా దాడుల్లో ధ్వంసమయ్యాయి. దాడుల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థలో పెద్దస్థాయిలో నష్టం జరిగిందని ఉక్రెయిన్ అణువిద్యుత్ అధీకృత సంస్థ ఎనర్గోటామ్ గురువారం వెల్లడించింది. 'అణు విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి ఉక్రెయిన్ పవర్ గ్రిడ్‌కు వెళ్లే లైన్లను క్షిపణులతో ధ్వంసంచేశారు. రష్యా గ్రిడ్‌తో అనుసంధానించేందుకు కుట్రకు తెరలేపారు. భవిష్యత్‌లో ఇక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రష్యా ఆక్రమిత క్రిమియా, డోన్బాస్ ప్రాంతాలకు తరలించేందుకు ఆ వైపు లైన్లను పునరుద్ధరిస్తున్నారు' అని ఎనర్గోటామ్ టెలిగ్రామ్ చానెల్‌లో ఆరోపించింది.

'ఉప' పోరు ప్రశాంతం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గురువారం ఉప ఎన్నికలు జరిగాయి. మహారాష్ట్రలోని అంధేరి(తూర్పు)లో అత్యల్పంగా 31.74% పోలింగ్ నమోదైంది. బిహార్‌లోని మొకామాలో 53.45%, గోపాల్‌గంజ్‌లో 51.48%, హరియాణాలోని ఆదంపూర్‌లో 75.25%, యూపీలోని గోలా గోరఖ్‌నాథ్‌లో 57.35%, ఒడిశాలోని ధామ్‌నగర్‌లో 66.63% పోలింగ్ నమోదైంది. స్వల్ప ఘటనలు మినహా మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు. పోటీ ప్రధానంగా బీజేపీకి, ప్రాంతీయ పార్టీలకు మధ్యనే నడిచింది. అంధేరి(తూర్పు) నియోజకవర్గ శివసేన అభ్యర్థి రుతుజా లట్కే గెలవచ్చు.. శివసేనకు ఎన్సీపీ, కాంగ్రెస్ మద్దతు ఇస్తుండటంతోపాటు బీజేపీ అభ్యర్థి బరి నుంచి వైదొలిగారు. శివసేన ఎమ్మెల్యే రమేశ్ లట్కే మృతి చెందడంతో ఆయన భార్య పోటీలో ఉన్నారు. ఉప ఎన్నికలు జరిగిన 7 స్థానాల్లో బీజేపీకి 3, కాంగ్రెస్‌కు 2, శివసేనకు ఒకటి, ఆర్జేడీకి చెందిన ఒక సిట్టింగ్ సీటు ఉన్నాయి. 6న ఓట్ల లెక్కింపు ఉంటుంది.



గురువారం చెన్నైలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఇలా గణేశన్ కుటుంబ వేడుకలో పాల్గొని కేరళ వాయిద్యకారులతో కలిసి దోలు వాయిస్తున్న సీఎం మమతా బెనర్జీ

రెండు దశల్లో గుజరాత్ ఎన్నికలు

- డిసెంబర్ 1న తొలి దశ, 5న రెండో దశ
- హిమాచల్ ప్రదేశ్‌తోపాటు 8న ఓట్ల లెక్కింపు
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- 100 శాతం నిష్పక్షపాతంగా గుజరాత్ ఎన్నికల షెడ్యూల్
- సీఈసీ రాజీవ్ కుమార్ స్పష్టీకరణ



షెడ్యూల్ విడుదల చేస్తున్న కమిషనర్లు రాజీవ్ కుమార్, అనూప్ చంద్ర పాండే

సాక్షి, న్యూఢిల్లీ: గుజరాత్ శాసనసభ ఎన్నికల సంగ్రామానికి తెరలేచింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ గురువారం గుజరాత్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. రెండు దశల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 182 అసెంబ్లీ స్థానాలుండగా.. తొలిదశలో 89 స్థానాలకు డిసెంబర్ 1న, రెండో దశలో 93 స్థానాలకు డిసెంబర్ 5న పోలింగ్ జరుగనుంది. కాగా, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపుతోపాటే డిసెంబర్ 8న గుజరాత్ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. రాష్ట్రంలో 142 జనరల్, 17 ఎస్సీ, 23 ఎస్టీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 51,782 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 4.9 కోట్ల మంది ఓటర్లలో 2.53 కోట్ల మంది పురుషులు, 2.37 కోట్ల మంది మహిళలు, 1,417 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

ఆలస్యం వెనుక ఎలాంటి ఉద్దేశం లేదు: సీఈసీ

హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు గుజరాత్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయకపోవడం పట్ల వచ్చిన విమర్శలపై కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ స్పందించారు. గుజరాత్ షెడ్యూల్‌ను 100 శాతం నిష్పక్షపాతంగా విడుదల చేశామని, ఆలస్యం వెనుక కేంద్ర ఎన్నికల సంఘానికి ఎలాంటి ఉద్దేశం లేదని చెప్పారు. వాతావరణం, సమీప రాష్ట్రాల్లో ఎన్నికలు, ప్రస్తుత అసెంబ్లీ పదవీ కాలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గుజరాత్ 14వ శాసనసభ పదవీకాలం 2023 ఫిబ్రవరి 18న ముగియనుందని, 110 రోజుల ముందే షెడ్యూల్ ప్రకటించామని తెలిపారు. నిజానికి రెండు రోజుల క్రితమే షెడ్యూల్ విడుదల చేయాలని భావించామని, మోర్బీ తీగల వంతెన ప్రమాదం కారణంగా రాష్ట్రంలో విషాదం నెలకొందని, అందుకే కొంత ఆలస్యమైందని వివరించారు. రెండు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను రెండు వారాల తేడాతో విడుదల చేసినప్పటికీ, ఓట్ల లెక్కింపు మాత్రం ఒకేరోజు (డిసెంబర్ 8) జరుగుతుందని పేర్కొన్నారు.

మళ్లీ డబుల్ ఇంజన్ సర్కారు: నడ్డా

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పందించారు. ఈ షెడ్యూల్‌ను స్వాగతిస్తున్నామని, రాష్ట్రంలో మరోసారి డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని తేల్చిచెప్పారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారీ మెజార్టీతో తమ పార్టీ విజయం సాధించబోతోందని అన్నారు. మరో ఐదేళ్లపాటు గుజరాత్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పని చేస్తామని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఇమ్రాన్ ఖాన్‌పై కాల్పులు

- 'లాంగ్ మార్చ్' నిర్వహిస్తుండగా కలకలం
- అతి సమీపం నుంచి కాల్పులు జరిపిన యువకుడు
- ఇమ్రాన్ కుడి కాలికి తూటా గాయం.. తప్పిన ప్రాణాపాయం
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకే కాల్చానన్న నిందితుడు



కాల్పులు జరిపిన వ్యక్తిని పట్టుకుంటున్న దృశ్యం



ఇమ్రాన్ (ఫైల్)

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్(70)పై యువకుడు కాల్పులు జరపడం తీవ్ర సంచలనం సృష్టించింది. నిరసన కార్యక్రమంలో భాగంగా వాహనంలో వెళ్తుండగా కాల్పులు జరిగాయి. ఇమ్రాన్ కుడి కాలుకు స్వల్ప గాయమైందని, ఆసుపత్రికి తరలించారని, ఆయనకు ప్రాణాపాయం తప్పిందని స్థానిక మీడియా వెల్లడించింది. పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని వజీరాబాద్ పట్టణంలో అల్లావాలా చౌక్ వద్ద గురువారం ఈ సంఘటన చోటుచేసుకుంది. యువకుడి కాల్పుల్లో మొత్తం ఆరుగురు గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెహ్రీక్ నేత అసద్ ఉమర్ చెప్పారు. ఇమ్రాన్‌ను లాహోర్‌కు తరలించారు. దేశంలో ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ 'లాంగ్ మార్చ్'లో నిర్వహిస్తుండగా ఇమ్రాన్‌పై దుండగుడు కాల్పులు జరిపాడని జియో టీవీ వెల్లడించింది. కాల్పులు జరిపిన వ్యక్తిని ఘటనా స్థలంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాల్పుల్లో ఇమ్రాన్ సన్నిహితుడు, సెనేటర్ ఫైజల్ జావెద్ గాయపడ్డారు. ఈ ఘటనలో తమ పార్టీ కార్యకర్త ఒకరు మరణించారని, మరొకరు గాయాలపాలయ్యారని ఫైజల్ జావెద్ తెలిపారు. ఇమ్రాన్ ఖాన్ కాలికి తూటా గాయమైందని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ ట్వీట్‌చేసింది.

నా లక్ష్యం ఇమ్రాన్ ఒక్కడే: నవీద్

కాల్పులు జరిపిన వ్యక్తిని నవీద్ అనే యువకుడిగా గుర్తించినట్లు స్థానిక మీడియా తెలిపింది. సల్వార్ కమీజ్ ధరించి, కంటైనర్ పక్కనే నడుస్తూ అదను చూసుకొని ఎడమ వైపు నుంచి కాల్పులు ప్రారంభించాడని వివరించింది. పాకిస్తాన్ ప్రజలను ఇమ్రాన్ ఖాన్ తప్పుదోవ పట్టిస్తున్నాడని, అది సహించలేక అతడిని అంతం చేసేందుకు ప్రయత్నించానంటూ నిందితుడు నవీద్ అంగీకరించాడని 'డాన్' పత్రిక తెలియజేసింది. రాజకీయ పార్టీలతో గానీ, ఉగ్రవాద, మత సంస్థలతో గానీ తనకు సంబంధం లేదని, తన లక్ష్యం కేవలం ఇమ్రాన్ మాత్రమేనని నవీద్ చెప్పినట్లుగా ఒక వీడియో బయటకు వచ్చింది.

ఖండించిన షెహబాజ్ షరీఫ్

ఇమ్రాన్‌పై కాల్పుల ఘటనను పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఉదంతంపై వెంటనే నివేదిక సమర్పించాలని పాక్ హోంశాఖ మంత్రి సనావుల్లాను ఆదేశించారు.

గుజరాత్‌లో ముక్కోణపు పోటీ!

- ఎన్నికల బరిలో బీజేపీ, కాంగ్రెస్, ఆప్
- ప్రచారంలో ముందంజలో రెండు పార్టీలు
- బీజేపీకి గుబులు పుట్టిస్తున్న ప్రజా వ్యతిరేకత
- ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో పాగా వేసేందుకు ఆప్ తహతహ

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పోరు మొదలయ్యింది. కొత్తగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆగమనంతో ఈసారి ముక్కోణపు పోటీ జరగబోతోంది. రాష్ట్రంలో దశాబ్దాలుగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ఎన్నికల పోటీ కొనసాగుతోంది. ఇప్పుడు 'ఆప్' సైతం ఆ రెండు పార్టీలకు సవాళ్లు విసురుతూ రణరంగంలోకి అడుగు పెడుతోంది. ఇప్పటికే ప్రచారాన్ని ఉధృతం చేసింది. హిందుత్వ కార్డుతో పాటు డబుల్ ఇంజన్ సర్కారు, సుపరిపాలన కొనసాగింపు అంటూ అధికార బీజేపీ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, ముఖ్య నేతలు గుజరాత్‌లో తరచుగా పర్యటిస్తున్నారు. ఇటీవలి కాలంలో రూ.వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. జనంపై హామీల వర్షం కురిపించారు. నరేంద్ర–భూపేంద్ర (గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్) భాగస్వామ్యానికి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ధరలు, నిరుద్యోగం పెరగడంతో పాటు మోర్బీ పట్టణంలో తీగల వంతెన దుర్ఘటన బీజేపీకి ఇబ్బందికరంగా పరిణమించింది. బిల్కిస్ బానో కేసులో దోషులకు శిక్ష తగ్గించడం, ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత, ప్రశ్నాపత్రాల లీక్ వల్ల పరీక్షలను వాయిదా వేయడం, గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, వంటి సౌకర్యాలు కొరవడడం, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం దక్కకపోవడం, రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు అధ్వాన్నంగా మారడం, విద్యుత్ చార్జీలు పెరిగిపోవడం, ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం బలవంతపు భూసేకరణ పట్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు బీజేపీని బెంబేలెత్తిస్తున్నాయి. రాష్ట్రంలో 1995 నుంచి చూస్తే మధ్యలో రెండేళ్లు మినహా(1996–1998) ఆ పార్టీ అధికారంలో కొనసాగుతోంది.

కాంగ్రెస్‌లో నిస్తేజం

మిగతా పార్టీల సంగతి ఎలా ఉన్నప్పటికీ గుజరాత్‌లో నెగ్గడం బీజేపీకి అత్యంత కీలకం. వరుసగా ఆరు సార్లు గెలిచిన ఆ పార్టీ మరోసారి విజయంపై కన్నేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం కావడంతో బీజేపీ ఈసారీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలో 27 ఏళ్లుగా ప్రతిపక్ష పాత్రకే పరిమితం అవుతున్న కాంగ్రెస్ ఈసారి అధికార పక్షంగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. అయితే, ప్రచార పర్వంలో వెనుకబడడం, పార్టీ జాతీయ నాయకులు ఇప్పటికీ గుజరాత్ వైపు కన్నెత్తి చూడకపోవడం ప్రతికూలంగా మారింది. యువనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో తీరిక లేకుండా ఉన్నారు. రాష్ట్రంలో ప్రచారంలో ఆయన పాల్గొంటారా లేదా అనేది నిర్ధారణ కాలేదు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు పైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. 182 అసెంబ్లీ స్థానాలున్న గుజరాత్‌లో ప్రస్తుత అసెంబ్లీలో బీజేపీకి 111, కాంగ్రెస్‌కు 62, ఎన్సీపీకి ఒకరు, భారతీయ ట్రైబల్ పార్టీ(బీటీపీ)కి ఇద్దరు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు. ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్, ఆప్ తోపాటు మరికొన్ని చిన్న పార్టీలు సైతం ఎన్నికల బరిలో నిలుస్తున్నాయి. ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా గుజరాత్ ఎన్నికలపై దృష్టి పెట్టారు. మైనార్టీ ఓటర్లు అధికంగా ఉన్న కొన్ని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను ప్రకటించారు.

'ఆప్' సంక్షేమవాదం

ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ ఓటర్లపై సంక్షేమ వల విసురుతున్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతున్నారు. పంజాబ్‌ను చేజిక్కించుకొని ఉత్సాహంతో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకి గుజరాత్‌పై ఆశలు పెరుగుతున్నాయి. గుజరాత్‌లో పాగా వేస్తే జాతీయ స్థాయిలో తమ ప్రతిష్ట ఇనుమడించి, బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా అవతరించడం ఖాయమని ఆప్ భావిస్తోంది. సంక్షేమవాదాన్నే ఆ పార్టీ నమ్ముకుంది. నెలకు 300 యూనిట్ల ఉచిత కరెంటు, పిల్లలకు ఉచిత విద్య, నిరుద్యోగ యువతకు భృతి, మహిళలు, కొత్త న్యాయవాదులకు ప్రతినెలా రూ.1,000 చొప్పున భత్యం వంటివి 'ఆప్' ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారాయి. కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా గుజరాత్‌లో ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు. ఇతర పార్టీల కంటే ముందే 'ఆప్' ప్రచారం ప్రారంభించడం విశేషం. ఇప్పటికే 73 స్థానాల్లో అభ్యర్థులను సైతం ప్రకటించింది.

గోల్డ్ కేసులో జోక్యం చేసుకోవాల్సి వస్తుంది

కేరళ ప్రభుత్వానికి గవర్నర్ హెచ్చరికలు

తిరువనంతపురం/న్యూఢిల్లీ : కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం మధ్య మరోసారి దుమారం చెలరేగింది. గవర్నర్ ఖాన్ ఈసారి గోల్డ్ స్మగ్లింగ్ వివాదాన్ని లేవనెత్తారు. ముఖ్యమంత్రి విజయన్ రాష్ట్రంలో ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంలో తాను జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గవర్నర్ ఖాన్ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, యూనివర్సిటీల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారంటూ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆరోపించిన మర్నాడు గురువారం గవర్నర్ ఖాన్ న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీల్లో ఆరెస్సెస్ అజెండాపై సీఎం ఒక్క ఉదాహరణ అయినా చూపగలరాని ప్రశ్నించారు. యూనివర్సిటీల్లో ఆరెస్సెస్‌కి చెందిన వారిని నియమించడానికే ప్రస్తుతమున్న వైస్ ఛాన్సలర్లపై చర్యలు తీసుకుంటున్నానని ప్రభుత్వం ఆరోపిస్తోంది. దానిని రుజువు చేస్తే గవర్నర్ పదవికి తాను రాజీనామా చేస్తానని, అలా రుజువు చెయ్యలేకపోతే సీఎం రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు. ''కేరళ ప్రజలు ప్రస్తుతం గోల్డ్ స్మగ్లంగ్ గురించి, అందులో ముఖ్యమంత్రి కార్యాలయం ప్రమేయం గురించి చర్చించుకుంటున్నారు. ఈ కేసులో శివశంకర్ పాత్ర ఏంటి ? ఎందుకు ఆయనని తొలగించారు ? ఈ కేసులో సీఎంఒ ప్రమేయం ఉందని తేలితే నేను ఇందులో జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది'' అని గవర్నర్ హెచ్చరికలు జారీ చేశారు.

7న రష్యాకు జై శంకర్

న్యూఢిల్లీ: విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ ఈ నెల 7, 8వ తేదీల్లో రష్యాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఆయన రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో మాస్కోలో భేటీ అవుతారు. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరుపుతారని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చీ గురువారం చెప్పారు. ఫిబ్రవరిలో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక వీరిద్దరు నాలుగుసార్లు సమావేశమయ్యారు. అమెరికా, పశ్చిమదేశాలు రష్యాపై అన్ని రకాలుగా తీవ్ర ఆంక్షలు విధించాయి. ఆయా దేశాల అభ్యంతరాలను సైతం లెక్క చేయకుండా భారత్ రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను ఇటీవలి కాలంలో పెంచింది.

దమ్ముంటే అరెస్ట్ చేయండి



రాంచీలోని తన నివాసం వద్ద మాట్లాడుతున్న హేమంత్

రాంచీ: నేరం చేశానని భావిస్తే అరెస్ట్ చేయండంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సవాల్ విసిరారు. అక్రమ మైనింగ్ కేసులో విచారణ నిమిత్తం రాంచీలోని తమ కార్యాలయానికి గురువారం ఉదయం 11 గంటలకు రావాలని గతంలోనే సీఎంకు ఈడీ సమన్లు జారీచేసింది. అయితే, ఆ సమన్లు బేఖాతరు చేస్తూ ఆయన గైర్హాజరు అయ్యారు. గురువారం తన షెడ్యూల్‌లో భాగంగా వేరే చోటఏర్పాటుచేసిన పార్టీ కార్యకర్తలతో సభలో సీఎం ప్రసంగించారు. 'కుట్రలో భాగంగా నాపై అక్రమ మైనింగ్ కేసు మోపారు. అంతపెద్ద నేరం చేశానని మీరు భావిస్తే వెంటనే వచ్చి అరెస్ట్‌చేయండి. విచారణ పేరుతో సమన్లు జారీచేయడం ఎందుకు?' అంటూ సభలో ఈడీపై సోరెన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నేనేం భయపడట్లేదు. నిజానికి ప్రజామద్దతుతో మరింత శక్తివంతుడినయ్యా. జార్ఖండ్ వాసులే గనక ఒక్కటయ్యారంటే వైరి వర్గాలు దాక్కోవడానికి జార్ఖండ్‌లో ఒక్క చోటు కూడా ఉండదు' అని సోరెన్ వ్యాఖ్యానించారు. కాగా, ఈడీ ముందు హాజరుకావడానికి తనకు మూడు వారాల వ్యవధి కావాలని ఆయన కోరినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో తాజా తేదీతో ఆయనకు మరోసారి సమన్లు జారీచేసే వీలుందని తెలుస్తోంది. మరోవైపు అక్రమ మైనింగ్ కేసులో సోరెన్ సహాయకుడు పంకజ్ మిశ్రాను ఈడీ గతంలోనే అరెస్ట్‌చేసింది. మరోవైపు లాభదాయక పదవి అంశంలో ఈసీ సిఫార్సులో ఏముందో, తన అభిప్రాయమేమిటో తేల్చకుండా రాష్ట్ర గవర్నర్ రమేశ్ రెండు నెలలుగా రాష్ట్రంలో సందిగ్ధ పరిస్థితిని కొనసాగిస్తున్నారని సోరెన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

స్కూళ్లలో ఔట్‌డోర్ బంద్

ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడంతో..



ఢిల్లీలో అక్షరధామ్ ఆలయం వద్ద దుమ్ముధూళి

న్యూఢిల్లీ: ఢిల్లీలో గాలి కాలుష్యం పెరగడంతో విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై పాఠశాలల యాజమాన్యాలు దృష్టిసారించాయి. 'పాఠశాలల ప్రాంగణాల్లో చిన్నారుల ఆటపాటలు, ఇతరత్రా కార్యక్రమాలు ఉండబోవు. గదుల్లో శ్వాస సంబంధ, యోగా తరగతులు నిర్వహిస్తాం. విద్యాసంవత్సం దెబ్బతినకుండా ఉండేందుకు బోధనను కొనసాగిస్తాం. స్కూళ్ల మూసివేత ఉండదు' అంటూ కొన్ని పాఠశాలలు నిర్ణయం తీసుకున్నాయి. స్కూళ్లో ఎయిర్ ప్యూరిఫయర్లు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాయి. గాలి కాలుష్యం రోజురోజుకూ పెరుగుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ఢిల్లీలో స్కూళ్లు మూసేయాలన్న చిన్నారుల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) సూచనపై విద్యార్థుల తల్లిదండ్రులు స్పందించారు. 'పాఠశాల టైమింగ్స్ పెంచడంతో పెద్దగా ఉపయోగం లేదు. స్కూళ్లు మూసేయాలి. వాయు కాలుష్యంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు' అని ఢిల్లీ స్కూల్ విద్యార్థుల సంఘం అధ్యక్షులు అపరాజితా గౌతమ్ డిమాండ్‌చేశారు. అయితే, 'స్కూళ్లు కొనసాగాల్సిందే. లాక్‌డౌన్‌లతో ఇప్పటికే చదువులు దెబ్బతిన్నాయి. పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నాయి. ఇంకొంత సేపు స్కూల్ టైమింగ్స్ పెంచాలి' అని కొందరు తల్లిదండ్రులు వాదిస్తున్నారు. కాగా, ఈనెల 8వ తేదీ వరకు 8వ తరగతిదాకా పిల్లలకు ఆన్‌లైన్‌లోనే క్లాసులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అత్యంత ఆసక్తిదాయక స్థలమిదే

న్యూయార్క్: అంతర్జాల ప్రపంచంలో అత్యంత ఆసక్తిదాయకమైన వేదిక అంటూ ఏదైనా ఉందంటే అది ట్విట్టర్ మాత్రమేనని ఆ సంస్థ నూతన అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. ట్విట్టర్ ఖాతా అధీకృతమైనదని తేల్చి చెప్పే 'బ్లూ' టిక్ గుర్తు సదుపాయంతో కొనసాగే ప్రీమియం ఖాతాదారుల నుంచి నెలకు ఎనిమిది డాలర్ల రుసుము అమలుచేయాలన్న ఆలోచనల నడుమ తన ట్విట్టర్ సంస్థ ప్రాధాన్యతను మస్క్ గుర్తుచేశారు. 'ట్విట్టర్ అనేది ఇంటర్నెట్‌లో అత్యంత ఇంట్రెస్టింట్ ప్లేస్. అందుకే నేను చేసిన ఈ ట్వీట్‌ను వెంటనే ఇప్పటికిప్పుడే చదివేస్తున్నారు'అని అన్నారు. 'బ్లూ టిక్‌కు చార్జ్ చేస్తే అత్యంత క్రియాశీలకమైన వ్యక్తులు ఇకపై ట్విట్టర్‌ను వదిలేస్తారు. డబ్బులు రాబట్టేందుకు మీడియా, వ్యాపార సంస్థలే ఖాతాలు కొనసాగిస్తాయి. చివరకు ట్విట్టర్ ఒక బిల్‌బోర్డ్‌లాగా తయారవుతుంది' అని బ్లూ టిక్ యూజర్ కస్తూరి శంకర్ ట్వీట్ చేశారు. 'తాము ఏ(సెలబ్రిటీ) ఖాతాను ఫాలో అవుతున్నామో సాధారణ యూజర్లకు తెలుసు. ప్రత్యేకంగా బ్లూ టిక్ అక్కర్లేదు' అని మరొకరు ఎద్దేవాచేశారు.

ఏడాదిలో 20 వేలకు పైగా స్కూళ్లు మూసివేత

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా గత విద్యా సంవత్సరంలో 2020–21లో 20 వేలకు పైగా స్కూళ్లు మూతపడ్డాయని కేంద్ర విద్యా శాఖ తాజా నివేదిక వెల్లడించింది. అంతకు ముందు ఏడాదితో పోల్చి చూస్తే టీచర్ల సంఖ్య 1.95% తగ్గిందని తెలిపింది. దేశంలో 44.85% స్కూళ్లకు మాత్రమే కంప్యూటర్ సదుపాయం ఉందని, 34% పాఠశాలల్లో మాత్రమే ఇంటర్నెట్ సదుపాయం ఉందని పాఠశాల విద్యపై యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడీఐఎస్‌ఈ+) నివేదించింది.

- 2020–21లో 15.09 లక్షల స్కూళ్లు ఉంటే 2021–22లో 14.89లక్షలకి తగ్గిపోయాయి.
- 2020–21లో 97 లక్షలున్న టీచర్ల సంఖ్య 2021–22 నాటికి 95 లక్షలకి తగ్గిపోయింది.
- దివ్యాంగుల విద్యార్థుల కోసం ప్రత్యేక టాయిలెట్లు 27%స్కూళ్లలోనే ఉన్నాయి.
- 2020–21లో 25.38 కోట్ల మంది ఉండే విద్యార్థుల సంఖ్య 2021–22 వచ్చేసరికి 25.57 కోట్లకి పెరిగింది.
- ప్రి ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల చేరిక11.5 లక్షలు తగ్గింది. కరోనా ప్రభావంతో చిన్న పిల్లల్ని స్కూళ్లలో చేర్పించడానికి తల్లిదండ్రులు ఇష్టపడకపోవడంతో వారి సంఖ్య తగ్గింది.

అవినీతిపరులను వదిలిపెట్టొద్దు

- అధికారులకు ప్రధాని మోదీ పిలుపు
- 'కంప్లైంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' పోర్టల్ ప్రారంభం
- సీవీసీ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవం



న్యూఢిల్లీ: అవినీతిని అరికట్టే విషయంలో కఠినంగా వ్యవహరించాలని అవినీతి వ్యతిరేక సంస్థలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. నీతిమాలిన వ్యవహారాలను నియంత్రించేటప్పుడు స్వార్థపరులు దర్యాప్తు సంస్థలకు మకిలి అంటించే ప్రయత్నం చేస్తుంటారని, సవాళ్లు ఎదురైనా ఆత్మరక్షణలో పడిపోవద్దని చెప్పారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహనా వారోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడారు. అవినీతిపరులు ఎంత గొప్పవారైనా సరే వదిలిపెట్టొద్దని సీవీసీతోపాటు ఇతర సంస్థలకు, అధికారులకు సూచించారు. అక్రమార్కులు రాజకీయంగా, సామాజికంగా రక్షణ పొందకుండా చూడాల్సిన బాధ్యత సీవీసీలాంటి సంస్థలపై ఉందన్నారు. ప్రతి అవినీతిపరుడిని జవాబుదారీగా మార్చడం సమాజం విధి అని చెప్పారు. అలాంటి వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యమని తెలిపారు. తప్పుడు పనులకు పాల్పడినవారు ఏమాత్రం సిగ్గుపడకుండా ప్రముఖులుగా చెలామణి అవుతూ యథేచ్ఛగా తిరుగుతున్నారని, జనం సైతం వారితో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపుతున్నారని, మన సమాజానికి ఇలాంటి పరిణామం శ్రేయస్కరం కాదని స్పష్టం చేశారు.

ఆ జాడ్యాలను వదిలిస్తున్నాం..

సీవీసీ లాంటి సంస్థలు దేశ సంక్షేమానికి పాటుపడుతున్నాయని, నిజాయితీగా పని చేస్తున్నప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని ప్రధాని మోదీ చెప్పారు. మనం రాజకీయ అజెండాతో పని చేయడం లేదని, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే మన బాధ్యత అని ఉద్బోధించారు. అవినీతి వ్యతిరేక సంస్థలు తమ ఆడిటింగ్, ఇన్‌స్పెక్షన్లను టెక్నాలజీ సాయంతో ఆధునీకరించుకోవాలని సూచించారు. అవినీతిని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించడం లేదని గుర్తుచేశారు. ప్రభుత్వ శాఖలు, విభాగాలన్నీ అవినీతిపై యుద్ధం చేయాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే అవినీతిని సహించలేని పరిపాలనా వ్యవస్థ కావాలన్నారు. ప్రభుత్వ అధినేతగా కొనసాగుతున్న తనపైనా ఎన్నోసార్లు బురద చల్లారని, దూషించారని తెలిపారు. నిజాయతీ, నిర్భీతిగా పని చేస్తే ప్రజలు మన వెంటే మద్దతుగా నిలుస్తారని వివరించారు. బ్రిటిషర్ల పాలనలో ఆరంభమైన అవినీతి, దోపిడీ, వనరులపై గుత్తాధిపత్యం వంటి జాడ్యాలు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా కొనసాగాయని, గత ఎనిమిదేళ్లుగా సంస్కరణల ద్వారా వాటిని వదిలిస్తున్నామని, పాలనలో పారదర్శకతను ప్రవేశపెట్టామని వెల్లడించారు.

ఫిర్యాదుల స్థితిగతులపై పోర్టల్

సీవీసీ ఆధ్వర్యంలో నూతన 'కంప్లైంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' పోర్టల్‌ను మోదీ ప్రారంభించారు. అవినీతిపై తాము ఇచ్చిన ఫిర్యాదుల స్థితిగతులను ఈ పోర్టల్ ద్వారా ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. 'ఎథిక్స్, గుడ్ ప్రాక్టీసెస్: కంపైలేషన్ ఆఫ్ బెస్ట్ ప్రాక్టీసెస్ ఆన్ ప్రివెంటివ్ విజిలెన్స్' అనే అంశంపై పుస్తకాలను ప్రధానమంత్రి విడుదల చేశారు. 'అభివృద్ధి చెందిన దేశం కోసం అవినీతి రహిత భారతం' అనే అంశంపై సీవీసీ దేశవ్యాప్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలో విజేతలుగా నిలిచిన ఐదుగురు విద్యార్థులకు అవార్డులు అందజేశారు.

ఆగని ఉ.కొరియా క్షిపణులు

సియోల్: ఉత్తరకొరియా క్షిపణుల ప్రయోగ పరంపర గురువారమూ కొనసాగింది. ఖండాంతర బాలిస్టిక్ మిస్సైల్(ఐసీబీఎం) సహా కనీసం ఆరుక్షిపణులను ప్రయోగించింది. తాజా పరిణామంతో జపాన్ ఉలిక్కిపడింది. రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడంతోపాటు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా కోరింది. రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని ఓ ప్రాంతం నుంచి గురువారం ఉదయం 7.40 గంటలకు ఒక ఐసీబీఎంను, ఒక గంట తర్వాత అక్కడికి సమీపంలోని కచియోన్ నుంచి రెండు తక్కువ శ్రేణి మిస్సైళ్లను ఉత్తరకొరియా ప్రయోగించినట్లు దక్షిణకొరియా సైన్యం ధ్రువీకరించింది. పొరుగు దేశాల భూభాగాల్లోకి ప్రవేశించకుండా నివారించేందుకు ఐసీబీఎంను ఎత్తులో ప్రయోగించి ఉండవచ్చని తెలిపింది. ఈ క్షిపణి 2 వేల కిలోమీటర్ల ఎత్తులో 750 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఉంటుందని జపాన్ పేర్కొంది. తమ గగనతలం మీదుగా మాత్రం వెళ్లలేదని తెలిపింది. ఈ ప్రయోగంతో అప్రమత్తమైన జపాన్ ప్రభుత్వం ..అండర్‌గ్రౌండ్ లేదా పటిష్టమైన భవనాల్లోకి వెళ్లి తలదాచుకోవాలంటూ మియాగి, యమగట, నిగట ప్రిఫెక్చర్ల ప్రజలను కోరింది. ఆయా ప్రాంతాల్లో బుల్లెట్ రైళ్లను కొద్దిసేపు నిలిపివేశారు. అనంతరం క్షిపణి ప్రయోగాలపై ఉత్తరకొరియా ఒక ప్రకటన చేసింది. దక్షిణకొరియా, అమెరికాలు సైనిక విన్యాసాలను కొనసాగించాలని తీసుకున్న నిర్ణయంపై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించింది. తర్వాత మరో 3 క్షిపణుల్ని ప్రయోగించింది.

సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 4 । నవంబర్ । 2022

ఆలయ అర్చక సిబ్బందికీ ఆరోగ్యశ్రీ

అరసవల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు, సిబ్బందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి అర్హులుగా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా దేవదాయ శాఖాధికారి టి.అన్నపూర్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికాదాయం రూ.5 లక్షలు లోపున్న వారు ఈ పథకానికి అర్హులని, అర్చకులు, ఆలయ సిబ్బంది అంతా తమ ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సమీప గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. సమస్యలుంటే జిల్లా దేవదాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఆదిత్యునికి స్వర్ణాలంకరణ



అరసవల్లి: కార్తీక మాస శుద్ధ ఏకాదశి శుక్రవారం నుంచి శుద్ధ ద్వాదశి, త్రయోదశి పర్వదినాల్లో స్వర్ణాలంకరణతో ఉన్న ఆదిత్యుని దర్శనం భక్తులకు కలగనుంది. నేటి నుంచి వరుసగా మూడు రోజుల పాటు పూర్తి బంగారు ఆభరణాలు, మకరతోరణంతో కూడిన ఆదిత్యుడు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. శనివారం సాయంత్రం 4.15 గంటల నుంచి తెప్పోత్సవంలో శ్రీవారి ఉత్సవమూర్తులను హంసవాహనంపై విహరించనున్నారు.

విక్రయానికి సిద్ధంగా టీటీడీ క్యాలెండర్లు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం 2023 సంవత్సరం క్యాలెండర్లు, డైరీలు విశాఖలోని టీటీడీ కల్యాణ మండపంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని మేనేజర్ హైమావతి ఓ ప్రకటనలో తెలిపారు. పెద్ద డైరీ ఒక్కటి రూ.150లు, 12 పేజీల క్యాలండర్ ఒక్కటి రూ.130లు, ఎస్వీ క్యాలండర్ ఒక్కటి రూ.20లు, ఎస్వి అండ్ ఎస్పి క్యాలండర్ ఒక్కటి రూ.15లు అని తెలిపారు.

న్యూస్‌రీల్

పీజీ 1, 4 సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని పోస్టు గ్రాడ్యుయేషన్ 1, 4 సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు గురువారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 780 మంది హాజరు కాగా, 681 మంది ఉత్తీర్ణత సాధించారు. 87.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. నాలుగో సెమిస్టర్‌లో 751 మంది పరీక్షకు హాజరు కాగా, 684 మంది ఉత్తీర్ణత సాధించారు. 91.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది డిగ్రీలో విశ్వవిద్యాలయం పరిధిలో 6,626 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వీసీ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో 1709, నాలుగో సెమిస్టర్‌లో 2684, నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీలో 792, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీలో 1064, ఇన్‌స్టెంట్‌లో 377 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలు వచ్చిన 15 రోజుల్లో విద్యార్థులు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

విష జ్వరాలపై కదిలిన యంత్రాంగం



కపాసుకుద్దిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్ జెన్నా

సాక్షి ఎఫెక్ట్...

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్దిలో 'విష జ్వరాల పంజా' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్ జెన్నా ఆధ్వర్యంలో రాజపురం పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రాథమికంగా వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరాలతో ఉన్నవారికి మందులు ఇచ్చారు. 50 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి డెంగీ పరీక్షలకు పంపిస్తామని చెప్పారు. శుక్రవారం మరికొంత మంది రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాజపురం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నౌకా విహారానికి చకచకా ఏర్పాట్లు



హంస వాహనంలో ఏర్పాట్లపై ఎస్‌ఐ గణేష్‌తో చర్చిస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఈనెల 5న శనివారం సాయంత్రం నిర్వహించనున్న తెప్పోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఉదయం వన్‌టౌన్ ఎస్‌ఐ బలివాడ గణేష్‌తో కలిసి ఆయన హంస వాహనాన్ని పరిశీలించారు. అనంతరం భక్తులకు అందించాల్సిన సౌకర్యాలపై వివరాలను ఎస్‌ఐకి వివరించారు. భక్తులు ఈశాన్య గేటు నుంచి పుష్కరిణి వైపునకు వస్తారని, తిరిగి సింహద్వారం నుంచి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు. అనంతరం హంసవాహనాన్ని అధికారులు పరిశీలించి.. శుక్రవారం ట్రయల్ రన్‌కు సిద్ధమని ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సర్వేయర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భావనపాడు పోర్టుకు లైన్ క్లియర్

- ఎకరాకు రూ.25లక్షలు చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం
- సంతృప్తి వ్యక్తం చేసిన పోర్టు నిర్వాసితులు
- సుదీర్ఘ సంప్రదింపుల తరువాత కొలిక్కి వచ్చిన నిర్వాసితుల డిమాండ్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

భావనపాడు పోర్టు నిర్వాసితుల డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సుదీర్ఘ సంప్రదింపులు తరువాత నిర్వాసితుల వ్యవహారం కొలిక్కి వచ్చింది. ఎకరాకు రూ.25లక్షల పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నిర్వాసిత రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. పోర్టు నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రపురం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో రైతులతో జరిగిన సమీక్ష సమావేశంలో రైతులకు, అధికారులకు మధ్య అంగీకారం కుదిరింది. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు సమక్షంలో రూ.20 లక్షల నుంచి రూ.25లక్షలకు పరిహారం పెంపునకు నిర్ణయం తీసుకోవడంతో రైతులంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోర్టు నిర్మాణానికి సహకరించిన ఇరుగ్రామాల నిర్వాసిత రైతులకు ప్రభుత్వం తరపున మంత్రులు, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపి దుశ్శాలువలతో సత్కరించారు. రైతుల త్యాగాలు మరువలేనివని మంత్రులు, అధికారులు ప్రశంసించారు.



భావనపాడు నిర్వాసితులతో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు



నిర్వాసితులను సత్కరిస్తున్న దృశ్యం

అవినీతి తుపాను



- హుద్‌హుద్ ఇళ్ల పేరిట టీడీపీ మాజీ సర్పంచ్ భారీ దోపిడీ
- 400 మంది నుంచి రూ.12వేలు చొప్పున రూ.48 లక్షలు వసూలు
- రోడ్డెక్కి ఆందోళన చేసిన కుందువానిపేట వాసులు

శ్రీకాకుళం రూరల్:

ఓ వైపు రాకాసి గాలివాన వచ్చి ఇల్లూ వాకిలీ ఏకం చేసేసింది. రాత్రికి రాత్రి గృహాలను ధ్వంసం చేసేసింది. ఇలాంటి బాధితులకు ఏ నాయకుడైనా ఏం చేస్తాడు..? చేతనైనంత సాయం చేసి.. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చి ధైర్యం కల్పిస్తాడు. కానీ శ్రీకాకుళం పరిధిలోని కుందువానిపేటకు చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్న స్టైల్ వేరు. ఆపదలోనూ అవకాశం వెతుక్కోవాలి అనే అధినేత మాటను బాగా వంటబట్టించుకున్నట్టు ఉన్నారు. ఇల్లు కోల్పోయి ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్న బాధితుల వద్దకు వెళ్లి బేరం పెట్టారు. హుద్‌హుద్ ఇళ్ల కోసం దాదాపు 400 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.12వేలు చొప్పున రూ.48 లక్షలు దండేశారు. ఆ తర్వాత బాధితుల ముఖం చూడడమే మానేశాడు. దీంతో ఎన్నో రోజులు ఎదురు చూసిన బాధితులు గురువారం రోడ్డెక్కారు. స్థానిక హుద్‌హుద్ కాలనీలో మూకుమ్మడిగా బైఠాయించి టీడీపీ నాయకుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి డబ్బులు ఇచ్చామని, ఇప్పుడు డబ్బులు అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమంటూ బెదిరిస్తున్నాడని తెలిపారు.



కుందువానిపేటలో రోడ్డెక్కిన బాధితులు

ఈ టీడీపీ నేత లీలలు ఇక్కడితో ఆగిపోలేదు. కుందువానిపేట, ఇప్పిలి గ్రామ సరిహద్దులో టీజీఐ ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీ వాహనాలు ఊరి ద్వారా వెళ్లాలంటే గ్రామానికి రోజుకు రూ.10వేలు చొప్పున నెలకు రూ.3లక్షలు చెల్లించాలని ఆ కంపెనీ ప్రతినిధుల వద్ద గ్రామమంతా చెప్పినట్లు అబద్ధాలాడారు. ఇలా దాదాపు రూ.36 లక్షల మేర ఊరి పేరు చెప్పి అక్రమంగా వసూలు చేశారని స్థానికులు ఇదివరకే ఆరోపించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు అప్పట్లో పోలీసులను కూడా ఆశ్రయించారు. గురువారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో సోడిపల్లి చినతాతారావు, జి.సూర్యనారాయణ, సోడిపల్లి జంగమయ్య, చీకటి లక్ష్మయ్య, గనగళ్ల మాకయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన తెలిపేందుకు వచ్చిన బాధితులు

చర్యలు తీసుకోవాల్సిందే..



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క పైసా కూడా తీసుకోకుండా 217 మందికి హుద్‌హుద్ ఇళ్లు ఇచ్చాం. కానీ పేద మత్స్యకారుల వద్ద నుంచి టీడీపీ నాయకులు అక్రమంగా రూ.48 లక్షలు వసూలు చేశారు. దీనిపై విచారణ చేసి అప్పన్నపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

– కోరాడ సూర్యం, సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

మా డబ్బు మాకు ఇప్పించండి



టీడీపీ మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్నకు హుద్‌హుద్ ఇల్లు కోసం రూ.12 వేలు ఇచ్చాను. కానీ నాకు ఇల్లు రాలేదు. డబ్బు అడిగితే దిక్కున్నచోట చెప్పుకోండి అంటున్నారు. మాకు ఇల్లు రాలేదు గానీ.. అతను మాత్రం రూ.50 లక్షలతో కొత్త ఇల్లు కట్టుకుని దర్జాగా ఉంటున్నాడు. మా బతుకులు రోడ్డు పాలు చేశాడు.

– కుందు వరలక్ష్మి, గ్రామస్తురాలు

నిషేధిత పదార్థాల అక్రమ రవాణాపై దృష్టి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

ఇసుక, గంజాయి, గుట్కా, నాటు సారా, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. ఆమె గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, బిల్లులు లేని వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. నాటుసారా తయారీ, ఉత్పత్తి, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సారా తయారు చేసే గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించాలన్నారు. సరిహద్దుల వద్ద ఉన్న చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ పీఎం నాగమణి కంత, అసిస్టెంట్ కమిషనర్ కేపీ గోపాల్, ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి ప్రశంసా పత్రాలు ఇస్తున్న ఎస్పీ రాధిక

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.16 లక్షలకు టోకరా

శ్రీకాకుళం క్రైమ్:

సర్కారు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. 16 లక్షలకు టోకరా పెట్టిన ఘటన శ్రీకాకుళంలో చోటుచేసుకుంది. స్థానిక రెండో పట్టణ సీఐ ఆర్‌ఈ సీహెచ్ ఈశ్వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కంపోస్టు కాలనీలో ఉంటున్న కొల్లూరు శేఖర్ (29)కు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సూర్యాపేట్ గంగానాపల్లి మండలానికి చెందిన అమీన్ అనే వ్యక్తి 2018లో హైదరాబాద్‌లో పరిచయమయ్యాడు. తన సోదరి చర్ల ఉషారాణికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో పలుకుబడి ఉందని, అక్కడ మేనేజర్ పోస్టు ఇప్పిస్తానని చెప్పి 2019లో ఆమెను శేఖర్‌కు పరిచయం చేశాడు. జాబ్ పెద్దది అని చెప్పి విడతల వారీగా మొత్తం రూ. 16 లక్షలు తీసుకున్నాడు. కానీ ఉద్యోగం మాత్రం ఇవ్వలేదు. ఎప్పుడు అడిగినా మాట దాటేసేవాడు. తర్వాత ఫోన్లు ఎత్తడం కూడా మానేయడంతో అనుమానం వచ్చి శేఖర్ గురువారం రాత్రి పోలీసులను ఆశ్రయించాడు. ఆ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడు అమీన్ ఇదివరకే ఇలాంటి మోసాలు చేసి ఉన్నాడని, ఇప్పటికే విశాఖపట్నం రూరల్ బుచ్చెయ్యపేట మండలం పోలీసులకు దొరికాడని వారు అదుపులో తీసుకున్నారని సీఐ పేర్కొన్నారు.

సులువుగా వాణిజ్య సేవలు



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: వర్తక, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న ఆమదాలవలసతో పాటు 13 మండలాలకు విరివిగా జీఎస్టీ సేవలు అందుతాయని, ఇక్కడ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణ శివారులోని వైఎస్సార్ కూడలి వద్ద టీఎస్‌ఆర్ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. స్పీకర్ మాట్లాడుతూ ఈ శాఖలో ప్రొఫెషనలిజం పెరగాలని ఆకాంక్షించారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ఆమదాలవలసలో సీటీఓ కార్యాలయం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. వాణిజ్య పన్నుల శాఖలో పన్నుల బకాయిలు పేరుకుపోకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వాణిజ్య పన్నుల ద్వారా అధిక ఆదాయం లభిస్తుందని గుర్తు చేశారు. రాజాం సీటీఓ కార్యాలయంలో విధులు నిర్వహించిన 40 మంది ఇక్కపై ఇక్కడి నుంచి సేవలు అందించాలని తెలిపారు.

కార్యక్రమంలో విశాఖపట్నం జాయింట్ కమిషనర్ బి.నాగార్జున, విజయనగరం జాయింట్ కమిషనర్ రఘునాథరెడ్డి, అధికారులు చౌదరి పురుషోత్తం నాయుడు, ఆర్ వేణుగోపాలరావు, రాజేశ్వరి, చల్లా శ్రీనివాసరావు, కె. వెంకటరమణ, రాణిమోహన్ పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సువ్వారి సువర్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ అధికారులు, సిబ్బంది పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయడం, నేటి తరాలకు గ్రంథాలయాలను సన్నిహితం చేయడమే ధ్యేయంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వారి సత్యనారాయణ(ఢిల్లీ), జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కళకాలం నిలిచే సేవ

వెండి తెర వచ్చింది. నటనకు సరికొత్త భాష్యం చెప్పింది. బుల్లితెర నట్టింటిలో తిష్ట వేసుకుని కూర్చుంది. సవాలక్ష కార్యక్రమాలను వీక్షకుల కంటి ముందుకు తెచ్చింది. ఇప్పుడు ఓటీటీలు వచ్చాయి. ప్రపంచాన్ని తన గుప్పిటలో ఉంచి చూపిస్తోంది. ఇలా కాలం మారుతోంది. తరాలు మారుతున్నాయి. కానీ రంగస్థలం మాత్రం వన్నె తరగని వజ్రంలా మెరుస్తూనే ఉంది. చూసే వారి సంఖ్య తక్కువగా ఉన్నా.. ప్రోత్సహించే వారు అంతకంటే తక్కువే అయినా ఆ నాణ్యత మాత్రం ఇంకెందులోనూ కనిపించదు. కారణం కాపలాదారులు. అవును కళకు కొందరు కాపలా కాస్తున్నారు. వారిలో ఒకరు శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు.

- కళకు కాపలా కాస్తున్న శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య
- 276 నెలలుగా నాటక ప్రదర్శనలు, కళాకారులకు సత్కారాలు



పౌరాణిక ప్రదర్శన (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్:

కెమెరా ఉండదు. రీ టేక్ తీసుకునే అవకాశం లేదు. నేపథ్య సంగీతం ఓ శ్రుతిలో వినిపించదు. కానీ ఓ తన్మయత్వంలో స్టేజీపై నటులు ప్రదర్శన ఇస్తుంటే తాదాత్మ్య భావనతో చూడడం రంగస్థల ప్రత్యేకత. నాటక పోటీలు ఇంకా జరుగుతున్నాయంటే నటులతో పాటు వారిని తరాలుగా పోషిస్తున్న సమాఖ్యలదే గొప్పదనమంతా. అలాంటి సమాఖ్యే శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య. 276 నెలలుగా ప్రతి నెలా ఈ సమాఖ్య కళా సేవ చేస్తోంది. నటులకు, రచయితలకు ఆకలి తీరుస్తోంది.

నెలవారీ సాంస్కృతిక విభాగం ఏర్పడిందిలా..

శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య 1978లో కళాకారుల సంక్షేమం కోసం ఏర్పడింది.

- ఆ తర్వాత బాపూజీ కళామందిర్ పునరుద్ధరణలో తమ వంతు కృషి చేసినందుకు శ్రీకాకుళం మున్సిపాలిటీ ప్రతినెల మొదటి శనివారం కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునేందుకు స్వచ్ఛందంగా అంగీకరించింది.
- అలా 1999 ఆగస్టు 15న నెలవారీ సాంస్కృతిక విభాగాన్ని రంగస్థల కళాకారుల సమాఖ్య ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి నిరాటంకంగా కళా సేవ జరుపుతూనే ఉన్నారు.
- శిథిలావస్థలో ఉన్న కళామందిర్ పునర్నిర్మాణానికి సమాఖ్య సభ్యులు చందాలు వేసుకొని రూ.25వేలు పెట్టుబడి పెట్టగా, కళాభిమానులు, పట్టణ ప్రముఖులు, ఎంపీ నిధులు కలసి సుమారు రూ.16లక్షలతో పనులు పూర్తి చేశారు.



సాంఘిక నాటిక ప్రదర్శన (ఫైల్)

- నాటి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న దూడ భవానీ శంకర్‌కౌన్సిల్ తీర్మానంతో సమాఖ్యకు ప్రతి నెల మొదటి శనివారం ఉచితంగా కార్యక్రమాల ప్రదర్శన కోసం ఇచ్చేందుకు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- నెలవారీ సాంస్కృతిక విభాగం ఏర్పాటైన తరువాత మొదటి ప్రదర్శన నవంబరు, 1999లో జరిగింది. 23 ఏళ్లుగా 276 నెలలు కళాప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ వచ్చారు.
- చనిపోయిన కళాకారులైన అప్పారావునాయుడు, భాస్కరరావు జ్ఞాపకార్థం నాటక పరిషత్‌ను మొదటిసారిగా ఎగ్జిబిషన్ కళాప్రాంగణంలో నిర్వహించారు.
- 2008లో బంగారు నంది బహుమతి పొందిన మూడు నాటకాలను మూడురోజుల పాటు ప్రదర్శించారు. ప్రఖ్యాత కళాకారులైన చాట్ల శ్రీరాములు, గొల్లపూడి మారుతిరావు వంటి వారితో చర్చాగోష్టులను నిర్వహించారు.
- కళాకారులను ఆదుకోవడంలోనూ అంతే చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ప్రతి మే నెలలో సీనియర్ పౌరాణిక కళాకారులు బీఏ మోహనరావు సహకారంతో పౌరాణిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.

దాతల సాయంతోనే..

ప్రతి నెలా మేము నిర్వహిస్తున్న కార్యక్రమాలకు దాతల సహకారం ఎంతో ఉంది. కళాకారులను ఆదుకునే విషయంలో, కళాప్రదర్శనల కోసం కళలపై అభిమానం ఉన్న దాతలు వల్లనే మా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందరికీ ధన్యవాదాలు.



– చిట్టి వేంకటరావు, అధ్యక్షులు నెలవారీ సాంస్కృతిక విభాగం

నేటి నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో శుక్రవారం నుంచి 6వ తేదీ వరకు రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నారు. మొదటిరోజున సాయంత్రం 6.15 గంటలకు ప్రారంభ కార్యక్రమం జరుగుతుంది. నాటిక పోటీలను రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభిస్తారు. అతిథులుగా ఎంపీ పద్మావతి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ డైరెక్టర్ జేజే మోహనరావు, సుమిత్రా కళాసమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావులు హాజరుకానున్నారు.

రాత్రి 7 గంటలకు నెల్లూరు, ప్రియదర్శిని వారిచే 'అక్షయం' నాటిక, కాకినాడకు చెందిన శ్రీజయా ఆర్ట్స్ వారిచే 'దేవుడు' నాటిక ప్రదర్శించనున్నారు.

క్లుప్తంగా

నేడు హెల్త్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్

అరసవల్లి: జిల్లాలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ఎంపీహెచ్ఏ (మేల్ హెల్త్ అసిస్టెంట్లు) కౌన్సెలింగ్‌ను శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. నిబంధనల ప్రకారం ఉద్యోగుల ర్యాంకింగ్ ప్రకారం 318 మందితో కూడిన మెరిట్ జాబితాను సిద్ధం చేశామని, ఈ ప్రకారమే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఇందులో ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని, ఎలాంటి ప్రలోభాలకు ఆస్కారమే లేదని ఆమె స్పష్టం చేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాల ప్రకారం ఈ కౌన్సెలింగ్ ప్రక్రియకు ప్రత్యేక పరిశీలకులుగా శ్రీకాకుళం ఆర్డీఓ బొడ్డేపల్లి శాంతిని నియమించారని, ఈమె ఆధ్వర్యంలోనే ఈ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లుగా డీఎంహెచ్ఓ ప్రకటించారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వ్యక్తులు, సంస్థలు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ నిర్మాణం, సమాజ శ్రేయస్సు కోసం ప్రశంసా పూర్వకమైన కార్యక్రమాలను నిర్వహించిన యువతకు 2020–21 ఏడాదికిగాను వ్యక్తిగతంగా, సంస్థలకు జాతీయ అవార్డులను ప్రధానం చేస్తామని, వ్యక్తులకు (2022 జనవరి ఒకటి నాటికి 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి) ఇచ్చే అవార్డులలో పతకం, ప్రశంసా పత్రం, రూ.లక్ష నగదు బహుమతిగా అందజేస్తామన్నారు. సంస్థలకు ఇచ్చే అవార్డులలో పతకం, ప్రసంశాపత్రం, రూ.3లక్షల నగదు బహుమతిగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 6వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్:అవార్డ్స్.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్ ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదుచేసిన కాపీ, ప్రింటౌట్‌కాపీలు, జతచేసిన కాపీలను సెట్‌శ్రీ సీఈఓ కార్యాలయంలో ఈనెల 7వ తేదీలోగా సమర్పించాలని ప్రసాదరావు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8500961349 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పాముకాటుకు మహిళ మృతి


మృతి చెందిన రాములమ్మ

రణస్థలం: మండలంలోని పున్నానపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం పాము కరిచి లంక రాములమ్మ(60) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం సాయంత్రం గడ్డి కోసం పొలానికి వెళ్లిన రాములమ్మ అక్కడ పాము కాటు వేసింది. రాత్రయినా ఆమె ఇంటికి రాకపోవడంతో గ్రామస్తులు పొలాల్లో వెతకగా అక్కడ ఆమె విగతజీవిగా కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమన్నీరుగా విలపించారు. ఎడమ చేతికి పాము కరిచినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. రాములమ్మకు భర్త సూర్యనారాయణతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

హైకోర్టు ఏజీపీగా సారథి చౌదరి


నల్లాన సారథి చౌదరి

కంచిలి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏజీపీగా నియమిస్తూ హైకోర్టు అడ్వకేట్ జనరల్ నుంచి ఉత్తర్వులు అందాయని మండలంలోని మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది నల్లాన సారథి చౌదరి తెలిపారు. అమరావతి వెళ్లి బాధ్యతలు స్వీకరించినట్లు గురువారం విలేకరులకు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లాకు చెందిన రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	50,380–00
బంగారం(22కి. 10గ్రా.)	46,460–00
వెండి (కిలో)	60,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235


సాఫ్ట్‌బాల్ సాధనలో క్రీడాకారులు

- 7 నుంచి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు
- 32 క్రీడాంశాల్లో పోటీల నిర్వహణ
- ముస్తాబవుతున్న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం, కోడి రామ్మూర్తి స్టేడియం

స్కూల్ గేమ్స్.. ఫుల్ జోష్

శ్రీకాకుళం న్యూకాలనీ:

పాఠశాలల క్రీడల (స్కూల్‌గేమ్స్) రెండో అంకానికి రంగం సిద్ధమవుతోంది. జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి జరగనున్న జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో అండర్–14, అండర్–17 వయో విభాగాల్లో అత్యంత ఆదరణ కలిగిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో మూడు క్రీడాంశాల్లో తొలుత నియోజకవర్గ స్థాయి ఎంపికలను నిర్వహించి బాలబాలికల వడపోత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి కొనసాగింపుగా జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పోటీలను జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం, ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా నిర్వహిస్తున్నారు. మొత్తం 32 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు జరగనున్నాయి. గత నెల 19 నుంచి 21 వరకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో నియోజకవర్గస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మాత్రమే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. మిగిలిన 29 క్రీడాంశాల్లో బాలబాలికలు నేరుగా జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనవచ్చు. కోవిడ్ తర్వాత పూర్తిస్థాయిలో ఆటల పోటీలు జరుగుతుండడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పోటీలు ఇలా..

ఈ నెల 7వ తేదీన జరిగే ఎంపిక పోటీలు: కబడ్డీ(బాలురు), వాలీబాల్(బాలురు), ఖోఖో(బాలురు), షటిల్ బ్యాడ్మింటన్(బాలురు), బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్.

8వ తేదీన జరిగే ఎంపిక పోటీలు: కబడ్డీ (బాలికలు), వాలీబాల్ (బాలికలు), ఖోఖో (బాలికలు), షటిల్ బ్యాడ్మింటన్(బాలికలు), క్రికెట్, బేస్‌బాల్ (ఉదయం), సాఫ్ట్‌బాల్ (మధ్యాహ్నం), టేబుల్ టెన్నిస్ (న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా).


కూతకు సిద్ధమవుతూ.. కబడ్డీ శిక్షణలో క్రీడాకారులు

9వ తేదీన జరిగే ఎంపిక పోటీలు: ఆర్చరీ, యోగా, బాక్సింగ్, ఫెన్సింగ్ (శ్రీకాకుళం టౌన్‌హాల్ వేదికగా), తైక్వాండో (శ్రీకాకుళం టౌన్‌హాల్ వేదికగా), బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, త్రోబాల్, టెన్నీకాయిట్, లాన్‌టెన్నిస్, స్కేటింగ్, రగ్బీ, సాఫ్ట్‌బాల్‌టెన్నిస్, నెట్‌బాల్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్ (అండర్–17 మాత్రమే), పవర్ లిఫ్టింగ్ (అండర్–17 మాత్రమే).

10వ తేదీన: అథ్లెటిక్స్

12వ తేదీన: జూడో

14వ తేదీన: చెస్ ఎంపిక పోటీలు జరుగుతాయి.

ఇవి పాటించాల్సిందే..

- అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు స్కూల్‌గేమ్స్ పోటీల్లో విధిగా పాల్గొనాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు వెలువరించారు.
- స్కూల్‌గేమ్స్ వార్షిక ఫీజులు అనగా ప్రతి పాఠశాల రూ.300, అలాగే ఆ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి చదువుతున్న విద్యార్థికి రూ.13, పదో తరగతి విద్యార్థికి రూ.14 చొప్పున విధిగా చెల్లించాలి.
- స్కూల్‌గేమ్స్ ఫీజులు చెల్లించిన పాఠశాలల విద్యార్థులను మాత్రమే పోటీలకు అనుమతిస్తామని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు స్పష్టంచేస్తున్నారు. తప్పనిసరిగా ఫీజులు చెల్లించి సహకరించాలని డీఈఓ సూచిస్తున్నారు.
- ఎలిజిబులిటీ ఫారంతో విధిగా హాజరుకావాలి. ఈ ఎలిటిబులిటీ ఫారంపై హెచ్‌ఎం, పీడీ సంతకంతో పాటు పాఠశాల రౌండ్ సీల్ వేయాల్సి ఉంటుంది.
- ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు ఎలిజిబులిటీ ఫారంతోపాటు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తప్పనిసరిగా తీసుకురావాలి.
- పోటీల్లో పాల్గొనే వారికి జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుంది.

పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం



ఈ నెల 7 నుంచి మొదలయ్యే జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈఓ నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ల సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. స్కూల్‌గేమ్స్ ఫీజులు చెల్లించిన పాఠశాలల విద్యార్థులకే అవకాశం కల్పిస్తున్నాం. మొత్తం 32 క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలు జరుపుతున్నాం.

– బీవీ రమణ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి

ఇద్దరు విద్యుత్ ఉద్యోగులపై చర్యలకు ఆదేశాలు

అరసవల్లి: విజిలెన్స్ అధికారుల విచారణ, డిపార్ట్‌మెంటల్ విచారణల రిపోర్టుల ఆధారంగా జిల్లా సర్కిల్ పరిధిలో విధుల్లో ఉన్న సీనియర్ అసిస్టెంట్ ఎంవీ గోపాలరావు, జూనియర్ అసిస్టెంట్ జి.సంతోషిమాతలకు వేర్వేరు అంశాల్లో శాఖాపరమైన చర్యలకు ఆదేశిస్తూ ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇద్దరూ రానున్న 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని..లేదంటే తదుపరి చర్యలు తప్పవని ఆయన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తోటి ఉద్యోగులపై తప్పుడు ఫిర్యాదులు, బెదిరింపులకు పాల్పడుతుందన్న కారణాలతో ఆమదాలవలస సబ్ ఈఆర్వోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.సంతోషిమాతకు మెమో జారీ చేశారు. 2019 నవంబర్ 16న స్థానికంగా పనిచేస్తున్న వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగులు, బీసీ ఉద్యోగుల సంఘ నేతలు ఐదుగురిపై లైంగిక వేధింపులంటూ సంతోషిమాత ఫిర్యాదు చేశారు. అలాగే గత ఏడాది డిసెంబర్ 17న సహ ఉద్యోగి ఆర్.శ్రీలక్ష్మితో గొడవ పడ్డారు. ఈ రెండు ఘటనలపై విజిలెన్స్ అధికారులతో పాటు శాఖాపరంగా ప్రత్యేక కమిటీ అధికారులు కూడా విచారణ జరిపారు. లైంగిక వేధింపుల కేసు పూర్తిగా ఫేక్ అని కూడా తేల్చారు. ఈ విచారణల రిపోర్టుల ఆధారంగా తాజాగా మెమో జారీ చేశారు. అలాగే డిపార్ట్‌మెంట్ అనుమతి లేకుండా సినిమా పాత్రలో నటించడమే కాకుండా.. పలాసలోని ఓ విద్యుత్ కార్యాలయ కింద అంతస్తును సినిమా సెట్‌గా మార్చడం, అలాగే విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం తదితర పలు కారణాలతో టెక్కలి డివిజన్ ఈఆర్వోలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎంవీ గోపాలరావుకు కూడా చార్జీ మెమోను జారీ చేశారు. దీనిపై విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్ 'సాక్షి'తో మాట్లాడుతూ విచారణల అనంతరం వీరిద్దరికీ వేర్వేరుగా అక్టోబర్ 28నే మెమోలు జారీ చేశానని ధ్రువీకరించారు.

వికేంద్రీకరణ అవసరమంటూ తీర్మానం


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు రాజధానులను సమర్థిస్తూ, విశాఖలో పాలనా రాజధాని నిర్ణయాన్ని బలపరుస్తూ పోలాకి మండల సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. గురువారం ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వికేంద్రీకరణకు, మూడు రాజధానులకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం ఎంపీటీసీ సభ్యులు తూలుగు కుమారి, తులే పైడమ్మలు వికేంద్రీకరణకు మద్దతుగా ఏకవాక్య తీర్మానం ప్రవేశపెట్టగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన చర్చ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రాజధానుల ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు సూచించారు. జిల్లాలో పోలాకి మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలని అధికారులకు కోరారు.

మండల ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగి నాయుడు మాట్లాడుతూ వికేంద్రీకరణకు తాము మద్దతు పలుకుతున్నామన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఈశ్వరరావు, తహసీల్దార్ శ్రీరాములు, వైఎస్ ఎంపీపీలు కోట అప్పారావు, కలగదండు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

'వినియోగదారుల సంతృప్తే ముఖ్యం'


సమావేశంలో మాట్లాడుతున్న సీజీఎం మషిలామణి

అరసవల్లి: విద్యుత్ వినియోగదారుల్లో సంతృప్తి శాతం పెంచేలా శాఖలో పనిచేస్తున్న వారంతా కృషి చేయాలని ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ప్లానింగ్) మషిలామణి పిలుపునిచ్చారు. స్థానిక ఆనందమయి కల్యాణమండపంలో ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) రీజనల్ సెక్రటరీ ఎంవీ గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ శాఖలో భారీగా ఇటీవల నియామకాలు జరగడంతో ఒత్తిడి తగ్గిందని అన్నారు. విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, సిబ్బంది బాధ్యతగా తీసుకుని వీటిని నివారించాలని సూచించారు. 1104 సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ వీఎస్ఆర్‌కే గణపతి మాట్లాడుతూ డిస్కం పరిధిలో శ్రీకాకుళం సర్కిల్‌లో సిబ్బంది బాగా పనిచేస్తారనే పేరు ఉందని, దీన్ని ఎప్పటికీ నిలబెట్టుకోవాలని, 1104 సంఘ సైనికులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) శ్రీకాకుళం రీజనల్ శాఖకు స్థానిక కార్యాలయంలో గురువారం ఎన్నిక ప్రక్రియ జరిగింది. రీజనల్ శాఖ అధ్యక్షుడుగా ఎస్.లోకేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా ఎంవీ గోపాలరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాజారావు ఉపాధ్యక్షులను ఎన్నికున్నారు.

అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి


ఆర్మీ జవాన్ సురేష్ (ఫైల్)

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ పైడి సురేష్ (32) అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో హైదరాబాద్ నగరంలోని ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయన మృతదేహానికి గురువారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతిపై ఎంపీపీ కిల్లి రమాదేవి, కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, సర్పంచ్ కిల్లి రాజ్యలక్ష్మి, వైస్ సర్పంచ్ పైడి నర్సింహ అప్పారావు సంతాపం తెలిపారు.

సమగ్ర కలెక్టరేట్ నిర్మాణానికి చర్యలు


ఉప ఖజానా కార్యాలయం ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉప ఖజానా కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.1.08 కోట్లతో నిర్మించిన ఉప ఖజానా కార్యాలయాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో సమగ్ర కలెక్టరేట్ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. దాన్ని పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇది పూర్తయితే అన్ని శాఖలు ఒకే చోట ఉంటాయని తెలిపారు. జిల్లా ఖజానా కార్యాలయం పనులు కూడా రూ.10 కోట్ల వ్యయంతో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిధులు అవసరమైతే సీఎంతో మాట్లాడి మంజూరు చేయిస్తానన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భూముల హక్కు విషయంలో చాలా రోజులుగా మార్పులు లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని సరిచేసే పనిలో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఖజానా శాఖ ఉప సంచాలకులు సీహెచ్ రవికుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి బొడ్డేపల్లి శాంతి, తహసీల్దార్ వెంకటరావు ఏటీఓలు ఎ.తవిటన్న, పి. సావిత్రి, మన్యం ఏటీఓ కె. శ్రీనివాసరావు, ఎస్టీఓ నవీన్ చంద్, పిఎస్ రాజు, ఖజానా శాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9 వరకు క్లెయిముల స్వీకరణకు అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన విధాన సభ ఎన్నికలకు చెందిన క్లెయిములను డిసెంబర్ 9 వరకు స్వీకరించవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లకు స్పష్టం చేశారు. గురువారం డ్రాఫ్ట్ పబ్లికేషన్, ఓటర్ల జాబితా, ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనవిధాన సభ ఎన్నికల క్లెయిములు తదితర అంశాలపై కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనవిధానసభ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 9వ తేదీ నాటికి ముసాయిదా ప్రచురణ కావాల్సి ఉన్నప్పటికీ డిసెంబర్ 9వరకు క్లెయిములను స్వీకరించవచ్చని పేర్కొన్నారు. పట్టభద్రుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు నవంబర్ 7 ఆఖరు తేదీగా ప్రకటించడం వల్ల సందిగ్ధ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని, తుది ప్రచురణ వరకు అనగా డిసెంబర్ 9వరకు క్లెయిములను పట్టభద్రుల నుంచి స్వీకరించవచ్చని తెలిపారు. అలాగే కొన్ని జిల్లాల్లో ఉండాల్సిన ఓటర్ల శాతం కంటే అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నట్లు గమనించడం జరిగిందని, ఎక్కువగా ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో మళ్లీ సర్వే చేసి వాటిని సరిచేయాలని ఆదేశించారు. ఆధార్ సీడింగ్ విషయమై జిల్లాల వారీగా సమీక్షించిన ఆయన శ్రీకాకుళం జిల్లాలో 59 శాతం మాత్రమే ఆధార్ సీడింగ్ అయిందని, డిసెంబర్ మాసాంతానికి శత శాతం ఆధార్ సీడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టభద్రుల ఓటర్లకు సంబంధించి గతంలో 25వేల పైచిలుకు ఉన్నారని, మరో 20 శాతం పెరిగే అవకాశం ఉన్నందున వీలైనంత త్వరగా పట్టభద్రుల ఓటర్లు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠ్ కర్, సంయుక్త కలెక్టర్ యం.నవీన్, జిల్లా రెవిన్యూ అధికారి యం.రాజేశ్వరీ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోకు మంచి రోజులు

- ఏపీటీఏకి తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు
- 14న టీఎఫ్ఐ ఎన్నికలు


టి.హర్షవర్ధన్‌ప్రసాద్


బీఎస్ఎస్ ప్రసాద్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: తైక్వాండోకు మంచి రోజులు వస్తున్నాయి. కొన్నాళ్లుగా ఫెడరేషన్ల విషయమై నెలకొన్న సమస్య ఓ కొలిక్కి రానుంది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోను, విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్(ఏపీటీఏ)కే తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టీఎఫ్ఐ) తాజాగా గుర్తింపునిచ్చింది. రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ కొనసాగుతుండగా దానికి వ్యతిరేకంగా న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సంఘం కొన్నేళ్ల నుంచి చెలామణీ అవుతుంది. కొన్నేళ్లపాటు టీఎఫ్ఐ గుర్తింపును కూడా పొందింది. ఇరు సంఘాలు కోర్టు వివాదాల నేపథ్యంలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తించిన అసోసియేషన్ ఏది అన్న దానిపై క్రీడాకారుల్లో అయోమయం నెలకొంది. రాష్ట్రంలో ఉండే అసోసియేషన్‌కి దేశంలో ఉండే ఫెడరేషన్ గుర్తింపు తప్పని సరి. ఈ నేపథ్యంలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 14న దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్నాయి. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ ఎన్నికల నిర్వహించేందుకు జస్టిస్ (రిటైర్డ్) జీఎస్ సిస్తాని ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులగా టి.హర్షవర్ధన్ ప్రసాద్(విశాఖపట్నం), బీఎస్ఎస్ ప్రసాద్‌కుమార్(తైక్వాండో శ్రీను)లు ఓటింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. ఈ వ్యవహారంపై న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ పెట్టిన పిటిషన్‌ను జస్టిస్ (రిటైర్డ్) జీఎస్ సిస్తాని విచారించి ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్‌కు గుర్తింపు కల్పిస్తూ అక్టోబర్ 28న ఉత్తర్వులు జారీ చేసినట్టు ఏపీఏటీ అధ్యక్ష,కార్యదర్శు టి.హర్షవర్ధన్‌ప్రసాద్, బీఎస్ఎస్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. చేసారు. తాజా ఉత్తర్వులతో ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషనే తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి అనుబంధ అసోసియేషన్‌గా గుర్తింపు పొందినట్టయిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాకివలసలో డెంగీ కేసు నమోదు


మాకివలస రావాడ వీధిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

నరసన్నపేట: వాతావరణ మార్పులతో జ్వరాల తీవ్రత కనిపిస్తోందని, ప్రజలు అశ్రద్ధ చేయవద్దని మాకివలస వైద్యాధికారులు శిరీష, దుష్యంత్ కుమార్‌లు ప్రజలకు సూచించారు. మాకివలస రావాడ వీధికి చెందిన ఎం.అమ్మన్న అనే వృద్ధురాలికి డెంగీ నిర్ధారణ కావడంతో గ్రామంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల ఉన్న వారికి తనిఖీలు చేశారు. జ్వరంతో ఉన్న వారికి మందులు ఇచ్చారు. మూడు రోజులకు మించి జ్వరం ఉంటే వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించాలని సూచించారు. మాకివలసల పీహెచ్‌సీలో మందులు, రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ దైవకటాక్షం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: బ్యాంకుల సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మురపాక ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ కె.దిలీప్ కుమార్ సూచించారు. ఎచ్చెర్ల మండలంలోని అజ్జరాంలో బ్యాంకు సేవలపై జాతీయ సమగ్ర అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు తీసుకొని ఆర్థిక ఇబ్బందులు తెచ్చుకోవద్దని ప్రజలకు సూచించారు. అన్ని రంగాల్లో ఉన్న ప్రజలకు బ్యాంకులు పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం అందిస్తాయన్నారు. పంట రుణాలు, స్వయం సహాయ సంఘాల రుణాలు, బంగారు అభరణాలపై రుణాలు, గృహ, వాహన ఇలా అన్ని రకాలు రుణాలు మంజూరు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బోర సాయిరాం, ఎంపీటీసీ బి.గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌గా చిన్నారావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా జగన్నాథవలస గ్రామానికి చెందిన తిరుమరెడ్డి చిన్నారావు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌పీఆర్‌పురం గ్రామానికి చెందిన అంపోలు కూమారిలు ఎన్నికై నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శ్యాముల్ లంక తెలిపారు. గురువారం పాఠశాల అవరణలో నిర్వహించిన ఎన్నికల్లో సభ్యులు వీరిని ఎన్నుకున్నారని వెల్లడించారు. మరో 13 మందిని సభ్యులు నియమించారు. వీరితో ప్రిన్సిపాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

చిన కొంగరాంలో గ్రామసేవ



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: భగవాన్ సత్యసాయిబాబా జయంతోత్సవాల్లో భాగంగా చినకొంగరాం గ్రామంలో గ్రామసేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పల్లకీ ఉత్సవాన్ని గ్రామంలోని పురవీధుల్లో నిర్వహించారు. ప్రసాదాలు, విభూతి భక్తులకు అందజేశారు. గుర్తించిన పేదలకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో అందవరపు ప్రసాద్, సంతోష్, రాజు, గుండ రవి, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

'ఓటు..మన భవిష్యత్తు' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బుడుమూరు రాజేష్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఓటు మన హక్కే కాదు.. మన బాధ్యత అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ బుడుమూరు రాజేష్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు కార్యాలయంలో ఓటు హక్కుకోసం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో ప్రతిఒక్కరూ నమోదు చేసుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు వేయాలన్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలోని కొయ్యాం గ్రామంలో కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా జెమ్స్ ఆస్పత్రి శ్రీకాకుళం సహకారంతో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. సాధారణ వ్యాధులతో పాటు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డీన్ కె.మోష, జెమ్స్ ఆస్పత్రి మేనేజర్ ఎస్.శివ ప్రసాద్, డాక్టర్ జె.నీలిమ, వీహెచ్ఏ డి.త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేయండి



మంత్రి ధర్మాన సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక మండలి చైర్మన్, సభ్యులు

- పాలకమండలికి మంత్రి ధర్మాన సూచన
- ఉమారుద్ర కోటేశ్వరస్వామి పాలక మండలి చైర్మన్‌గా సుంకరి కృష్ణ ఎన్నిక

శ్రీకాకుళం కల్చరల్: భగవంతుని సేవతో పాటుగా అలయ అభివృద్ధికి కూడా కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని గుడివీధిలో ఉమారుద్రకోటేశ్వరస్వామి అలయం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాల కల్పన, ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. పదవి అజమాయిషీ కోసం కాదని, దేవుని సేవకు అవకాశంగా గుర్తించాలన్నారు. స్వామివారి ఉత్సవాలు, పండగలు ఘనంగా నిర్వహించాలని సూచించారు.

పాలకమండలి చైర్మన్ సుంకరి కృష్ణ మాట్లాడుతూ చరిత్ర కలిగిన ఆలయానికి చైర్మన్‌గా సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని, ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. నాగావళి నదికి వచ్చే భక్తులకు సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయమై మంత్రి సహకరించాలని కోరారు. ఖాళీగా ఉన్న దేవాలయం డోలా మండప స్థలం ఆక్రమణలకు గురికాకుండా భవనాన్ని నిర్మించాల్సి ఉందని, అందుకు సహకారం అందించాలన్నారు. ఆలయం బయట బలరాముడి విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా, దేవదాయశాఖ నిబంధనల ప్రకారం 8 మంది సభ్యులలో ఒకరిని చైర్మన్‌గా సభ్యులు ఎన్నుకోవాల్సి ఉండగా వారిలో సుంకరి కృష్ణ పేరును సభ్యులంతా సూచించారు. దీంతో ఆయన్ను చైర్మన్‌గా ప్రకటించారు. ఈయనతో పాటు నక్క రామరాజు, తోనంగి ఆదిబాబు, నల్లపిల్లి యమున, గాలి హైమావతి, అంధవరపు బాలమణి, పూసర్ల శ్రీదేవి, అర్చకులు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆరవెల్లి శ్రీరామమూర్తిలు సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరితో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, మాజీ వైస్ చైర్మన్ అలివేలు మంగ, మాజీ డీసీసీబీ చైర్మన్ గొండు కృష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, మండవిల్లి రవి, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, శిమ్మ రాజశేఖర్, ఎన్ని ధనుంజయరావు, వైకుంఠరావు, ఆలయ ఈఓ వాకచర్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై దృష్టి సారించాలి



జి.సిగడాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన యువత ఓటుహక్కు నమోదుపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అవగహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు పూర్తిచేసిన ధ్రువపత్రాలను రెవెన్యూ కార్యాలయానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పార్టీ బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, ఏఎంసీ వైస్ చైర్మన్ బత్తుల సన్యాసిరావు, పీఏసీఎస్ చైర్మన్లు ఏర్నేన ప్రకాశరావు, పల్లేటి సన్యాసిరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, మాడుగుల మురళీధర్‌బాబా, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హులైన పట్టభద్రులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో పట్టభద్రుల ఓట్ల నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఎచ్చెర్ల మండలంలో రెండు వేల మంది గ్రాడ్యుయేట్లు ఉండే అవకాశం ఉందన్నారు. ఈనెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల్లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎంపీడీవో కుమార్‌పట్నాయక్, ఈవోపీఆర్డీ కె.ఈశ్వరి, నాయకులు సనపల నారాయణరావు, జరగుళ్ల శంకరరావు, బల్లాడ జనర్ధనరెడ్డి, నక్క కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు అవసరం



మాట్లాడుతున్న బుడుమూరు శ్రీరామ్మూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు అవసరమని వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి అన్నారు. కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి ఏడాది క్లాస్ వర్కు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాల మేరకు విద్యార్థులకు ఓరియంటేషన్ (ప్రేరణ) తరగతులు ముందుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులు ఇంజినీరింగ్ కరిక్యులమ్‌లో క్లాస్‌వర్కు, పరీక్షలు, ప్రయోగ పరీక్షలు, ఇంటర్న్ షిప్, తరగతి గది హాజరు వంటివి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉంటూ ఆసక్తితో ముందుకు సాగాలన్నారు. విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, మంచి పర్సంటేజ్ సాధిస్తే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తి, మేనేజ్ మెంట్ సభ్యులు, అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వేశ్వరరావు

లావేరు: సచివాలయాల ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదలింగాలవలస గ్రామ సచివాలయాన్ని గురువారం పరిశీలించారు. సచివాలయ ఉద్యోగుల హాజరును పరిశీలించారు. ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై సమీక్షించారు. సచివాలయం పరిధిలో ఉండే పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని ఉద్యోగులకు సూచించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లుకలాపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శులు ఎం.రమణ, ఎస్.రాజేశ్వరీ, వెటర్నరీ అసిస్టెంట్ జి.గోపాల్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.పద్మావతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భరత్, వెల్ఫేర్ అసిస్టెంట్ కల్యాణి, వీఆర్‌ఏ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు, డీన్ ఉదయ్‌భాస్కర్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళ డిగ్రీ (అటానమస్) కళాశాల రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాలను గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు విడుదల చేశారు. రెండవ సెమిస్టర్‌లో 62.28 శాతం, నాలుగో సెమిస్టర్‌లో 69.82 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని అడ్డుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: అవినీతి నిరోధానికి అందరూ కలిసి రావాలని అవినితి నిరోధక శాఖ డీఎస్పీ డి.వి.ఎస్.ఎస్.రమణమూర్తి పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా అవినీతి నిరోధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏసీబీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రజా చైతన్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. అవినీతికి దూరంగా ఉంటామని, అవినీతిని అడ్డుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐలు భాస్కర్, హరి, ఎస్ఐ సత్యారావు, రెడ్‌క్రాస్ వలంటీర్లు, సిబ్బంది కె.సత్యనారాయణ, చైతన్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నావికోత్సవానికి మంత్రి ధర్మానకు ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అధికారులు

గార: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా శ్రీకూర్మనాథాలయంలో శనివారం జరగనున్న నావికోత్సవానికి హాజరుకావాలని ఆలయ అధికారులు గురువారం మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఈవో గుత్తి గురునాథం, పాలకమండలి సభ్యుడు డబ్బీరు వాసుదేవరావు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎచ్చెర్ల: బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



జి.సిగడాం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలం పరిధి పెంట, జి.సిగడాం, దేవరవలస, గెడ్డకంచరాం, ఎందువ, సంతవురిటి గ్రామాలతో పాటు ఆనందపురం గ్రామంలో 100 అడగుల వెంకటసాయి మహాస్థూపం వద్ద గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే ఆలయం వద్ద భక్తులు బారులుతీరారు.

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురం గ్రామంలోని సాయి ఆశ్రమంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి తిరువీధి నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా నాడు-నేడు పనులు

లావేరు:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మన బడి నాడు-నేడు పనులను పక్కాగా చేపట్టాలని మండల విద్యాశాఖాధికారి ఎల్.ఈశ్వరరావు సూచించారు. మండలంలోని పైడయ్యవలస, పాతకుంకాం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆయనతో పాటు సీఆర్పీ కె.వెంకటరావు, హెచ్‌ఎంలు దివాకర పాత్రో, సీహెచ్ ఆనందరావు, కె.ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇసర్ల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

5న శ్రీవారి తెప్పోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా సమీపంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5న క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా నాగావళి నదిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవంతో పాటు నాగావళి నదీ మాతృకా హారతి జరుగుతుందని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

14న మహా కుంభాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: పుణ్యపువీధిలో సీతారామ చంద్రమూర్తి సహిత సువత్సల అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 14న మహాకుంభాభిషేకం నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం, బిళ్వార్చన, రుద్ర హోమం తదితర కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

ఘనంగా నారాయణసేవ

జి.సిగడాం: కార్తీక మాసం రెండో గురువారం సందర్భంగా పలు గ్రామాల్లో భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆనందపురం, పెంట, మానంపేట, మర్రివలస, చంద్రయ్యపేట గ్రామాలతో పాటు మరో 5 గ్రామాల్లో ఉన్న అలయాల వద్ద నారాయణసేవ నిర్వహించారు. పెంట గ్రామంలో షిరిడీ సాయి బాబా అలయం వద్ద మక్క కూర్మినాయుడు కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో కార్యక్రమం చేపట్టారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శిస్తున్న దృశ్యం

జి.సిగడాం: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వాండ్రంగి సర్పంచ్ సాకేటి నాగరాజు అన్నారు. గ్రామంలోని సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన రైతులకు రైతు భరోసాతో పాటు ఇతర పథకాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అరసవిల్లి దివ్య, వీఆర్వో ఎన్.రమణ, పంచాయతీ కార్యదర్శి వడగా గోరీశంకరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: అక్టోబర్ 30న వేకువజామున శ్రీకాకుళం నగరానికి చెందిన ఎస్.వి.శ్రీనివాసరావు, ఎస్.నర్సింహులు మారణాయుధాలతో తనపై దాడి చేసి ఇంట్లో డబ్బు, బంగారం పట్టుకుపోయారని బలివాడ గ్రామానికి చెందిన బలివాడ స్వరూప్ గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ రేణుక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం రూరల్: చక్కగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి ఆదేశాల మేరకు ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సింగుపురం కేజీబీవీ, సచివాలయాల్లో గురువారం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే చదువుతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘు, మంత్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్వేత పుష్కరిణి గట్లు పటిష్టం

గార: శ్రీకూర్మనాథాలయంలోని శ్వేతపుష్కరిణి గట్లు పటిష్టం చేసే పనులు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ఎంపీపీ గొండు రఘురామ్ సొంత నిధులతో గట్లు పటిష్టత చేయిస్తున్నారు. శనివారం జరగనున్న నావికోత్సవానికి మట్టి రోడ్డు వేయించారు. ఈ పనులను ఈవో గుత్తి గురునాథం, పాలకమండలి సభ్యుడు వాసుదేవరావు గురువారం పరిశీలించారు.

20న మహారుద్రాభిషేకం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 20న ఏడు అడుగుల మృత్తికా (మట్టి) శివలింగానికి మహారుద్రాభిషేకం, భస్మాభిషేకం నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్లో గురువారం బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా బారిన పడి ఎంతో మంది అవస్థల పాలయ్యారని, లోక కల్యాణార్థం మహా రుద్రాభిషేక పూజా కార్యక్రమాన్ని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నాగసాధువులతోపాటు రాజేష్ నాథ్ మహారాజ్ అనే అఘోరీ కూడా పాల్గొంటున్నారని తెలిపారు. కనీసం లక్ష మంది వరకు భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాంత్ మహేష్, గోపాలకృష్ణ, శైలజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడిరామ్మూర్తి ఆదర్శప్రాయుడు



కోడిరామ్మూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మోహన్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కలియుగ భీమునిగా కీర్తిగాంచిన కోడిరామ్మూర్తి జీవితం క్రీడాకారులకు ఆదర్శప్రాయమని జిల్లా కోడి రామ్మూర్తినాయుడు యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుండబాల మోహన్ అన్నారు. కోడిరామ్మూర్తి జయంతి సందర్భంగా స్టేడియం సమీపంలోని రామ్మూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చిలకలపూడి రవికుమార్, బాలి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందిన కోడిరామ్మూర్తి జయంతిని క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు నిర్వహించకపోవడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామసభల్లో ఫిర్యాదులు చేయాలి



మాట్లాడుతున్న ఏవో శారద

జి.సిగడాం: పంటల నమోదులో తప్పులుంటే సచివాలయాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ఫిర్యాదులు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి యర్రా శారద అన్నారు. మండలంలోని మెట్టవలస, ఆనందపురం, వెంకయ్యపేట, ఎందువ, బాతువ గ్రామ సచివాలయల్లో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ఆమె పాల్గొన్నారు. ఇటీవల అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోల సమక్షంలో చేపట్టిన ఈ-క్రాప్ నమోదులో ఎక్కడైనా తప్పులుంటే గ్రామసభల ద్వారా పరిష్కారం జరుగుతుందన్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకున్న రైతుల జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ, నరవ సత్యనారాయణ, ముంతా, హేమంత్ కుమార్, హరీష్, అంపోలు అనూషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

5న హరినామ సంకీర్తన

శ్రీకాకుళం కల్చరల్: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఈ నెల 5న విశాఖ రామకృష్ణా బీచ్‌లో శ్రీవారి సేన గురుకొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో హరి నామ సంకీర్తన సముద్ర హారతి నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం శాఖ ఇన్‌చార్జి సింహాద్రి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలోని భక్తులంతా తరలిరావాలని కోరారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి పరిశీలన

శ్రీకాకుళం రూరల్: మునసబుపేటలోని జాతీయ రహదారి మధ్య ఫుట్ ఓవర్ బ్రిడ్జి (మెట్ల వంతెన)ను సరిచేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చల్లా వెంకటేశ్వరరావు కోరారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి వంతెనను పరిశీలించారు. మెట్ల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో దిగేటపుడు స్వల్ప ప్రమాదాలు చోటుచేసుకుంటాయని చెప్పారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలన చేసినట్లు తెలిపారు. సమస్యను ఎన్‌హెచ్‌ఎఐ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం చిలకపాలేం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పలరాజు తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గురువారం పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు మురళీధర్‌బాబా, శ్రీనివాసరావు ఉన్నారు.

లావేరు: మండలంలోని గుంటుకుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొన్ని పరసయ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలియడంతో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు లుకలాపు అప్పలనాయుడు, శివాంగం నాగరాజు, లావేరు హైస్కూల్ పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ కూనపు పోలీస్, పతివాడ గురునాయుడు, గున్న వినోద్ తదితరులు ఆయనను పరామర్శించారు.

లావేరు: రణస్థలం మండల జెడ్పీటీసీ టొంపల సీతారాం ఇటీవల ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టరు చిల్లా వర్షిణిరెడ్డి తదితరులు చినయామలపేట గ్రామంలో గురువారం పరామర్శించారు.

ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ

గార: అంపోలు పంచాయతీలో ఇటీవల నిర్వహించిన ఈ-క్రాప్ నమోదుపై గురువారం సచివాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొండు జయరాం మాట్లాడుతూ ఈ-క్రాప్‌లో నమోదైతేనే పంటకు నష్టపరిహారం, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుతాయని చెప్పారు. ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో డి.పద్మావతి, ఎంపీటీసీలు, వీఏఏలు బి.రమేష్, ఆమని తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



అప్పన్నకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాములమ్మ

రణస్థలం: అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పింఛన్ లబ్ధిదారులకు పలువురు వలంటీర్లు అక్కడికి వెళ్లి పింఛన్ అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలో పాతర్లపల్లికి చెందిన వలంటీర్ బమ్మిడి రాములమ్మ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మందాడి అప్పన్నకు వికలాంగుల పింఛన్ అక్కడికి వెళ్లి గురువారం అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన వలంటీర్ పున్నాన రాజీనాయుడు శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి వెళ్లి గణమాని సింహాచలంకి వృద్ధాప్య పింఛన్ అందజేశాడు. దీంతో ఆయా కుటుంబ సభ్యులు హర్షం వ్యక్త చేశారు.

శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం 882 అడుగులు



సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్

శ్రీశైలంప్రాజెక్ట్/ సత్రశాల(రెంటచింతల): శ్రీశైలం జలాశయంలోకి వరద ప్రవాహం తక్కువగా ఉండటం, నీటి విడుదల ఎక్కువగా ఉండటంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. జలాశయ నీటిమట్టం గురువారం సాయంత్రానికి 882.30 అడుగులకు చేరింది. రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదన కొనసాగిస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి 28,141 క్యూసెక్కులు వరద ప్రవాహం శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. బుధవారం నుంచి గురువారం వరకు కుడిగట్టు కేంద్రంలో 14.604 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 11.024 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 53,164 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 4,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 200.6588 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరోవైపు నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ రిజర్వాయర్ నిండుకుండలా ఉంది. ఎగువన ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి 33,298 క్యూసెక్కులు వరదనీరు టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు వస్తోందని ఈఈ కడలి శ్రీకాంత్, డీఈఈ నాగనర్సింహారావు గురువారం తెలిపారు. సత్రశాల టెయిల్‌పాండ్ ఐదు క్రస్ట్‌గేట్లు ద్వారా 25,031 క్యూసెక్కులు, రెండో యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అనంతరం 8,373 క్యూసెక్కులు మొత్తం 33,404 క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ తీగల వల్ల ఒక్క ప్రాణం కూడా పోకూడదు

- ప్రజల ఫిర్యాదులపై సీరియస్‌గా స్పందించాలి
- టోల్ ఫ్రీ నంబర్ 1912ను సచివాలయాల్లో ప్రదర్శించాలి
- విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



అధికారులతో సమీక్షలో విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ తీగల వల్ల ఇకపై ఒక్క ప్రాణం కూడా పోకూడదని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతపురం జిల్లాలో విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలో అమాయక కూలీలు మృత్యువాత పడటంపై ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి ఇటువంటి దుర్ఘటన పునరావృతం కాకూడదని అధికారులను హెచ్చరించారు. ఆయన గురువారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలపై ఎందుకు దృష్టిపెట్టలేదని అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన తక్షణమే స్పందించాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1912 గురించి ప్రచారం కల్పించాలని, అన్ని సచివాలయాల్లో ఈ నంబరు ప్రదర్శించాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు అపాయం కలిగించే అంశాలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, వాటిని పరిష్కరించాలన్నారు. అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లోనే కచ్చితంగా ఉండాలని చెప్పారు. విధుల్లో ఎవరైనా ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీలు అన్ని ప్రాంతాలను తనిఖీ చేస్తాయని తెలిపారు. లైన్‌మెన్లు, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ రంగానికి సంబంధించి కర్నూలు, అనంతపురం జిల్లాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొంత నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. పాత విద్యుత్ లైన్లను సకాలంలో మార్చకపోవడం, ఆధునికీకరణ చేపట్టకపోవడంవల్ల లైన్లు తెగిపడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ రెండు జిల్లాల ఎస్‌ఈ, ఈఈ స్థాయి అధికారులు తమ పరిధిలోని అన్ని లైన్లను తనిఖీ చేయాలని ఆదేశించారు.

పెండింగ్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లన్నీ ఈ నెలలో ఇవ్వాలి

దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు నిబంధనల ప్రకారం ఈ నెలాఖరు నాటికి విద్యుత్ సర్వీసు ఇవ్వాలని నిర్దేశించారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా రైతులకు డబ్బు జమచేసేందుకు ఖాతాలు ప్రారంభించడం, ఆధార్ అప్‌డేట్ పనుల్ని మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి విద్యుత్‌పై వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, విజిలెన్స్ జేఎండీ బి.మల్లారెడ్డి, పలు జిల్లాల ఎస్‌ఈలు, ఈఈలు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు జీఎస్ వరదాచారి కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: సీనియర్ జర్నలిస్టు గోవర్ధన సుందర (జీఎస్) వరదాచారి (92) గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. వయోభారంతోపాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట జర్నలిస్టు కాలనీలో నివాసం ఉండే ఆయనకు భార్య సరోజిని, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా.. భార్య 2000 సంవత్సరంలోనే చనిపోయారు. వరదాచారి మృతి పట్ల పలువురు ప్రముఖులు, సీనియర్ పాత్రికేయులు సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శుక్రవారం పంజాగుట్ట స్మశానవాటికలో వరదాచారి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వరదాచారి మృతి పట్ల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సుదీర్ఘ పాత్రికేయ జీవితంతో..

జీఎస్ వరదాచారి 1932లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జన్మించారు. న్యాయవాద కోర్సుతోపాటు జర్నలిజంలో డిప్లొమా చేశారు. 1956 ఒక తెలుగు దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పాత్రికేయ వృత్తిని ప్రారంభించారు. 1961లో ఆంధ్రభూమి దినపత్రికలో న్యూస్ ఎడిటర్‌గా చేరి 22 ఏళ్లు పనిచేశారు. 1983లో ఈనాడులో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరారు. అనంతర కాలంలో అధ్యాపకులుగా పనిచేశారు.

• తెలంగాణ

మునుగోడులో పోటెత్తిన ఓటర్లు

- 92 శాతం ఓటింగ్ నమోదు..
- తొలుత మందకొడిగా ప్రారంభమై మధ్యాహ్నానికి ఊపందుకున్న పోలింగ్
- 6న ఓట్ల లెక్కింపు..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలంగాణలోని మునుగోడు నియోజకవర్గానికి గురువారం జరిగిన ఉప ఎన్నికలో ఓటర్లు పోటెత్తారు. 92 శాతం మేరకు పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవగా.. తొలుత మందకొడిగా సాగింది. మధ్యాహ్నం నుంచి ఓటర్లు బూత్‌లకు రావడం పెరిగింది. ఉదయం 9 గంటల వరకు 11.2 శాతం పోలింగ్ నమోదు కాగా, 11 గంటల వరకు 25.8 శాతం నమోదైంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు 41.3 శాతం ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక 3 గంటల వరకు 59.92 శాతం మంది ఓట్లు వేశారు. 50 మంది సర్వీసు ఓటర్లు మినహాయిస్తే మిగతా 2,41,805 మందికి గాను 1,44,878 మంది మధ్యాహ్నం వరకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరారు. సాయంత్రం 5 గంటల వరకు 1,87,527 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 77.55 శాతం పోలింగ్ నమోదైంది. 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి కూడా పెద్ద సంఖ్యలో క్యూలైన్లలో నిలబడ్డారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం సహా చాలా గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగుతూనే ఉంది. పోలింగ్ సందర్భంగా పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. వాటిని సరిచేశాక పోలింగ్ కొనసాగింది. పోలింగ్ సందర్భంగా నియోజకవర్గంలోని పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. కాగా, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితులు ఉత్పన్నం కాలేదన్నారు. ఆరవ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ఎన్నికలో మొత్తం 47 మంది అభ్యర్థులు పోటీపడడం తెలిసిందే. ప్రధాన పోటీ అధికార టీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి మధ్య నెలకొంది.

ఎమ్మెల్యేలను కొంటుంటే చేతులు ముడుచుకోవాలా?

▶ మొదటి పేజీ తరువాయి

తొలిసారి స్పందించిన కేసీఆర్ గురువారం రాత్రి మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల క్రితమే మీడియా ముందుకు రావాలనుకున్నా మునుగోడు ఉప ఎన్నికలో లబ్ధి పొందేందుకు ప్రయత్నించారనే చిల్లర ఆరోపణలు వస్తాయని పోలింగ్ ముగిసేవరకు వేచి చూసినట్లు చెప్పారు. ఆయన ఏమన్నారంటే..

- ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని సుప్రీం కోర్టుప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లలిత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, అన్ని రాష్ట్రాల హైకోర్టు చీఫ్ జస్టిస్‌లను చేతులు జోడించి కోరుతున్నా. ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన ఆధారాలను సీబీఐ, ఈడీ, సీవీసీతోపాటు మీడియా సంస్థలకు శుక్రవారం మధ్యాహ్నం లోగా చేరవేస్తాం. అన్ని రాష్ట్రాల సీఎంలు, వివిధ పార్టీల అధ్యక్షులకు కూడా పంపిస్తున్నాం.
- కర్ణాటక ఎమ్మెల్యేలకు మారువేషాలు వేసి తరలించిన తీరును నిందితులు పూసగుచ్చినట్టు చెప్పారు. ఈవీఎంలు ఉన్నంత వరకు బీజేపీకి ఢోకా లేదన్నారు. దేశం రాజ్యాంగేతర శక్తుల చేతుల్లో ఉన్నట్టు వీరి మాటల ద్వారా వెల్లడవుతోంది. తెలంగాణలోనూ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని బీజేపీ నేతలు చెప్పడం ప్రజాస్వామ్యంలో వాంఛనీయమా? కొనుగోళ్ల వెనుక ఎవరున్నారు? నెల ముందు నుంచే రామచంద్ర భారతి అనే వ్యక్తి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో మొదట ఫోన్‌లో, తర్వాత ప్రత్యక్షంగా మాట్లాడటంతో వాళ్ల ప్రణాళిక అర్థమైంది. విచారణ జరపాలని హోంమంత్రికి ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. మూడు గంటలపాటు నిందితులు జరిపిన సంభాషణ వింటే ఆశ్చర్యం కలుగుతోంది. వాళ్లు దేశంలో అత్యున్నత స్థాయి వ్యక్తుల పేర్లు ప్రస్తావించారు. ఎనిమిది ప్రభుత్వాలను కూల్చాం. నాలుగు కూల్చే ప్రయత్నాల్లో ఉన్నాం. తెలంగాణ, ఢిల్లీలో బేరాలు అయిపోయాయి. ఆ తర్వాత ఆంధ్రా, రాజస్థాన్‌లో ప్రభుత్వాలు కూలిపోతాయి అని చెప్పారు. వెంటనే ఢిల్లీ ముఖ్యమంత్రిని అప్రమత్తం చేశాం. చైతన్యవంతమైన తెలంగాణ.. ఈ ముఠా ఆట కట్టించి వారి చర్యలను బయటకు తెచ్చింది. కేరళలోని వయనాడ్‌లో రాహుల్ గాంధీ మీద బీజేపీ టికెట్‌పై పోటీ చేసిన తుషార్ అనే వ్యక్తితో బ్రోకర్లు మాట్లాడారు. తుషార్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన వ్యక్తి కేంద్ర హోంమంత్రి అమిత్ షా. ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని స్వయంగా దేశ ప్రధాని చెప్పడం దేనికి సంకేతం? నెల రోజుల్లో తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని దేశ హోంమంత్రి చెప్పడం ప్రజాస్వామ్యంలో వాంఛనీయమా?
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మేం ప్రజాస్వామ్య పద్ధతిలోనే విలీనం చేసుకున్నాం. మూడింట రెండొంతుల మంది ఎమ్మెల్యేలు పార్టీ నుంచి బయటకు వచ్చారు. ప్రజాతీర్పును గౌరవించాలి. మేము గెలిస్తేనే ప్రజాస్వామ్యం అనే పద్ధతి సరికాదు.
- మీరు రెండుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. ఇంకేం కావాలి? స్వయంగా అడుగు ముందుకేసి ఈ దుర్మార్గంలో పాత్ర పోషించిన వారందరినీ అరెస్టు చేసి దర్యాప్తు చేయించండి. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే పనిలో మీరు ఉంటే దేశ ప్రజలను ఎవరు చూసుకుంటారు? ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో దాగిన భయంకరమైన దగా, కుట్రలు వింటే ఆశ్చర్యం కలుగుతుంది. 20 సార్లు అమిత్ షా పేరు, ఒకట్రెండు సార్లు మోదీ పేరు చెప్పారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు రూ.12 వేల కోట్లు ఖర్చు పెట్టారని ఇటీవలే ఓ పత్రికలో రాశారు.
- బీఎల్ సంతోష్, అమిత్ షా, జేపీ నడ్డా పేర్లను బ్రోకర్లే చెప్పారు. తెలంగాణ ఎమ్మెల్యేలను ప్రలోభపరిచే కుట్రలో పాల్గొన్న మధ్యవర్తుల ఫోన్లను పోలీసులు సీజ్ చేసిన తరువాత వీరి కుట్ర కోణమంతా బయటపడింది. 2015 నుంచి ఇప్పటి వరకు దేశంలో ఏం జరిగిందో వీళ్ల చరిత్ర ఏమిటో మొత్తం బయటపడింది.

సీఎం మేలు చేస్తున్నా బురద చల్లుతున్న చంద్రబాబు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



కడప అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో ఎంతో మేలు చేస్తున్నా.. చంద్రబాబునాయుడు, టీడీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. ఆమె గురువారం కడప రిమ్స్‌లో ప్రాంతీయ జిల్లాల వైద్యాధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్య రంగంలో నూతన ఒరవడి తీసుకొచ్చారన్నారు. తండ్రి బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో సమూలంగా మార్పులను తీసుకొచ్చి ఎన్నడూ లేనివిధంగా వైద్యరంగంలో విశేష అభివృద్ధి చేపడుతున్నారని చెప్పారు. కొత్త జిల్లాల్లో ఐదు మెడికల్ కళాశాలల నిర్మాణాలను ప్రారంభించి, వేగంగా పనులను చేయిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు. వైద్యరంగంలో గతంలో ఎన్నడూ చేపట్టని విధంగా వైద్యుల దగ్గరి నుంచి వివిధ స్థాయి ఉద్యోగుల వరకు కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మొత్తం 44,760 మందిని నియమించారని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీలో 1000 ప్రొసీజర్లను ప్రవేశపెడితే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 3,255 ప్రొసీజర్లను ప్రవేశపెట్టారన్నారు. ఇవేమీపట్టని చంద్రబాబునాయుడు, టీడీపీ నేతలు వైద్యరంగంలోని మార్పులను స్వాగతించడంపోయి బురద జల్లే ప్రయత్నం చేయడం సమంజసం కాదని చెప్పారు. రాయలసీమ జిల్లాలకు చెందిన చంద్రబాబు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేదిశగా ఏనాడూ కృషి చేయలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతానికి న్యాయరాజధాని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుంటే విమర్శించడం తగదన్నారు. ఫోర్జరీ చేసిన టీడీపీ మాజీమంత్రి అయ్యన్నపాత్రుడిని అరెస్ట్ చేయడం చట్టపరంగా తీసుకునే చర్యల్లో భాగమేనని చెప్పారు. విశాఖగర్జనలో మంత్రులపై దాడిని సమర్థించే విధంగా చంద్రబాబు ప్రవర్తించడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.

జగనన్న కాలనీలకు రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు



పూడి హరి

బొబ్బిలి: రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మాణమవుతున్న జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి, సాలూరుల్లోని రెండు కాలనీలకు సబ్ స్టేషన్లు మంజూరైనట్లు చెప్పారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.3కోట్ల వరకూ ఖర్చవుతుందన్నారు. అలాగే పట్టణంలో రూ.5 కోట్లతో కొత్త విద్యుత్ లైన్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇళ్ల పైకప్పులపై నుంచి వెళ్లే సర్వీసులు, వేలాడే విద్యుత్ వైర్లను దశల వారీగా మార్పు చేస్తామని తెలిపారు. వినియోగదారులకు భద్రతా ప్రమాణాలను వివరించేందుకు కరపత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు.

వీఆర్‌ఓపై దర్యాప్తు

రాజాం: పట్టణ పరిధిలోని బుచ్చింపేట గ్రామ వీఆర్‌ఓగా పనిచేస్తూ భూ ఆక్రమణలు, తప్పుడు మ్యుటేషన్‌లు చేస్తూ సస్పెన్షన్‌కు గురైన వీఆర్‌ఓ దుప్పాడ ఆనందరావుపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి గురువారం దర్యాప్తు నిర్వహించారు. మూడు నెలల క్రితం ఆయన బుచ్చింపేటలో ఓ శ్మశానవాటికకు వన్‌బీలు సృష్టించి, విక్రయానికి సిద్ధం చేసిన ఘటనలో గ్రామస్తులు ఫిర్యాదుచేయగా కలెక్టర్ ఆయనపై సస్పెన్షన్ విధించిన విషయం విదితమే. అప్పట్లో మూడునెలల పాటు సస్పెన్షన్ విధించారు. ఆ సమయం పూర్తి కావడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు దర్యాప్తు నిర్వహించినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. గతంలో వీఆర్‌ఓపై వచ్చిన ఫిర్యాదులను వివరించడంతో ఆమె నివేదిక తయారుచేసి కలెక్టర్‌కు అందించనున్నారని రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే పట్టణంలోని కొండంపేట గ్రామానికి చెందిన వీఆర్‌ఓ శ్రీనివాసరావుపై కూడా ఇదే తరహాలో డిప్యూటీ కలెక్టర్ దర్యాప్తు చేసినట్లు తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు.

వివాహితపై లైంగిక దాడి యత్నం

వంగర: మండల పరిధి మడ్డువలస పంచాయతీ జగన్నాథవలస గ్రామానికి చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన మొగిలి శ్రీకాంత్ లైంగిక దాడికి యత్నించినట్లు హెచ్‌సీ డి.రాములు తెలిపారు. ఎవరూ లేని సమయంలో అమ్మవారిగుడి సమీపంలో మహిళను పట్టుకోవడంతో ఆమె కేకలు వేసి తప్పించుకుందని తెలిపారు. ఫిర్యాదు మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అటవీ డివిజన్ అభివృద్ధికి చర్యలు

- శాఖాపరంగా పునర్వ్యవస్థీకరణ
- పాలకొండకు సబ్ డీఎఫ్‌ఓ కార్యాలయం
- జిల్లాలో 1.07లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణం గుర్తింపు



సబ్ డీఎఫ్‌ఓ కార్యాలయంగా స్థాయి పొందిన పాలకొండ అటవీ రేంజ్ కార్యాలయం



పార్వతీపురం మన్యంలో బీట్లు పరిశీలిస్తున్న జిల్లా అటవీ శాఖాధికారిణి ప్రసూన ఇతర అధికారులు

పాలకొండ రూరల్: పాలనా సౌలభ్యంలో భాగంగా ఏర్పాటైన జిల్లాల్లో భాగంగా నూతన సరిహద్దులతో ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లాలో అధిక భాగం ఏజెన్సీ కలబోసుకుని ఉంది. దీంతో అటవీశాఖ అధికారులు జిల్లాల్లో శాఖాపరంగా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపట్టారు. జిల్లా పరిధిలో రెండు సబ్ డివిజన్లలో పటిష్టంగా కార్యకలాపాల నిర్వహణకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. పార్వతీపురం జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందటంతో అందుకు తగ్గట్టు ఇక్కడి డివిజన్ కార్యాలయం జిల్లా కేంద్ర కార్యాలయంగా మార్పు చెందింది. ఈ నేపథ్యంలో 1.07 లక్షల హెక్టార్ల భూమి పార్వతీపురం మన్యం అటవీ డివిజన్‌లో నిక్షిప్తమై ఉన్నట్లు గుర్తించారు.

పాలకొండకు అదనపు హంగు

డివిజన్ కేంద్రంలో అటవీ శాఖ రేంజ్ కార్యాలయం స్థాయి పెరిగింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా స్థానిక కార్యాలయం హద్దులు, భౌగోళిక స్వరూపంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు పార్వతీపురంలో గల సబ్ డీఎఫ్‌ఓ కార్యాలయం తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాలకొండకు వర్తింపజేస్తూ జీఓ విడుదలైంది. దీంతో స్థానిక రేంజ్ కార్యాలయం సబ్ డీఎఫ్‌ఓ కార్యాలయంగా రూపుదిద్దుకుంది. స్థాయి మారక ముందు స్థానిక అటవీ రేంజ్ కార్యాలయం ద్వారా పాలకొండ, రాజాం, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల పరిధిలో గల 12 మండలాలకు సేవలు అందించేవారు. జిల్లాల పెంపులో భాగంగా రాజాం నియోజకవర్గం విజయనగరం జిల్లాకు, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాలు శ్రీకాకుళానికి పరిమితమైంది. దీంతో పార్వతీపురం జిల్లాలో చేరిన పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాలతో పాటు కురుపాం నియోజకవర్గ పరిధిలో గల జియ్యమ్మవలస, గుమలక్ష్మీపురం మండలాలకు పాలకొండ సబ్ డీఎఫ్‌ఓ కార్యాలయం ద్వారా సేవలు అందించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. సబ్ డీఎఫ్‌ఓగా రాజారావును నియమించింది.

శాఖాపరమైన చర్యలు

జిల్లా అటవీ కార్యాలయం ద్వారా సిబ్బందిచే సమర్థవంతగా విధులు నిర్వహింపజేసేందుకు యంత్రాంగం ఇప్పటికే కసరత్తు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు నూతనంగా రేంజ్‌లు, బీట్లును నిర్దేశించారు.

కొమరాడ సెక్షన్ పరిధిలో మసిమండను నాలుగు బీట్లుగా ఏర్పాటు చేయగా... ఇందులో తుమ్మలవలస, పెద్దవలస, ఉలిపిరివలస, గొయిపాడు ప్రాంతాలను బీట్లుగా నిర్ణయించారు. కురుపాంకు రేంజ్‌కు సంబంధించి ఎటువంటి మార్పులు చేయకపోవటంతో ఈ ప్రాంతంతో పాటు పాలకొండ రేంజ్ బాధ్యతలను స్థానిక సబ్ డీఎఫ్‌ఓ పర్యవేక్షించనున్నారు. సాధారణంగా రెండు వేల నుంచి 2,500 హెక్టార్లను అటవీ ప్రాంత బీటుగా గుర్తిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అయితే జిల్లాల విభజన నేపథ్యంలో ఏర్పడిన సరిహద్దుల మార్పులను దృష్టిలో పెట్టుకుని అవసరమైన రక్షణ చర్యలను చేపడుతున్నారు. దీనిని అనుగుణంగా విధులు నిర్ణయిస్తున్నారు.

అటవీ రక్షణకు చర్యలు



నూతనంగా ఏర్పడ్డ జిల్లాలో అటవీ సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పాలనా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందికి విధులు నిర్ణయించటం జరిగింది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా గార్డులకు బీట్లు కేటాయింపు చేపడుతున్నాం. పాలకొండ సబ్ డీఎఫ్‌ఓ కార్యాలయం పరిధిలో గల రెండు రేంజ్‌ల్లో దాదాపు 50వేల హెక్టార్లు అటవీ భూముల పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– జీపీపీ ప్రసూన, అటవీ శాఖాధికారిణి, పార్వతీపురం మన్యం జిల్లా

సమర్థవంతంగా విధులు

శాఖా పరమైన చర్యల్లో భాగంగా జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఉండే సబ్ డీఎఫ్‌ఓ కార్యాలయం పాలకొండకు చేరింది. ఈ క్రమంలో కురుపాం, పాలకొండ అటవీ రేంజ్‌ల పర్యవేక్షణ ఉంటుంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో అటవీ సంపద, విలువైన కలపతో పాటు ఇతర నిషేధిత పదార్థాల రవాణాను అరికట్టేందుకు నిఘా విస్తృతం చేశాం. అటవీ సంపద రక్షణ, వన్యప్రాణుల కాపాడేందుకు సమర్థవంతంగా విధులు నిర్వహించేలా సిబ్బందికి సూచనలు చేస్తున్నాం.

– బి.రాజారావు, సబ్ డీఎఫ్‌ఓ పాలకొండ

రహదారికి మరమ్మతు పనులు



పసుకుడి వద్ద రహదారి మరమ్మతు పనులు

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వర్షాల వల్ల రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. భామిని నుంచి బిల్లుమడ వరకు గతుకులమయమైన రహదారికి మరమ్మతు పనులను అధికారులు గురువారం ప్రారంభించారు.

పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి

కురుపాం: పింఛనర్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులకు కూడా కరువు భత్యం ప్రకటించాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, పాత పెన్షన్, కుటుంబ పెన్షన్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 65 సంవత్సరాల నుంచే 20 శాతం ఇవ్వాలని కోరారు.

కరాటే పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించినవారిని అభినందిస్తున్న సీఐ తదితరులు

రాజాం: రాజాం పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తా చూపారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో ఎస్.సాయిలక్ష్మి, బ్లూ, ఆరెంజ్, గ్రీన్ బెల్ట్ విభాగంలో ఇ.స్నేహజ్, వి.రిషిక, సీహెచ్.తాన్విక, శ్రీకారుణ్య, బి.డోలశ్రీ, బి.శ్రీజ్ఞానవి, వి.సూర్యచంద్ర, కె.హేమకేష్, కామరుద్దీన్‌లు బంగారు పతకాలు సాధించారు. ఎల్లో, వైట్ విభాగాల్లో ఎమ్.యశ్విత బంగారు పతకాన్ని, టి.చైతన్య, సుజితలు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. వీరిని కరాటే మాస్టర్ శితో పాటు సీఐ రవికుమార్, కోచ్ అనూరాధ తదితరులు గురువారం అభినందించారు.

రూ.1.86 కోట్ల ఉపాధి పనుల గుర్తింపు



రాయగడజమ్ములో గ్రామస్తులకు అవగాహనా కల్పిస్తున్న ఏపీడీ చంద్రమ్మ

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీలో 2023 – 2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా 121 పనులు చేపట్టేందుకు రూ.1.86 కోట్ల విలువ చేసే పనులు గుర్తించినట్లు పార్వతీపురం క్లస్టర్ ఏపీడీ చంద్రమ్మ తెలిపారు. ఏపీఓ శివకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి పనులతో పాటు రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించేలా గ్రామస్తులకు ఆమె అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పువ్వల అమల, తదితరులు పాల్గొన్నారు.

తలవరంలో ఆధ్యాత్మిక శోభ



తలవరంలో షిర్డీసాయి బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

వీరఘట్టం: మండలంలోని తలవరం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. క్షీరాభిషేకం, చందనాభిషేకం, నారికేళాలతో అభిషేకాలు చేశారు. ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి నామసంకీర్తనలతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక చోటుచేసుకుంది.

సేవలకు పతకాలు



వి.కుమారస్వామి



ఎస్.చిన్నయ్య



ఎంఆర్‌సీహెచ్.శేఖర్



బి.చంద్రశేఖర్

విజయనగరం క్రైమ్: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పలువురు పోలీసులకు సేవా పతకాలను ప్రదానం చేసింది. విజయనగరం జిల్లాకు చెందిన ఏఆర్ ఎస్ఐ వి.కుమారస్వామికి మహోన్నత సేవా పతకం, రామభద్రపురం ఏఎస్ఐ ఎస్.చిన్నయ్య, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ ఎంఆర్ సీహెచ్ శేఖర్, కంట్రోల్ రూమ్ కానిస్టేబుల్ బి.చంద్రశేఖర్‌లకు సేవాపతకాలను అందజేసింది. పతకాలు పొందిన వారిని ఎస్పీ ఎం.దీపిక గురువారం అభినందించారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో పనిచేసి, ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని అభిలషించారు.











వింటర్ విన్ స్టైల్

**చలిగాలులు సందడి పెరుగుతోంది.
ఇప్పటి వరకు ఉన్న డ్రెస్సింగ్ స్టైల్‌కి కొత్త మార్పు రాబోతోంది.
అది స్వెటర్ కావచ్చు లేదంటే శాలువా అవ్వచ్చు.
కానీ, డెనిమ్ ఎంచుకుంటే.. స్టైల్‌తో పాటు
వింటర్‌పై ఈజీగా విన్ అవ్వచ్చు.
అందుకే, డెనిమ్ క్యాజువల్ వేర్ నుంచి కంఫర్ట్ వేర్‌గా
ఆఫీస్ వేర్ నుంచి పార్టీవేర్‌గా సీజన్‌కి తగిన లుక్‌తో అట్రాక్ట్ చేసేస్తోంది.**

- ఇండోవెస్ట్రన్ స్టైల్‌ను డెనిమ్ సూట్స్‌తో ఇట్టే తీసుకురావచ్చు.
- డెనిమ్ జాకెట్స్ చీరల మీదకూ ధరించవచ్చు. ఈ కాంబినేషన్‌కు ప్యాచ్‌వర్క్, ఎంబ్రాయిడరీ చేసిన జాకెట్స్‌ను ఎంచుకోవచ్చు.
- ఫంకీ జ్యువెలరీ ఈ స్టైల్‌కి బెస్ట్ ఎంపిక అవుతుంది.

ఈవెంట్

నూరు తల్లుల కథ

**31 ఒక్క దేశాలు. 100 మంది తల్లులు.
వారు టీచర్లు, సైంటిస్ట్‌లు, క్రీడాకారులు, సంగీతకారులు, మహిళా సైనికులు...
రంగాలు వేరు. కాని మాతృత్వం ఒకటే. ఒక మహిళ నిర్వహించే అత్యుత్తమ కర్తవ్యం
తల్లి కావడం. అందుకు ప్రతి తల్లీ ఒక భిన్న ప్రయాణం చేస్తోంది.
ఆ తల్లుల గాథలు అందరికీ తెలియాలి
అని భావించిన ప్రసిద్ధ పోర్ట్రయిట్ ఫొటోగ్రాఫర్ శిఖా ఖన్నా
వందమంది తల్లుల ఫొటోలు, ఇంటర్వ్యూలతో
'100 సెల్ఫ్‌పోర్ట్రయిట్స్ 100 డ్రీమ్స్' పేరుతో పుస్తకం తెస్తోంది.
ఈ సందర్భంగా వచ్చే వారం పూణెలో ఈ వందమంది తల్లులు
ఒక వేదిక మీదకు రానున్నారు. ఈ ఘట్టం తల్లి గొప్పదనాన్ని చాటనుంది.**

ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసే ఒక తల్లికి లడాఖ్‌లో డ్యూటీ. ఆ సమయానికి ఆమెకు రెండేళ్ల పాప ఉంది. దూరాన వదల్లేదు. లడాఖ్‌లో ప్రతికూల వాతావరణంలో పెంచడం రిస్క్. ఉద్యోగమా... మాతృత్వమా? ఏం... రెండూ ఎందుకు చేయకూడదు. ఆమె తన రెండేళ్ల కూతురిని లడాఖ్ తీసుకెళ్లింది. ఒకవైపు డ్యూటీ చేస్తూనే మరోవైపు కూతురిని పెంచింది. ఆ తల్లి ఆ సవాలును ఎలా స్వీకరించి దాటిందో ఆ కథ తెలిస్తే ఎలా ఉంటుంది?

ఒక తల్లి అంధురాలైన కళాకారిణి. అంధత్వంతో కళలో సాగడమే ఒక కష్టమైతే తల్లిగా బాధ్యతలు నెరవేర్చడం ఇంకా కష్టం. కాని ఆ తల్లి ఆ బాధ్యతను నెరవేర్చింది. అందుకు ఏ యే ఇక్కట్లను దాటింది? ఆమె నోటి గుండా వింటే ఎంత బాగుంటుంది?

ఒక తల్లి క్రీడల్లో కొనసాగాలి. దేశాలు తిరగాలి. మరోవైపు పిల్లలు. ఆటల కోసం వ్యాయామానికి, ప్రాక్టీసుకు సమయం ఇవ్వాలి. మరోవైపు పిల్లలకూ ఇవ్వాలి. ఎంత ఒత్తిడి. ఏదో ఒకటి ఎంచుకొని రెండోది వదిలేయకుండా రెంటినీ నిర్వహించడంలోనే ఆ తల్లి గొప్పదనం ఉంది. ఆ కథ లోకంలో ఎందరికి తెలుసు?

తల్లులు ఇంటి పట్టునే ఉన్నా, కెరీర్‌లో ఉన్నా పిల్లల పెంపకం కోసం ఎనలేని త్యాగాలు చేస్తూనే ఉంటారు. ఎన్నో కష్టాలు పడుతూ ఉంటారు. పిల్లల కోసం స్వార్థమెరుగని అంకితాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. అలా వివిధ రంగాల్లో ఉంటూ ఆ రంగాల్లో తమదైన విజయాన్ని నమోదు చేస్తూ కూడా పిల్లల పెంపకంలో ఏ వంకా వదలని తల్లులు తమ జీవితాలను తమ మాటల్లో చెప్తే కచ్చితంగా ఈ కాలం తల్లులకు, కాబోయే తల్లులకు స్ఫూర్తిగా ఉంటుంది. మగవారు వాటిని వింటే తల్లులకు ఇవ్వాల్సిన స్థానం, గౌరవం మరింత విశదం అవుతుంది.

ఆ ఆలోచనతోనే ఫొటోగ్రాఫర్ శిఖా ఖన్నా 'ఎంయుఎం' (మదర్స్ యునైటెడ్ మూవ్‌మెంట్) అనే ప్రాజెక్ట్ మొదలెట్టింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా '100 సెల్ఫ్ పోర్ట్రెయిట్స్ 100 డ్రీమ్స్' అనే పుస్తకాన్ని తెచ్చింది. ఆ పుస్తకంలో తల్లుల జీవన గాథలు వారి మాటల్లోనే రికార్డు చేసింది. 31 దేశాల నుంచి 100 మంది తల్లులు- వారంతా తమ తమ కెరీర్‌ను కొనసాగిస్తున్న వారు... వృత్తిలో విజయం సాధిస్తూనే తల్లిగా కూడా విజయం సాధించినవారు- తమ అనుభవాలను ఈ పుస్తకంలో చెప్పారు. భారతదేశం నుంచి అథ్లెట్ అశ్వినీ నాచప్ప, పారా అథ్లెట్ దీపా మాలిక్ తదితరులు ఉన్నారు. ఇతర దేశాల నుంచి టీచర్లుగా, మ్యూజిక్ టీచర్లుగా, లైఫ్‌స్టయిల్ కోచ్‌లుగా, గాయనులుగా, హక్కుల ఉద్యమకారులుగా, చెఫ్‌లుగా, ఫొటోగ్రాఫర్లుగా వివిధ రంగాలలో కొనసాగుతున్న తల్లులు ఉన్నారు.

'తల్లి గొప్పదనం ఎంత చెప్పినా తక్కువే. ఈ పుస్తకం ఆమెను మరింత ఉన్నతంగా ఉంచుతుంది' అంటుంది శిఖా ఖన్నా. స్వయంగా ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్ అయిన శిఖా భారతదేశంలో న్యూబోర్న్ బేబీల ఫొటోగ్రఫీని తొలిగా ప్రవేశ పెట్టింది. దాదాపు 1000 ప్రముఖ కుటుంబాల ఫొటోలు తీసిందామె. అంతే కాదు యువతరం కోసం ఆన్‌లైన్‌లో ఫొటోగ్రఫీ క్లాసులు తీసుకుంటూ ఉంటుంది. తను తల్లయ్యాక ఫొటోగ్రాఫర్/తల్లిగా రెండు పాత్రలు పోషించడంలో తానెంత ఫోకస్డ్‌గా ఉండాల్సి వచ్చిందో అర్థమయ్యాక ఇలా పని చేసే తల్లుల కథలు ఎందరికో స్ఫూర్తిని స్తాయి కదా అనిపించింది. పిల్లలు పుట్టగానే చాలామంది తల్లులు తమకు ఎంతో ఇష్టమైన వృత్తిని, ఉపాధిని, హాబీని వదిలేస్తుంటారు. అలాంటి వారు ఒక ధైర్యం తెచ్చుకోవాలనే ఉద్దేశంతో ఈ పుస్తకం తెచ్చిందామె.

పూణెలో నవంబర్ 11 నుంచి 13 తేదీల మధ్య జరిగే ఈవెంట్‌లో ఈ 100 మంది తల్లులు వచ్చి నేరుగా ప్రేక్షకులతో మాట్లాడనున్నారు. స్త్రీల మాతృత్వానికి, జీవన రంగానికి సంబంధించిన అనేక సెషన్స్ జరగనున్నాయి. అలాగే ఈ పుస్తకం ఆవిష్కరణ కూడా జరగనుంది.

ప్రధాని మెచ్చుకుని ఈ ఈవెంట్ విజయవంతం కావాలని సందేశం పంపారు.

ఈ ఈవెంట్‌లో పాల్గొనే తల్లులకు శుభాకాంక్షలు.




శిఖా ఖన్నా

తల్లులు ఇంటి పట్టునే ఉన్నా, కెరీర్‌లో ఉన్నా పిల్లల పెంపకం కోసం ఎనలేని త్యాగాలు చేస్తూనే ఉంటారు. ఎన్నో కష్టాలు పడుతూ ఉంటారు. పిల్లల కోసం స్వార్థమెరుగని అంకితాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. అలా వివిధ రంగాల్లో ఉంటూ ఆ రంగాల్లో తమదైన విజయాన్ని నమోదు చేస్తూ కూడా పిల్లల పెంపకంలో ఏ వంకా వదలని తల్లులు తమ జీవితాలను తమ మాటల్లో చెప్తే కచ్చితంగా ఈ కాలం తల్లులకు, కాబోయే తల్లులకు స్ఫూర్తిగా ఉంటుంది. మగవారు వాటిని వింటే తల్లులకు ఇవ్వాల్సిన స్థానం, గౌరవం మరింత విశదం అవుతుంది.



వైరల్

ఆర్ట్ బై... నూర్జహాన్!?

ఒక చిత్రం గీయడానికే చాలా కష్టపడాల్సి వస్తుంది. నూర్జహాన్ అనే ఆర్టిస్ట్ మాత్రం ఏక కాలంలో రకరకాల చిత్రాలు గీస్తూ ప్రేక్షకులను అబ్బురపరుస్తోంది. తాజాగా ఏకకాలంలో పదిహేనుమంది స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాలను గీసింది నూర్జహాన్.


● నూర్జహాన్

ఈ వీడియోను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

'ఆమె ప్రతిభావంతురాలైన ఆర్టిస్ట్. ఏకకాలంలో పదిహేను భిన్నమైన చిత్రాలు గీయడం ఆర్ట్ కాదు. అద్భుతం' అని కితాబు ఇవ్వడం మాత్రమే కాదు తనవంతుగా సహాయం చేయనున్నట్లు ప్రకటించారు.

మహీంద్ర పోస్ట్ చేసి నూర్జహాన్ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. నెటిజనులు రకరకాలుగా స్పందించారు.

హిమాన్షు బరియ అనే ట్విట్టర్ యూజర్ ఇలా స్పందించాడు...

'ఒక ఆర్టిస్ట్‌గా నా సందేహం ఏమిటంటే ఇది ఎలా సాధ్యం అవుతుంది అని. పెన్నుల పొజిషన్‌లు మార్చకుండా రకరకాలుగా గీయడం ఎలా వీలవుతుంది? దీని గురించి ఎవరైనా చెబితే తెలుసుకోవాలని ఉంది'

కొందరైతే నూర్జహాన్ వీడియో 'అసలా? కాదా?' అనే సందేహాన్ని వెలువరించారు.

అయితే నూర్జహాన్‌కు అనుకూలంగా కామెంట్స్ పెట్టిన వారు కూడా చాలా మంది ఉన్నారు. అందులో కొన్ని...

'ఎక్కడో జరిగితే అద్భుతం. మన దగ్గర జరిగితే సందేహం'

'ఆర్టిస్ట్‌లను రకరకాల సందేహాలతో నిరాశ పరచడం తగదు. ప్రతి విషయాన్ని ప్రతికూల కోణంలో చూడవద్దు'

'గత సంవత్సరం ఆస్ట్రేలియన్ ఆర్టిస్ట్, యూ ట్యూబర్ జాజ్(ఎలన్ బ్రూక్స్) ఏకకాలంలో నాలుగు భిన్నమైన చిత్రాలు గీసిన వీడియోను పోస్ట్ చేశాడు. అది నిజమైనప్పుడు ఇది ఎందుకు నిజం కాదు'

'ఎడుర్డీ సోకోలక్యన్ అనే ఆర్టిస్ట్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఒకే సమయంలో ఎన్నో చిత్రాలు గీయగలడు. నూర్జహాన్ కూడా ఈ కోవకు చెందిన ఆర్టిస్ట్'

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సలార్‌పూర్ జిల్లాకి చెందిన నూర్జహాన్‌కు సొంతంగా యూ ట్యూబ్ చానల్ ఉంది. లక్షమందికి పైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు.

వంటిల్లు



ఉసిరి సంపద

**గ్రీన్ అమ్లా... హనీ అమ్లా... క్యాండీ అమ్లా... పికిల్ అమ్లా.
ఆరోగ్యసిరినిచ్చే ఉసిరి తింటే వచ్చే ప్రయోజనాలెన్నో...
ఆ అన్నింటిలో కొన్నింటిని ఇప్పుడు తెలుసుకుందాం.
ప్రతి వంటిల్లూ ఉసిరి సంపదలతో విలసిల్లాలనేది ఆకాంక్ష.**

అమ్లా క్యాండీ



కావలసినవి: ఉసిరి కాయలు – 250 గ్రాములు ; చక్కెర – 150 గ్రాములు ; జీలకర్ర పొడి– టీ స్పూన్ ; శొంఠి పొడి– టీ స్పూన్ ; చక్కెర పొడి –2 టీ స్పూన్‌లు ; ఫుడ్ కలర్ – చిటికెడు (ఇష్టమైతేనే).

తయారీ: ఉసిరికాయలను శుభ్రంగా కడగాలి. ఒక పాత్రలో వేసి కాయలు మునిగేటట్లు నీటిని పోసి మరిగించాలి. ● నీరు మరిగిన తర్వాత ఉసిరికాయలను వేసి రెండు నిమిషాలు మరిగించిన తర్వాత పాత్రను స్టవ్ మీద నుంచి దించి నీటిని వంపేయాలి. ● ఉసిరికాయలను కట్ చేసి గింజలను తీసివేయాలి. ఉసిరి పలుకులలో జీలకర్ర, అల్లం పొడి, చక్కెర వేసి పాత్రకు మూతపెట్టి పక్కన పెట్టాలి. ● మరుసటి రోజుకు చక్కెర కరిగి ఉసిరి పలుకులు చక్కెర ద్రావణంలో తేలుతుంటాయి. ● మూడవ రోజుకు చక్కెర ద్రావణాన్ని ఉసిరి పలుకులు దాదాపుగా పీల్చుకుంటాయి. ● మూడవ రోజు ఉదయం ఉసిరి ముక్కలను ఒక పాలిథిన్ షీట్ మీద వేసి ఆరనివ్వాలి. ● తేమ పూర్తిగా పోవాలంటే రెండు రోజులు ఎండలో ఆరబెట్టాలి. ● తగినంత ఎండ లేకపోతే మూడవరోజు కూడా ఆరబెట్టాల్సి ఉంటుంది. ● చివరగా చక్కెర పొడిలో ఫుడ్ కలర్ కలిపి ఆ పొడిని ఎండిన ఉసిరి పలుకుల మీద చల్లాలి. ● వీటిని గాలిచొరని సీసాలో నిల్వ చేసుకుని రోజుకొకటి తినవచ్చు. ● ఇవి రక్తంలో హిమోగ్లోబిన్ పెరగడానికి దోహదం చేస్తాయి. నోరు రుచిలేనట్లు ఉన్నప్పుడు భోజనానికి గంట ముందు ఒక పలుకు తింటే రుచిగ్రంథులు ఉత్తేజితమవుతాయి. ● గర్భిణికి కడుపులో వికారం తగ్గిస్తుంది.

గ్రీన్ అమ్లా జ్యూస్



కావలసినవి : ఉసిరికాయలు– 3 లేదా నాలుగు (సైజ్‌ని బట్టి) ; అల్లం – అర అంగుళం ముక్క ; నీరు– 200 మిల్లీ లీటర్లు; ఉప్పు– చిటికెడు ; నిమ్మరసం– టీ స్పూన్.

తయారీ: ● అల్లం, ఉసిరికాయలను తురిమి నీటిలో కలపాలి. అందులో ఉప్పు, నిమ్మరసం వేసి కలిపి రోజూ ఉదయం తాగాలి. ఫైబర్‌తో తాగడమే మంచిది. తురుము అడ్డు పడుతోందనిపిస్తే పది నిమిషాల తర్వాత వడపోసి తాగవచ్చు. ఈ జ్యూస్ డయాబెటిస్‌ను అదుపులో ఉంచుతుంది. పై పరిమాణం ఒకరికి సరిపోతుంది.

గమనిక: బీపీ, డయాబెటిస్‌లను అదుపులో ఉంచుకోవడానికి ఆమ్లా జ్యూస్ తాగాలనుకునే వారికి సూచన. ఉసిరికాయల సీజన్ పోయిన తర్వాత మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే ఎడిబుల్ ఆమ్లాపౌడర్ వాడవచ్చు. ఒక ఉసిరి కాయకు ఒక టీ స్పూన్ పౌడర్ దాదాపుగా సమానం.

హనీ అమ్లా డ్రింక్

కావలసినవి: ఉసిరికాయ – ఒకటి ; గోరువెచ్చటి నీరు– కప్పు ; పుదీన ఆకులు– నాలుగు ; తేనె – టీ స్పూన్

తయారీ: ఉసిరికాయ, పుదీన ఆకులను మిక్సీలో గ్రైండ్ చేసి రసం తీసుకుని గోరువెచ్చటి నీరు, తేనె కలపాలి. ఈ జ్యూస్‌ని రోజూ ఉదయం తాగాలి. ఇది బీపీని క్రమబద్ధం చేస్తుంది.

ఉసిరి పచ్చడి

కావలసినవి: ఉసిరికాయలు – 250 గ్రాములు ; నూనె– 4 టేబుల్ స్పూన్‌లు ; ఆవాలు – 2 టీ స్పూన్‌లు ; నిమ్మకాయ– 1 (పెద్దది) ; కారం పొడి– 4 టేబుల్ స్పూన్‌లు ; ఉప్పు – 4 టీ స్పూన్‌లు (ఎవరి అభిరుచికి తగినట్లు మార్చుకోవాలి) ; పసుపు – పావు టీ స్పూన్ ; వెల్లుల్లి– ఒకటి (రేకలు ఒలిచి పెట్టుకోవాలి) మెంతులు – చిటికెడు.



తయారీ: ● ఉసిరికాయలను శుభ్రంగా కడిగి తేమ పోయేటట్లు తుడవాలి. ● ఆవాలు, మెంతులను మిక్సీలో వేసి పొడి చేయాలి. ● ఆరిన ఉసిరి కాయల మీద చాకు లేదా ఫోర్కుతో గాట్లు పెట్టాలి. ● బాణలిలో నూనె వేడి చేసి ఉసిరి కాయలు ముదురు గోధుమ రంగు వచ్చే వరకు మగ్గనివ్వాలి. కాయల్లో వెల్లుల్లి రేకలు వేసి స్టవ్ ఆపేయాలి. ● ఉసిరి కాయల వేడి తగ్గిన తరవాత ఆవాలు–మెంతుల పొడి, కారం, ఉప్పు, పసుపు వేసి కలపాలి. మిశ్రమం పూర్తిగా చల్లారిన తర్వాత నిమ్మరసం కలపాలి. ● ఈ మిశ్రమాన్ని సీసాలో నిల్వ చేయాలి. రెండు రోజుల తర్వాత స్పూన్‌తో పచ్చడిని మరోసారి కలపాలి. అవసరమైతే అప్పుడు మరికొంత నిమ్మరసం కలుపుకోవచ్చు. ఇది అన్నం, చపాతీలతో రుచినివ్వడంతోపాటు కాలేయం పనితీరును కూడా మెరుగుపరుస్తుంది.



మీకో విషయం తెలుసా!

● ఈజిప్ట్‌లో కంటే అత్యంత పురాతనమైన మమ్మీలు చిలీలో ఉన్నాయి.
● అనగనగా ఒక మేరి సాయర్ ఉండేది. మాసాచుసెట్స్‌కు చెందిన మేరీ ఒక గొర్రెపిల్లను రక్షించింది. అంతేకాదు ఆ గొర్రెపిల్లను స్కూలుకు కూడా తీసుకెళ్లేది. మేరీ స్ఫూర్తితోనే నర్సరీ రైమ్ 'మేరీ హ్యాడ్ ఏ లిటిల్ ల్యాంబ్' పుట్టింది ● రమ్ బాటిల్‌పై కనిపించే కెప్టెన్ మోర్గాన్ నిజమైన వ్యక్తే. ఇంగ్లాండ్ తరపున యుద్ధం చేశాడు.

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్


సంధ్యాచారి

పడమటి సంధ్యారాగం

సంధ్యకు సరిగమలు మాత్రమే కాదు వెస్ట్రన్ పాప్ కూడా తెలుసు. తన పాటలో ఎన్నో రకాల సంగీత ధోరణుల ఛాయలు కనిపిస్తాయి. అయినప్పటికీ తనదైన సిగ్నేచర్ టచ్ వాటిలో ఉంటుంది. అదే సంధ్యాచారి ప్రత్యేకత...

కాలిఫోర్నియా(యూఎస్)లో ఉండే తమిళ్-అమెరికన్ సింగర్, లిరిసిస్ట్ సంధ్యాచారి కొత్త మిక్స్‌డ్ జానర్స్‌తో తన ప్రత్యేకత చాటుకుంటుంది. బాల్యంలో ఆమె సంగీత ప్రయాణం కర్నాటక సంగీతం నుంచి భారతీయ చలనచిత్ర సంగీతం వరకు, అక్కడి నుంచి వెస్ట్రన్ పాప్, ఆర్ అండ్ బీ, ర్యాప్ వరకు కొనసాగింది. సంధ్య డెబ్యూ ఇండిపెండెంట్ సింగిల్ 'మై రూట్స్'కు మంచి ప్రశంసలు లభించాయి. మన దేశంలోని భిన్న సంస్కృతుల మధ్య వైవిధ్యానికి 'మై రూట్స్' అద్దం పడుతుంది.

తాజాగా... 'సమ్ వన్ స్పెషల్'తో ముందుకు వచ్చింది సంధ్య. మై రూట్స్‌తో పోల్చితే ఇది పూర్తిగా భిన్నమైనది. 'మై రూట్స్'లో వినసొంపైన సంగీతం మాత్రమే కాదు అండర్-రిప్రెజెంటివ్‌గా ఎన్నో సామాజిక అంశాలు కనిపిస్తాయి.

> ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సంగీత ధోరణుల ఛాయలు తన పాటలో ప్రతిఫలించినా, ఆ పాటలో తనదైన ముద్ర లేదా సిగ్నేచర్ టచ్ ఉండే విధంగా జాగ్రత్త పడతానంటుంది సంధ్య. సక్సెస్ ఇచ్చే సంతోషం కంటే సవాల్‌తో ఎదురయ్యే అన్వేషణ ద్వారా ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు అంటుంది సంధ్య.

ఉదా: స్త్రీ సాధికారత, సాంస్కృతిక వైవిధ్యం. మన దేశంతో సహా పాకిస్థాన్, నేపాల్... మొదలైన దేశాల నుంచి 14 మంది మోడల్స్ ఈ పాటలో కనిపించడం విశేషం. ఇక 'సమ్ వన్ స్పెషల్' విషయానికి వస్తే ఫన్‌తో కూడిన లైట్ హార్టెడ్ పార్టీ సాంగ్ ఇది. ఒక తమిళ అమ్మాయి పంజాబీ ఫోక్ సాంగ్ పాడితే ఎలా ఉంటుందనే ఆలోచనతో చేసిన సాంగ్. వెస్ట్రన్ పాప్, పంజాబీ ఫోక్ కలిసిపోయి పాడే పాట ఇది.

'విశాలమైన సంగీత ప్రపంచంలో ఎన్నో సంగీత ధోరణులు ఉన్నాయి. ఎంతోమంది కళాకారులు ఉన్నారు. ప్రతి ధోరణి, వ్యక్తి నుంచి స్ఫూర్తి పొందవచ్చు' అంటున్న సంధ్య 'గ్లోబల్ మ్యూజిక్' గురించి ప్రస్తావిస్తుంది. ఏదో ఒకరోజు సరిహద్దులన్నీ చెరిగిపోయి, ఏక గొంతుతో పాడే విశ్వసంగీతం వినిపిస్తుందని ఆశిస్తుంది.

గతంలో చేసిన పాట కంటే కొత్త పాట బాగుండాలని అనుకోదు సంధ్య. దీనికి కారణం నిర్లక్ష్యం కాదు. ఆమె మాటల్లోనే చెప్పాలంటే 'ప్రతి పాటకు తనదైన ప్రత్యేకత ఉంటుంది'

రేవతి రాగాన్ని బాగా ఇష్టపడే సంధ్య ఆ రాగం గురించి ఎంతసేపైనా మాట్లాడగలదు. రేవతి రాగంలోని శక్తిని పాటలతో కళ్లకు కట్టగలదు. అయితే తన దృష్టిలో సంగీతం ఎంతబలంగా ఉండాలో, సాహిత్యం కూడా అంతే బలంగా ఉండాలి.

'ఏఆర్‌రెహమన్స్ 99 సాంగ్స్ కవర్ స్టార్' కంటెస్ట్‌లో విజేతగా నిలిచింది సంధ్య. 'ఇది నా కెరీర్‌లో మైలురాయి. నా కోసం కొత్తగా ఎన్నో ద్వారాలు తెరిచి పెట్టిన విజయం' అంటుంది సంధ్య.

సంగీతంలో ఆమె ప్రదర్శిస్తున్న ప్రతిభను చూస్తుంటే భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించగలదు అని కచ్చితంగా చెప్పవచ్చు.

● సక్సెస్ స్టోరీ

ఆత్మబలమే అఖండ సైన్యమై...


సిద్ధాంత్ భార్గవ

'కష్టాలు వీరికి మాత్రమే వస్తాయి' అనే రూల్ ఏమీ లేదు. అందరికీ వస్తాయి. అయితే ఆ సమయంలోనే మనలోని వారియర్ బయటికి రావాలి. ప్రతికూల ఆలోచనలను దూరంగా పరుగెత్తించాలి. థైరాయిడ్ క్యాన్సర్‌తో పోరాడిన సిద్ధాంత్ భార్గవ అదే సమయంలో ప్రతికూల ఆలోచనలతో కూడా పోరాడాడు. విజేతగా నిలిచాడు. చిన్న వయసులోనే ఎంటర్‌ప్రెన్యూర్, సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్‌గా రాణిస్తున్న సిద్ధాంత్ భార్గవ గురించి...

తాత డాక్టర్. నాన్న డాక్టర్. వారి స్ఫూర్తితో తాను కూడా డాక్టర్ కావాలనుకున్నాడు సిద్ధాంత్. ముంబైలో ఎంబీబీయస్ చదువుతున్న రోజులు తనకు అపురూపమైనవి. ప్రతిరోజూ ఒక కొత్త రోజులాగే అనిపించేది. ఎన్నో పరిచయాలు....ఎంతో ఆనందం. ఆరోజుల్లో ఒకరోజు...

తల వెంట్రుకలు బాగా రాలుతున్నాయి. అది రోజురోజుకు పెరుగుతూ పోతోంది. దీని గురించి అమ్మకు చెప్పాడు సిద్ధాంత్. 'పరీక్షల టైమ్ కదా. ఒత్తిడి వల్ల ఇలా జరుగుతోందేమో' అన్నది అమ్మ.

కొద్దిరోజుల తరువాత సిద్ధాంత్ శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా అనిపిస్తోంది. కండర శక్తి క్షీణిస్తోంది. వెంటనే వైద్యుడిని సంప్రదించాడు సిద్ధాంత్. వైద్యపరీక్షలలో శరీరంలోని ఎన్నో భాగాలను ప్రభావితం చేసే ఆటోఇమ్యూన్ డిజార్డర్ లుపస్ అని తేలింది. వైద్యం మొదలైంది.

తనకు ఇష్టమైన మెడికల్ కాలేజీకి పోలేని పరిస్థితి. ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. డాక్టర్ కావాలనే తన స్వప్నం తనను విడిచి దూరంగా పరుగెత్తుతున్నట్లుగా అనిపించింది. ప్రతికూల ఆలోచనలు చుట్టుముట్టాయి. తన జీవితం నుంచి 'ఉత్సాహం, శక్తి' అనే నిధులను ఎవరో దొంగిలించినట్లు అనిపించింది.

వైద్యం తీసుకునే క్రమంలో రోగనిరోధకశక్తి బాగా దెబ్బ తిన్నది.

> కొద్దిరోజుల తరువాత యుద్ధం ప్రారంభించాడు సిద్ధాంత్. అది ప్రతికూల ఆలోచనలు అనే భయానకమైన శత్రువుల మీద. ఆత్మబలంతో సునాయసంగా విజయం సాధించాడు. ఇప్పుడు తనకు తాను కొత్తగా కనిపిస్తున్నాడు. కొత్త శక్తి తనలోకి వచ్చి చేరింది.

అద్దంలో తనను తాను చూసుకోవాలంటే భయపడే పరిస్థితి వచ్చింది. తల మీద ఒక్క వెంట్రుక కూడా లేదు.

'అసలు నేనేనా!' అనిపించేది.

కొద్దిరోజుల తరువాత యుద్ధం ప్రారంభించాడు సిద్ధాంత్. అది ప్రతికూల ఆలోచనలు అనే భయానకమైన శత్రువుల మీద. ఆత్మబలంతో సునాయాసంగా విజయం సాధించాడు.

ఇప్పుడు తనకు తాను కొత్తగా కనిపిస్తున్నాడు. కొత్త శక్తి తనలోకి వచ్చి చేరింది. వ్యాధి నుంచి బయటపడ్డాడు.

'మంచిరోజులు వచ్చాయి' అనుకున్న కొద్దికాలానికే థైరాయిడ్ క్యాన్సర్ తనను చుట్టుముట్టింది. మళ్లీ యుద్ధం మొదలైంది. మళ్లీ తానే విజేత!

ముంబైలో ఎంబీబీఎస్ పూర్తయిన తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో ఫుడ్, లైఫ్‌స్టైల్, వెల్‌నెస్ గోల్స్‌కు సంబంధించిన కంటెంట్ క్రియేటర్‌గా కొత్త ప్రయాణం ప్రారంభించాడు సిద్ధాంత్. లక్షల మంది ఫాలోవర్స్ తన ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు.

ఆ తరువాత హెల్త్ అండ్ న్యూట్రిషన్ కంపెనీ 'ఫుడ్ డార్జీ'కి శ్రీకారం చుట్టాడు. సంప్రదాయ న్యూట్రిషన్ ఆలోచనలను పక్కన పెట్టి కొత్త ఐడియాలతో దూసుకుపోతోంది ఫుడ్ డార్జీ. మరోవైపు సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్‌గా రాణిస్తున్నాడు. అతని క్లయింట్స్‌లో ఆలియాభట్, అర్జున్‌కపూర్, సోనమ్ కపూర్... మొదలైన సెలబ్రిటీలు ఉన్నారు.

కష్టాలు అధిగమించి విజేతగా నిలిచిన 27 సంవత్సరాల సిద్ధాంత్ భార్గవకు అభినందనలు తెలియజేద్దాం.

● గేమింగ్

మీలో ఫైటర్ ఎవరు?



రోల్‌ప్లేయింగ్ వీడియో గేమ్ 'హార్వెస్టెల్ల' నేడు విడుదల అవుతుంది. నెమియ అనే అందమైన నగరంలో జరిగే కథ ఇది. పూలకు ప్రసిద్ధి పొందిన ఈ అందమైన నగరం శాంతికి నిలయం. అయితే ఉన్నట్టుండి నెమియపై రాక్షస మూక దాడి చేస్తుంది. ఫైటర్, షాడో వాకర్, మెజిషియన్...ఇలా ఏ క్యారెక్టర్ అయినా ప్లేయర్స్ ఎంపిక చేసుకోవచ్చు. ఇన్-గేమ్ క్యారెక్టర్స్‌తో చేరిపోవచ్చు. ప్రతి క్యారెక్టర్‌కు ఒక కథ ఉంటుంది. ఈ సిములేషన్ గేమ్‌లో ప్లేయర్స్ పంటలు పండించవచ్చు. పడవలు నడపవచ్చు. కూరగాయలు పండించవచ్చు.

ప్లాట్‌ఫామ్: విండోస్, నిన్‌టెండ్ స్విచ్
మోడ్: సింగిల్ ప్లేయర్ **జానర్:** రోల్-ప్లేయింగ్

● టెక్..టాక్

యూట్యూబ్ హ్యాండిల్స్

వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ హ్యాండిల్స్ అనే కొత్త ఫీచర్‌ను ప్రవేశపెడుతోంది. యూజర్స్, కంటెంట్ క్రియేటర్స్ మధ్య బెటర్ కనెక్టివిటీకి ఉపకరించే ఫీచర్ ఇది. ప్రతి చానల్‌కు ప్రత్యేకమైన హ్యాండిల్ ఉంటుంది. దీని ద్వారా రైట్‌పర్సన్, చానల్, క్రియేటర్‌ల ఎంపిక సులభం అవుతుంది. ఒకేరకంగా ధ్వనించే యూట్యూబ్ పేర్ల వల్ల అయోమయానికి గురయ్యే సమస్య ఈ ఫీచర్‌తో తప్పుతుంది.

'హ్యాండిల్స్'ను ఎంపిక చేసుకోవడానికి...

1. యూట్యూబ్.కామ్/హ్యాండిల్స్‌లోకి వెళ్లాలి
2. చూజ్ హ్యాండిల్ లేదా ఛేంజ్ హ్యాండిల్ క్లిక్ చేయాలి
3. సజెస్టెడ్ హ్యాండిల్స్‌లో ఒకటి ఎంపిక చేసుకోవాలి
4. కన్‌ఫర్మ్ సెలెక్షన్ క్లిక్ చేయాలి.


వాట్సాప్‌లో...

ఇటీవలే స్క్రీన్ షాట్ బ్లాకింగ్ (ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్) అనే కొత్త ఫీచర్ తీసుకువచ్చిన ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ మరి కొన్ని ఫీచర్స్ తీసుకురానుంది. ఇమేజ్‌లు, వీడియోలు, జిఫ్, డాక్యుమెంట్లను కాప్షన్‌తో ఫార్వర్డ్ చేసే ఫీచర్, మరోకటి న్యూ బ్లర్ టూల్.



దీనితో యూజర్‌లు ఇమేజ్‌లలోని సెన్సిటివ్ పార్ట్, ఇన్‌ఫర్‌మేషన్‌ను నీట్‌గా ఎడిట్ చేయవచ్చు. వీటితో పాటు 'ప్రొఫైల్ ఫొటో ఇన్ గ్రూప్ చాట్స్' ఫీచర్, పర్సనల్ డైరీగా ఉపయోగపడే సెల్ఫ్-మెసేజింగ్ ఫీచర్‌లు రానున్నాయి.

సినిమా


● నాగశౌర్య

కొత్త సినిమా షురూ

హీరో నాగశౌర్య 24వ సినిమా షురూ అయింది. ఈ సినిమాకి ఎస్ఎస్ అరుణాచలం దర్శకత్వం వహించనున్నారు. వైష్ణవి ఫిలింస్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి, విజయ్ కుమార్ చింతలపూడి, డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి నిర్మించనున్నారు. ''యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. త్వరలో ప్రారంభోత్సవం జరుపుకోనున్న ఈ చిత్రంలో ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించనుండగా, అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు పని చేయనున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: బేబీ అద్వైత, భవిష్య.


● సోనాక్షి ● హ్యూమా

అలా పెరిగితే కష్టమే!

వెండితెరపై మెరుపుతీగలా కనిపించే హీరోయిన్లు పాత్ర డిమాండ్ చేస్తే బొద్దుగా కనిపించడానికి కూడా వెనకాడరు. అందుకు తాజా ఉదాహరణ సోనాక్షీ సిన్హా, హ్యూమా ఖురేషీ. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రూపొందిన 'డబుల్ ఎక్స్ఎల్' చిత్రం ఈరోజు రిలీజవుతోంది. అధిక బరువుతో హేళనకు గురయ్యే ఇద్దరి అమ్మాయిల కథతో ఈ సినిమా ఉంటుంది. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా, ఈ విషయాన్ని వినోదాత్మకంగా చెబుతూ చాలా జాగ్రత్తగా డీల్ చేశారట చిత్రదర్శకుడు సత్రమ్ రమణి. 'బాడీ షేమింగ్' తప్పనే సందేశం కూడా ఈ చిత్రంలో ఉంది. ఈ చిత్రం కోసం సోనాక్షి, హ్యూమా పదిహేనేసి కిలోల బరువు పెరిగారు.

నిజానికి కెరీర్ ఆరంభంలో సోనాక్షి బొద్దుగానే ఉండేవారు. 'దబాంగ్' చిత్రంతో పరిచయం కాకమునుపు ఆమె దాదాపు 90 కిలోలు ఉంటే.. 30 కిలోలు తగ్గి ఆ సినిమా ద్వారా పరిచయం అయ్యారు. అప్పటినుంచి దాదాపు అదే బరువుతో కొనసాగుతున్నారామె. ఇప్పుడు 'డబుల్ ఎక్స్ఎల్'కి బరువు పెరిగిన విషయం గురించి సోనాక్షి మాట్లాడుతూ– ''బరువు పెరగాలన్నా.. తగ్గాలన్నా ఆరోగ్యకరమైన పద్ధతిలో అయితేనే సేఫ్. కానీ 'డబుల్ ఎక్స్ఎల్' నాకు అలా తగ్గేంత సమయం ఇవ్వలేదు. రెండే నెలల్లో పెరగాల్సి వచ్చింది. దాంతో ఏది పడితే అది తిన్నాను. ఎన్నో ఏళ్లగా చేస్తూ వచ్చిన వర్కవుట్లు మానేశాను. ఫలితంగా 15 కిలోలు పెరిగాను. కానీ ఇలా పెరిగితే కష్టాలు తప్పవు. వర్కవుట్లు చేయకపోవడం అనేది శారీరకంగా, మానసికంగా నా ఒత్తిడిని పెంచింది. అంతకు ముందులా యాక్టివ్‌గా ఉండలేకపోయేదాన్ని. అదే కొంచెం సమయం తీసుకుని, ఆరోగ్యకరమైన పద్ధతిలో పెరిగి ఉంటే.. ఇలా ఉండేది కాదు. అందుకే తగ్గాలన్నా, పెరగాలన్నా పద్ధతి ప్రకారమే చేయండని సలహా ఇస్తున్నాను. ఇక, ఈ సినిమా పూర్తి కాగానే.. ఎక్కువ టైమ్ తీసుకుని, చక్కగా తగ్గడం మొదలుపెట్టాను. అది బాగా అనిపించింది'' అన్నారు.

హ్యూమా ఖురేషీ మాట్లాడుతూ – ''అధిక బరువు అనేది అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం పోగొడుతుంది. అయితే మనం ఎలా కనిపిస్తున్నాం అనేదాని కన్నా ఎంత హుందాగా ప్రవర్తిస్తున్నామన్నదే ముఖ్యం. మన ప్రవర్తన బాగుంటే అదే అందం. అయితే ఆరోగ్యం కోసం తగ్గాలనుకుంటే తగ్గొచ్చు. ఎవరో ఏదో అంటారని కాదు. అమ్మాయిల బాడీ షేప్‌ని హేళన చేయడం సరికాదు. ఇక ఒక సినిమా కోసం బరువు పెరగడం అనేది ఓ సవాల్. ఆరోగ్యకరమైన పద్ధతిలో పెరగకపోతే కష్టాలు మాత్రం తప్పవు'' అన్నారు.


● మీనాక్షీ చౌదరి, అడివి శేష్, ప్రశాంతి, శైలేష్

ఆ తపన ఎప్పుడూ ఉంటుంది

– అడివి శేష్

''మంచి సినిమా చేయాలనే తపన నాలో ఎప్పుడూ ఉంటుంది. కోవిడ్ సమయంలో 'హిట్ 2' చేయటానికి టీమ్ ఎంతో కష్టపడింది. ఈ సినిమా చేసినందుకు గర్వంగా ఉంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అని అడివి శేష్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో అడివి శేష్, మీనాక్షీ చౌదరి జంటగా నటించిన చిత్రం 'హిట్ 2'. హీరో నాని సమర్పణలో ప్రశాంతి త్రిపిరనేని నిర్మించారు. డిసెంబర్ 2న విడుదల కానున్న ఈ సినిమా టీజర్‌ని గురువారం విడుదల చేశారు. అడివి శేష్ మాట్లాడుతూ– ''మహేశ్‌గారు 'మేజర్', నాని 'హిట్ 2' సినిమాలు నాతో నిర్మించడం హ్యాపీ. 'హిట్ 2' రిలీజ్ కోసం ఎగ్జయిటింగ్‌గా ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''హిట్'తో హిట్ సాధించాం. 'హిట్ 2'ని స్క్రీన్‌పై చూడటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు ప్రశాంతి త్రిపిరనేని. ''క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'హిట్ 2'. అడివి శేష్ పర్‌ఫెక్ట్ జెంటిల్‌మేన్.. సెట్స్‌లో ప్రొఫెషనల్‌గా ఉండేవాడు. నేను ఇక్కడ ఉండటానికి కారణం నానీగారే.. ఆయనకు థ్యాంక్స్'' అన్నారు శైలేష్ కొలను. సినిమాటోగ్రాఫర్ మణికందన్ .ఎస్, ఎడిటర్ గ్యారీ బి.హెచ్, హీరోయిన్ కోమలీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాపై నమ్మకంతో ఆమె కథ వినలేదు

– నందు


● రష్మి, నందు

''మంచి కథతో తీసిన 'బొమ్మ బ్లాక్‌బస్టర్' ట్రైలర్, పాటలు చూస్తుంటే ఈ సినిమా చూడాలనిపిస్తోంది. నందు, రష్మీ బాగా నటించారు. ఈ సినిమా టైటిల్‌లాగానే బ్లాక్ బస్టర్ కావాలి'' అని హీరో నాగశౌర్య అన్నారు. నందు విజయ్‌కృష్ణ, రష్మి గౌతమ్ జంటగా రాజ్ విరాట్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బొమ్మ బ్లాక్‌బస్టర్'. ప్రవీణ్ పగడాల, బోసుబాబు నిడుమోలు, ఆనంద్ రెడ్డి మద్ది, మనోహర్ రెడ్డి యెడ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలకానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి హీరో నాగశౌర్య, డైరెక్టర్ విమల్ కృష్ణ, నిర్మాత 'సెవెన్ హిల్స్' సతీష్ అతిథులుగా హాజరయ్యారు. నందు విజయ్‌కృష్ణ మాట్లాడుతూ– ''నాపై నమ్మకంతో ఈ చిత్రకథ వినకుండా నటించారు రష్మి. ఈ చిత్రాన్ని నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్లిన నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు. ''మా సినిమాను ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు నిర్మాతలు. ''నాది, నందూది 14 ఏళ్ల జర్నీ. రాజ్ విరాట్ కథను నందు నమ్మితే, నేను నందును నమ్మి ఈ సినిమా చేశా'' అన్నారు రష్మి. ''మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు రాజ్ విరాట్.

విజువల్స్ బాగున్నాయి

– గోపీచంద్ మలినేని

మాన్యం కృష్ణ, నందితా శ్వేత జంటగా, శివాజీ రాజా, కన్నడ కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'జెట్టి'. సుబ్రమణ్యం పిచ్చుక దర్శకత్వంలో వేణు మాధవ్ కె. నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని దర్శకుడు గోపీచంద్ మలినేని విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఈ ట్రైలర్‌లో కొన్ని విజువల్స్ నన్ను ఆశ్చర్యపరిచాయి.. బాగున్నాయి. మత్స్యకారుల జీవితాలను తెర మీదకు తెచ్చిన విధానం బాగుంది'' అన్నారు. మాన్యం కృష్ణ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథతో పాటు తండ్రీ కూతుళ్ళ మధ్య బలమైన ఎమోషన్స్ ఉంటాయి. 'దూరం కరిగినా..' సాంగ్ మా సినిమాకు మంచి హైప్ తెచ్చింది'' అన్నారు. సుబ్రమణ్యం పిచ్చుక మాట్లాడుతూ– ''తీర ప్రాంతంలో ఒక జీవన విధానం ఉంటుంది. వారి కట్టుబాట్లు చాలా పటిష్టంగా ఉంటాయి. వాటి నేపథ్యంలో తీసిన మా 'జెట్టి' ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పండ్రాజు శంకర్రావు.


● గోపీచంద్, కృష్ణ

నేను గర్వపడే సినిమా ఇది

– సంతోష్ శోభన్



''నాన్న (దర్శకుడు శోభన్) దూరమై 14 ఏళ్లవుతోంది. ఇప్పటికీ ఆయన గురించి మంచిగా చెబుతున్నారు.. నన్ను నవ్వుతూ పలకరిస్తున్నారంటే వారి రూపంలో నాన్న నాతో ఉన్నట్టే. ఇది నా అదృష్టంగా భావించి మరింత కష్టపడుతున్నాను'' అన్నారు సంతోష్ శోభన్. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో సంతోష్ శోభన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్'. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ పంచుకున్న విశేషాలు..

● 'ఏక్ మినీ కథ' తర్వాత నేను, గాంధీగారు మళ్లీ సినిమా చేయాలనుకున్నాం. 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్'తో కుదిరింది. ఇందులో నేను చేసిన యూట్యూబర్ విప్లవ్ పాత్ర నా మనసుకు చాలా నచ్చింది. కెరీర్‌లో మొదటిసారి నా ఏజ్ పాత్ర చేశాను. మేర్లపాక గాంధీగారి 'ఎక్స్‌ప్రెస్ రాజా' సినిమాలోలా హైపర్ ఎనర్జిటిక్ క్యారెక్టర్ ఇది. ● 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' కథ అందరూ రిలేట్ చేసుకునేట్లు ఉంటుంది. ట్రావెల్ బ్లాగర్‌గా మొదలైన ఈ కథ యాక్షన్ కామెడీగా మలుపు తీసుకోవడం ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది. ● ప్రభాస్‌గారు ఇండియా బిగ్గెస్ట్ స్టార్. మా సినిమా టీజర్, ట్రైలర్, సాంగ్.. ఇలా ఏదో ఒకటి రిలీజ్ చేసి, ప్రోత్సహించడం ఆయన గొప్పదనం. 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' నేను గర్వపడే సినిమా. ప్రభాస్‌గారికి టైమ్ కుదిరితే ఈ సినిమా చూపించడం నా కల. నందినీ రెడ్డిగారి దర్శకత్వంలో నేను నటించిన 'అన్నీ మంచి శకునములే' డిసెంబరు 21 వస్తోంది. యూవీ క్రియేషన్స్‌లో 'కల్యాణం కమణీయం' సినిమా ఉంది.



అదే అతి పెద్ద ప్రశంస

– రాకేష్ శశి

''ఊర్వశివో.. రాక్షసివో' చిత్రం వినోదాత్మకంగా ఉంటుంది. కుటుంబమంతా కలిసి చూడొచ్చు. ఈ సినిమా ప్రివ్యూ అయిన తర్వాత శిరీష్ గారు, 'తెరపై నేను కనపడలేదు.. నేను చేసిన శ్రీకుమార్ పాత్ర మాత్రమే కనిపించింది.. థ్యాంక్స్' అన్నారు.. అదే నాకు అతి పెద్ద ప్రశంస. ఆ తర్వాత అల్లు అరవింద్‌గారు కూడా హీరో క్యారెక్టర్ అద్భుతంగా ఉందన్నారు'' అని దర్శకుడు రాకేష్ శశి అన్నారు. అల్లు శిరీష్, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'ఊర్వశివో.. రాక్షసివో'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విజయ్ ఎం. నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు రాకేష్ శశి మాట్లాడుతూ– ''జతకలిసే, విజేత' చిత్రాల తర్వాత 'ఊర్వశివో.. రాక్షసివో' చేశాను. 'విజేత' చూసి, అల్లు అరవింద్‌గారు నన్ను పిలిపించి, శిరీష్ కోసం కథ సిద్ధం చేయమన్నారు. ఆ తర్వాత శిరీష్‌గారితో ప్రయాణం చేసి 'ఊర్వశివో.. రాక్షసివో' కథని రెడీ చేశాను. షూటింగ్ ప్రారంభిద్దాం అనుకున్న సమయంలో లాక్‌డౌన్ రావడంతో ఆలస్యం అయింది. ఇప్పటివరకూ శిరీష్‌గారు చేయని సరికొత్త పాత్రను ఈ చిత్రంలో చేశారు. ఆయన కెరీర్‌లో ది బెస్ట్‌గా నిలుస్తుంది. అనూ ఇమ్మాన్యుయేల్ పాత్ర నేటి తరం అమ్మాయిలకు బాగా నచ్చుతుంది. ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మించిన నిర్మాతలకు కృతజ్ఞతలు. డైరెక్టర్ మణిరత్నంగారంటే నాకు ఇష్టం. ఆయనలా నాకు సినిమాలు తీయాలని ఉంది'' అన్నారు.

నాలుగు జంటల ప్రేమ


● ప్రియాంక, సాయిదివ్య, స్వాతి

'1940లో ఒక గ్రామం, కమలతో నా ప్రయాణం, జాతీయ రహదారి' వంటి చిత్రాల ఫేమ్ నరసింహ నంది దర్శకత్వం వహించిన చిత్రం 'అమ్మాయిలు అర్థం కారు'. అల్లం శ్రీకాంత్, ప్రశాంత్, కమల్, మీరావలి హీరోలుగా, సాయిదివ్య, ప్రియాంక, స్వాతి, శ్రావణి హీరోయిన్లుగా నటించారు. నందిరెడ్డి విజయలక్ష్మిరెడ్డి, కర్ర వెంకట సుబ్బయ్య నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి టి. ప్రసన్న కుమార్ విడుదల చేశారు. నరసింహ నంది మాట్లాడుతూ– ''నాలుగు జంటల ప్రేమకథలో ఏర్పడే మలుపులు, భావోద్వేగాలతో ఈ సినిమా ఉంటుంది. మధ్యతరగతి జీవితాల్లో డబ్బు ఎలాంటి పాత్ర పోషిస్తుంది? దానివల్ల జీవితాలు ఎలా తారుమారవుతాయి? అనే అంశాన్ని చర్చించాం'' అన్నారు. ''చిత్తూరు, తిరుపతి ప్రాంతాల యాస నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు కర్ర వెంకట సుబ్బయ్య.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
70	30
60,836	18,053

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,434	▽	90
డోజోన్స్	32,103	▽	44
ఎఫ్‌టీఎస్ఈ 100	7,189	△	44
డాక్స్	13,130	▽	126
షాంఘై	2,998	▽	6
నికాయ్	27,673	▽	16

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
50,114	▽	710
బంగారం (99.5 స్వచ్ఛత)		
49,913	▽	707
వెండి (కేజీ)		
57,049	▽	1578

ఒకేసారి 32 మందితో వీడియో కాలింగ్..

- 2 జీబీ వరకూ ఫైల్స్ ట్రాన్స్‌ఫర్
- 5,000 మందికి మెసేజీల బ్రాడ్‌కాస్టింగ్
- సర్వీసులు అప్‌డేట్ చేసిన వాట్సాప్



న్యూఢిల్లీ: ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫాం వాట్సాప్ తాజాగా తమ సేవలను అప్‌డేట్ చేసింది. ఒకేసారి ఏకంగా 32 మందితో వీడియో, వాయిస్ కాలింగ్ చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తెచ్చింది. అలాగే 2 జీబీ వరకూ ఫైల్స్‌ను (ఇప్పటి వరకూ 16 ఎంబీ) ట్రాన్స్‌ఫర్ చేసుకోవడంతో పాటు ఒక గ్రూప్‌లో 1,024 మంది దాకా జోడించుకునేలా పరిమితిని పెంచింది. 5,000 మంది యూజర్ల వరకూ తమ కమ్యూనిటీల్లోని వారికి, పోల్స్‌లో పాల్గొనే వారికి మెసేజీలను బ్రాడ్‌కాస్ట్ చేసే సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. 'వాట్సాప్‌లో 'కమ్యూనిటీస్'ను నేడు ప్రవేశపెడుతున్నాం. ఇందులో సబ్ గ్రూప్‌లు, అనౌన్స్‌మెంట్ చానెల్స్ మొదలైన వాటితో గ్రూప్‌లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకోవచ్చు. అలాగే పోల్స్, 32 మందితో వీడియో కాలింగ్ కూడా అందుబాటులోకి తెస్తున్నాం. ఎన్‌క్రిప్షన్ ద్వారా మీ మెసేజీలన్నీ గోప్యంగా ఉండేలా అన్ని చర్యలూ తీసుకున్నాం' అని వాట్సాప్ మాతృ సంస్థ మెటా వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ గురువారం ఫేస్‌బుక్‌లో వెల్లడించారు.

బీవోఐ లాభం హైజంప్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) రెండో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. త్రైమాసికవారీగా జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 71 శాతం జంప్ చేసి రూ. 960 కోట్లను తాకింది. నిర్వహణ లాభం 26 శాతం వృద్ధితో రూ. 3,374 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.49 శాతం మెరుగై 3.04 శాతంగా నమోదయ్యాయి. కాగా..వార్షిక ప్రాతిపదికన నికర వడ్డీ ఆదాయం 44 శాతం ఎగసి రూ. 5,083 కోట్లకు చేరింది. ఈ బాటలో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.5 శాతం తగ్గి 8.5 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.87 శాతం నీరసించి 1.92 శాతానికి దిగివచ్చాయి.



'మేఘా'కు మంగోలియా ప్రాజెక్ట్

- ఆయిల్ రిఫైనరీ నిర్మాణ కాంట్రాక్ట్
- విలువ 790 మిలియన్ డాలర్లు



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న మంగోల్ రిఫైనరీ ఈడీ అల్టాంట్ సెట్‌సెగ్, ఎంఈఐఎల్ డైరెక్టర్ (హైడ్రోకార్బన్స్) పి. దొరయ్య

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ మౌలిక సదుపాయాల దిగ్గజం మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎంఈఐఎల్) తాజాగా మంగోలియా మార్కెట్లో అడుగుపెట్టింది. దేశీయంగా తొలి గ్రీన్‌ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీని నిర్మించే భారీ కాంట్రాక్టును దక్కించుకుంది. దీని విలువ 790 మిలియన్ డాలర్లు. మంగోల్ రిఫైనరీ ప్రాజెక్టుకు సంబంధించి ఎల్‌వోఏ (లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్సీ)ను అందుకున్నట్లు ఎంఈఐఎల్ తెలిపింది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) ప్రాతిపదికన ఈ కాంట్రాక్టు కింద ఓపెన్ ఆర్ట్ యూనిట్లు, యుటిలిటీలు, ప్లాంటు భవంతులు, క్యాప్టివ్ పవర్ ప్లాంట్లు మొదలైనవి నిర్మించాల్సి ఉంటుందని వివరించింది. ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత ఈ రిఫైనరీలో రోజుకు 30,000 బ్యారెల్స్, ఏడాదికి 1.5 మిలియన్ టన్నుల ముడి చమురును ప్రాసెస్ చేయవచ్చు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) తలపెట్టిన భాగస్వామ్య అభివృద్ధి ప్రయత్నాల్లో భాగంగా, భారత ప్రభుత్వ ఆర్థిక సహాయ సహకారాలతో మంగోలియా ఈ ప్రాజెక్టును నిర్మించనుంది. దీనికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఇంజినీర్స్ ఇండియా (ఈఐఎల్) ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా వ్యవహరించనుంది. ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగుపడేందుకు, హైడ్రోకార్బన్స్ రంగంలో తమ వ్యాపార విస్తరణ వ్యూహాలకు ఈ ప్రాజెక్టు కీలకంగా ఉండగలదని కంపెనీ తెలిపింది. దీనితో రష్యన్ ఇంధనంపై మంగోలియా ఆధారపడటం తగ్గుతుందని, అలాగే తమ పెట్రోలియం ఉత్పత్తుల అవసరాలను స్వయంగా తీర్చుకునేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. స్థానికంగా చిన్న పరిశ్రమలు, ప్రజల ఉపాధి అవకాశాల వృద్ధికి ఈ ప్రాజెక్టు తోడ్పడనుంది.

అక్టోబర్‌లో 'సేవలు' బాగున్నాయ్!

న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం అక్టోబర్‌లో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుందని ఎస్ అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ సూచించింది. సెప్టెంబర్‌లో ఆరు నెలల కనిష్టం 54.3కు పడిపోయిన సూచీ, అక్టోబర్‌లో 55.1కు ఎగసింది. సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆలోపునకు పడిపోతే క్షీణతగా పరిగణించడం జరుగుతుంది. ఈ ప్రాతిపదిక సేవల సూచీ వృద్ధి బాటన ఉండడం ఇది వరుసగా 15వ నెల. తమ సర్వే ప్రకారం అక్టోబర్‌లో వరుసగా ఐదవనెల సేవల రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. గడచిన మూడు సంవత్సరాల్లో సేవల రంగం ఈ స్థాయి స్పీడ్ ఇది రెండవసారని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ విభాగం అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. అక్టోబర్‌లో సేవల రంగం పురోగతికి దేశీయ మార్కెట్ ప్రధాన వనరని కూడా లిమా తెలిపారు. ఇక విదేశీ అమ్మకాలు మాత్రం వరుసగా మూడవ త్రైమాసికంలో దిగువబాటన నడిచాయని అన్నారు.



హెచ్‌పీసీఎల్‌కు మళ్లీ నష్టాలు

క్యూ2లో రూ. 2,172 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది (2022–23) రెండో త్రైమాసికంలో ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) నిరుత్సాహకర ఫలితాలు వెల్లడించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లోనూ లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. రూ. 2,172 కోట్లకుపైగా నష్టం ప్రకటించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,923 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. ఉత్పత్తి వ్యయాలకంటే తక్కువ ధరల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. ఏప్రిల్–జూన్(క్యూ1)లోనూ కంపెనీ ఏకంగా రూ. 10,197 కోట్ల నికర నష్టం ప్రకటించిన సంగతి తెలిసిందే. వెరసి వరుసగా రెండో క్వార్టర్లలో నష్టాలు నమోదు చేసిన రికార్డు సొంతం చేసుకుంది.



కాగా.. ప్రభుత్వం అక్టోబర్ 12న వన్‌టైమ్ గ్రాంట్‌కింద 3 పీఎస్‌యూ ఇంధన దిగ్గజాలకు రూ. 22,000 కోట్లు కేటాయించింది. వీటిలో హెచ్‌పీసీఎల్‌కు రూ. 5,617 కోట్లు లభించాయి. ప్రస్తుత క్యూ2లో హెచ్‌పీసీఎల్ మొత్తం ఆదాయం 30% పెరిగి రూ. 1.13 లక్షల కోట్లను తాకింది. స్థూల రిఫైనింగ్ మార్జిన్లు 2.44 డాలర్ల నుంచి 8.41 డాలర్లకు ఎగశాయి. ఈ కాలంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర నష్టం రూ. 2,746 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 1,919 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు 2 శాతం క్షీణించి రూ. 211 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ లాభం జూమ్

క్యూ2లో రూ. 7,043 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 24 శాతం ఎగసి రూ. 7,043 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 5,670 కోట్లు మాత్రమే ఆర్జించింది. అనుబంధ సంస్థల నుంచి డివిడెండ్ల ద్వారా రూ. 2,046 కోట్లు(గత క్యూ2లో రూ. 1,188 కోట్లు మాత్రమే), పెట్టుబడుల అమ్మకం ద్వారా రూ. 184 కోట్లు(గతంలో రూ. 263 కోట్లు) లభించడం లాభాల్లో వృద్ధికి సహకరించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 38,603 కోట్ల నుంచి రూ. 43,927 కోట్లకు జంప్ చేసింది.



వడ్డీ ఆదాయం అప్

ప్రస్తుత సమీక్షా కాలంలో హెచ్‌డీఎఫ్‌సీ స్టాండెలోన్ నికర లాభం 18 శాతం పుంజుకుని రూ. 4,454 కోట్లయ్యింది. మొత్తం ఆదాయం రూ. 12,226 కోట్ల నుంచి రూ. 15,036 కోట్లకు వృద్ధి చెందింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.34 శాతం నుంచి 1.59 శాతానికి మెరుగుపడ్డాయి. నికర ఎన్‌పీఏలు 1.44 శాతం నుంచి 0.91 శాతానికి దిగివచ్చాయి. అయితే మొత్తం ప్రొవిజన్లు రూ. 9,355 కోట్ల నుంచి రూ. 13,146 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ షేరు 1.2 శాతం నీరసించి రూ. 2,479 వద్ద ముగిసింది.

మార్కెట్ రెండోరోజూ డీలా

ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు ప్రభావం

ముంబై: ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు ప్రభావంతో స్టాక్ మార్కెట్ గురువారం స్వల్పంగా నష్టపోయింది. ఆర్‌బీఐ నేడు ప్రత్యేక ద్రవ్య విధాన సమావేశం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ 395 పాయింట్ల నష్టంతో మొదలైంది. ఇంట్రాడేలో 509 పాయింట్ల పరిధిలో కదలాడింది. చివరికి 70 పాయింట్లు పతనమై 60,836 వద్ద నిలిచింది. నిఫ్టీ 115 పాయింట్లు క్షీణించి 17,968 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో 147 పాయింట్ల శ్రేణిలో ట్రేడైంది. మార్కెట్ ముగిసేసరికి 30 పాయింట్లు నష్టపోయి 18,053 వద్ద నిలిచింది. యుటిలిటీ, విద్యుత్, ఐటీ, టెక్, కన్జూమర్ డ్యూరబుల్ షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. బ్యాంకింగ్, ఇంధన, ఫైనాన్స్ రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు పావుశాతానికి పైగా క్షీణించాయి. వరుసగా ఆరోరోజూ విదేశీ ఇన్వెస్టర్లు నికర కొనుగోలుదారులుగా నిలిచారు. తాజాగా రూ.732 కోట్ల షేర్లను కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.673 కోట్ల షేర్లను అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి విలువ ఎనిమిది పైసలు క్షీణించి 82.88 స్థాయి వద్ద స్థిరపడింది. ''తారాస్థాయికి చేరిన ద్రవ్యోల్బణం దిగివచ్చే వరకు కీలక వడ్డీరేట్ల పెంపు తప్పదని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ స్పష్టమైన సంకేతాలివ్వడంతో పలు దేశాల స్టాక్ మార్కెట్లు బలహీనంగా ట్రేడయ్యాయి. ఈ ప్రతికూల ప్రభావం దేశీయ ఈక్విటీ మార్కెట్‌పైనా పడింది. అమెరికాలో ఆర్థిక మాంద్యం ఆందోళనలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల సానుకూలాంశం సూచీల భారీ పతనాన్ని అడ్డుకుంది'' అని జియోజిత్ ఫైనాన్స్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెప్టెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాల ప్రకటన(శనివారం)కు ముందు ప్రభుత్వరంగ ఎస్‌బీఐ బ్యాంక్ 2% లాభంతో రూ.585 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రెండున్నర శాతం ర్యాలీ చేసి రూ.588 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- అలెంబిక్ ఫార్మా షేరు ఎనిమిది శాతం లాభపడి రూ.659 వద్ద నిలిచింది. కెటోరోలాక్ ఇంజెక్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసేందుకు యూఎస్ ఎఫ్‌డీఏ నుంచి అనుమతులు లభించడం ఇందుకు కారణమైంది.

వొడాఫోన్ నష్టం రూ. 7,595 కోట్లు

న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో కూరుకుపోయిన టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా నష్టాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మరింతగా పెరిగాయి. రూ. 7,596 కోట్లకు చేరాయి. గత క్యూ2లో ఇవి రూ. 7,132 కోట్లు. అయితే, ఆదాయం మాత్రం సుమారు 13 శాతం పెరిగి రూ. 9,406 కోట్ల నుంచి రూ. 10,614 కోట్లకు చేరింది. యూజరుపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 19.5 శాతం పెరిగి రూ. 131కి చేరింది. సమీక్షాకాలంలో వొడాఫోన్ ఐడియా మొత్తం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 24 కోట్ల నుంచి 23.44 కోట్లకు తగ్గినప్పటికీ 4జీ యూజర్ల సంఖ్య 15 లక్షలు పెరిగి 12 కోట్లకు చేరింది. సెప్టెంబర్ 30 నాటికి కంపెనీ మొత్తం రుణ భారం (లీజులకు చెల్లించాల్సినది కాకుండా) రూ. 2,20,320 కోట్లకు చేరింది. ఇందులో స్పెక్ట్రం చెల్లింపులకు సంబంధించిన మొత్తం రూ. 1,36,650 కోట్లు (ఇటీవల కొన్న స్పెక్ట్రం కోసం కట్టాల్సిన రూ. 17,260 కోట్లు సహా), సవరించిన స్థూల ఆదాయ (ఏజీఆర్) లెక్కల కింద ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 68,590 కోట్లు ఉన్నాయి. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు రూ. 15,080 కోట్లు కట్టాలి.



ఫలితాల నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేరు 0.6 శాతం పెరిగి రూ. 8.6 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

రాఫెల్ నాదల్‌కు షాక్

స్పెయిన్ టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు మరోసారి పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ కలిసి రాలేదు. కెరీర్‌లో 36 మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ నెగ్గిన ప్రపంచ రెండో ర్యాంకర్ నాదల్ పారిస్ ఓపెన్‌లో మాత్రం ఒక్కసారి కూడా విజేతగా నిలువలేకపోయాడు. ఈసారి అతను రెండో రౌండ్‌లోనే నిష్క్రమించాడు. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ ఆడిన నాదల్ 6–3, 6–7 (4/7), 1–6తో ప్రపంచ 31వ ర్యాంకర్ టామీ పాల్ (అమెరికా) చేతిలో ఓటమిపాలయ్యాడు. నాదల్‌కు 39,070 యూరోల (రూ. 31 లక్షల 59 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ప్రస్తుత నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్) పారిస్ ఓపెన్‌లో విజేతగా నిలిస్తే ఈ ఏడాదిని అతను నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగిస్తాడు. ఈ టోర్నీలో అల్‌కరాజ్ క్వార్టర్ ఫైనల్ చేరాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6–1, 6–3తో దిమిత్రోవ్ (బల్గేరియా)పై గెలుపొందాడు.



మెరిసిన హర్ష, ప్రియాంక

ఆసియా చెస్ చాంపియన్‌షిప్‌లో రజత పతకాలు సొంతం





న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఆసియా కాంటినెంటల్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) నూతక్కి ప్రియాంక అదరగొట్టారు. గురువారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో ఓపెన్ విభాగంలో 22 ఏళ్ల హర్ష 6.5 పాయింట్లతో రెండో స్థానంలో... మహిళల విభాగంలో ప్రియాంక 6.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాలను సొంతం చేసుకున్నారు. అంతేకాకుండా వచ్చే ఏడాది జరిగే చెస్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్ విభాగంలో భారత్‌కే చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద 7 పాయింట్లతో... మహిళల విభాగంలో భారత్‌కే చెందిన పీవీ నందిధా 7.5 పాయింట్లతో చాంపియన్స్‌గా అవతరించారు. ఓపెన్ విభాగంలో టాప్–4 ప్లేయర్లు, మహిళల విభాగంలో టాప్–2 క్రీడాకారిణులు వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించారు.

గురువారం జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో భారత్‌కే చెందిన కార్తీక్ వెంకటరామన్‌తో తలపడిన 22 ఏళ్ల హర్ష భరతకోటి 14 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఆధిబన్‌తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 63 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత హర్షతోపాటు ఆధిబన్, నారాయణన్, వొఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), సేతురామన్, కార్తీక్ వెంకటరామన్ 6.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా హర్ష రెండో ర్యాంక్‌లో, ఆధిబన్ మూడో ర్యాంక్‌లో, నారాయణన్ నాలుగో ర్యాంక్‌లో, వొఖిదోవ్ ఐదో ర్యాంక్‌లో, సేతురామన్ ఆరో ర్యాంక్‌లో, కార్తీక్ ఏడో ర్యాంక్‌లో నిలిచారు. ఈ టోర్నీలో హర్ష అజేయంగా నిలిచాడు. నాలుగు గేముల్లో గెలిచిన అతను మిగతా ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు.

మహిళల విభాగంలో విజయవాడకు చెందిన 20 ఏళ్ల ప్రియాంక చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో 47 ఎత్తుల్లో భారత్‌కే చెందిన పద్మిని రౌత్‌ను ఓడించింది. ప్రియాంకతోపాటు దివ్య దేశ్‌ముఖ్ (భారత్), వో థి కిమ్ ఫుంగ్ (వియత్నాం) 6.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ప్రియాంకకు రజతం, దివ్య దేశ్‌ముఖ్‌కు కాంస్యం లభించాయి. ఈ టోర్నీలో ప్రియాంక ఆరు గేముల్లో గెలిచి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మరో రెండు గేముల్లో ఓటమి చవిచూసింది.

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

పారిస్: పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీ శుభారంభం చేసింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో బోపన్న–మిడిల్‌కూప్ ద్వయం 6–4, 7–5తో సిమోన్ బొలెలీ–ఫాబియో ఫాగ్‌నిని (ఇటలీ) జంటపై గెలిచింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ ఐదు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్)లతో బోపన్న–మిడిల్‌కూప్ తలపడతారు.



పాక్ ఆశలు సజీవం

- దక్షిణాఫ్రికాపై 33 పరుగులతో గెలుపు
- షాదాబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- టి20 ప్రపంచకప్ టోర్నీ

ఈ ప్రపంచకప్‌లో సూపర్–12 ఆఖరి మజిలీ రసవత్తరం అవుతోంది. గ్రూప్–2లో దక్షిణాఫ్రికా ఓటమి పాకిస్తాన్‌కే కాదు... బంగ్లాదేశ్‌కూ ఊపిరిలూదింది. దీంతో గ్రూప్–1లాగే '2'లో కూడా ప్రధాన జట్లన్నీ సెమీఫైనల్ రేసులో ఉన్నాయి. మొత్తం మీద నాలుగు సెమీస్ బెర్తుల కోసం తొమ్మిది జట్లు పోటీలో ఉండటం విశేషం. గ్రూప్–1లో న్యూజిలాండ్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, ఐర్లాండ్... గ్రూప్–2లో భారత్, దక్షిణాఫ్రికా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లు సై అంటే సై అంటున్నాయి. గ్రూప్–2 నుంచి సెమీఫైనల్ చేరే రెండు జట్లేవో ఆదివారం ఒకే రోజున జరిగే మూడు మ్యాచ్‌లు ముగిసిన తర్వాతే (దక్షిణాఫ్రికా–నెదర్లాండ్స్; పాకిస్తాన్–బంగ్లాదేశ్; భారత్–జింబాబ్వే) తేలనుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంటుంది. ఒకవేళ నెదర్లాండ్స్ చేతిలో దక్షిణాఫ్రికా ఓడిపోతే మాత్రం ఆ జట్టు నిష్క్రమిస్తుంది. బంగ్లాదేశ్‌పై పాకిస్తాన్ నెగ్గినా ఆ జట్టు సెమీఫైనల్ బెర్త్ భారత్–జింబాబ్వే మ్యాచ్ ముగిశాకే ఖరారవుతుంది.



సిడ్నీ: భారత్‌తో గొప్పగా పోరాడి ఓడిన జట్టు పాకిస్తాన్. జింబాబ్వే చేతిలో చెత్తగా ఓడిన జట్టు పాకిస్తాన్. ముందుకెళ్లే అవకాశాల్ని అత్యంత క్లిష్టం చేసుకున్న జట్టు పాకిస్తానే! ఇంతటి ఒత్తిడిలో కూరుకుపోయిన ఆ జట్టు పటిష్టమైన దక్షిణాఫ్రికాపై ఏం గెలుస్తుందనే విమర్శలు ఇంటాబయట ఉక్కిరిబిక్కిరి చేశాయి. కానీ 'ఆల్‌రౌండ్ షో'తో సఫారీని కంగుతినిపించిన పాక్... ఒక్క విజయంతో రేసులోకి దూసుకొచ్చింది. గ్రూప్–2 సెమీస్ ముఖచిత్రాన్నీ మార్చింది. టి20 ప్రపంచకప్‌లో గురువారం జరిగిన గ్రూప్–2 'సూపర్–12' మ్యాచ్‌లో పాక్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 33 పరుగులతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట పాక్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 185 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షాదాబ్ ఖాన్ (22 బంతుల్లో 52; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇఫ్తికార్ (35 బంతుల్లో 51; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. నోర్జే 4 వికెట్లు తీశాడు. తర్వాత వర్షం వల్ల దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 14 ఓవర్లలో 142 పరుగులుగా సవరించారు. కానీ దక్షిణాఫ్రికా 9 వికెట్ల నష్టానికి 108 పరుగులే చేసి ఓడింది. కెప్టెన్, ఓపెనర్ బవుమా (19 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. షాహిన్ అఫ్రిది (3/14) పేస్‌తో, షాదాబ్ ఖాన్ (2/16) స్పిన్‌తో జట్టును గెలిపించి రేసులో నిలబెట్టారు.

ఆరంభంలో తడబడి...

పాక్ బ్యాటింగ్‌కు దిగిన తొలి ఓవర్లోనే రిజ్వాన్ (4) అవుటయ్యాడు. పవర్ ప్లేలో కెప్టెన్ బాబర్ ఆజమ్ (6)తో పాటు జోరుమీదున్న హారిస్ (11 బంతుల్లో 28; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) వికెట్లను కోల్పోయింది. మరో 3 బంతుల వ్యవధిలో షాన్ మసూద్ (2) ఆట ముగిసింది. 43/4... ఇదీ పాక్ స్కోరు. ఇలాంటి దశలో 150 స్కోరే గగనం. కానీ ఇఫ్తికార్ అహ్మద్, నవాజ్ (22 బంతుల్లో 28; 4 ఫోర్లు, 1 సిక్స్) పట్టుదల పాక్ దిశను మార్చితే... షాదాబ్ సిక్సర్ల ఉప్పెన దక్షిణాఫ్రికా పాలిట భారీలక్ష్యాన్ని నిర్దేశించేలా చేసింది. ఇఫ్తికార్, షాదాబ్ ఆరో వికెట్‌కు 5.5 ఓవర్లలోనే 82 పరుగులు జోడించడం విశేషం. ఆఖరి 8 బంతుల్లో పాక్ 4 వికెట్లను కోల్పోయింది. లేదంటే 200 స్కోరు నమోదయ్యేది.

సఫారీకి ఆది నుంచే...

పెద్ద లక్ష్యం ఎదురైన సఫారీ జట్టు 16 పరుగులకే కీలకమైన డికాక్ (0), రోసో (7) వికెట్లను కోల్పోయింది. బవుమా, మార్క్‌రమ్ (14 బంతుల్లో 20; 4 ఫోర్లు) ధాటిగా ఆడటంతో కోలుకున్నట్లే కనిపించిన సఫారీని స్పిన్‌తో షాదాబ్ చావుదెబ్బ తీశాడు. ఒకే ఓవర్లో ఇద్దరిని అవుట్ చేయడంతో 66 పరుగుల వద్ద 4 వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. తర్వాత వర్షం పడటంతో లక్ష్యాన్ని మార్చగా, బ్యాటింగ్ కొనసాగించిన సఫారీ పాకిస్తాన్ బౌలర్ల పట్టుదలకు తలవంచింది. నసీమ్ షా (1/19), హారిస్ రవూఫ్ (1/44), మొహమ్మద్ వసీమ్ (1/13) తలా ఒక దెబ్బ కొట్టడంతో చిత్రంగా 9 పరుగుల వ్యవధిలో 5 వికెట్లను కోల్పోయింది. 94/4 నుంచి 103/9 స్కోరుకు పడిపోయి ఓటమిని ఆహ్వానించింది.

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్–2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
భారత్	4	3	1	0	6	0.730
దక్షిణాఫ్రికా	4	2	1	1	5	1.441
పాకిస్తాన్	4	2	2	0	4	1.117
బంగ్లాదేశ్	4	2	2	0	4	-1.276
జింబాబ్వే	4	1	2	1	3	-0.313
నెదర్లాండ్స్	4	1	3	0	2	-1.233

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X ఐర్లాండ్ (ఉ.గం. 9:30 నుంచి)
ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్ (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

సాత్విక్ జోడీ ముందంజ



సార్‌బ్రుకెన్ (జర్మనీ): హైలో ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 22–24, 21–15, 21–11తో రోరీ ఈస్టన్–జాక్ రస్ (ఇంగ్లండ్) జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రిసా జాలీ (భారత్) ద్వయం 21–18, 21–19తో జిలీ డెబోరా–చెర్లీ సీనెన్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ (భారత్) 15–21, 21–14, 21–13తో లూ గ్వాంగ్ జు (చైనా)పై కష్టపడి గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో భారత ప్లేయర్ మాళవిక క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)తో జరిగిన మ్యాచ్‌లో మాళవిక తొలి గేమ్‌ను 24–22తో సొంతం చేసుకొని, రెండో గేమ్‌లో 19–7తో ఆధిక్యంలో ఉన్నదశలో గిల్మోర్ గాయం కారణంగా వైదొలిగింది.

ఫైనల్లో హిమాచల్, ముంబై

కోల్‌కతా: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో హిమాచల్ ప్రదేశ్, ముంబై జట్లు తొలిసారి ఫైనల్లోకి దూసుకొచ్చాయి. ఈడెన్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో హిమాచల్ ప్రదేశ్ 13 పరుగుల ఆధిక్యంతో పంజాబ్‌పై... ముంబై ఐదు వికెట్ల తేడాతో విదర్భపై గెలుపొందాయి. ఫైనల్ శనివారం జరుగుతుంది. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత హిమాచల్ జట్టు 7 వికెట్లకు 176 పరుగులు సాధించింది. సుమీత్ వర్మ (25 బంతుల్లో 51; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 163 పరుగులు చేసి ఓడింది. హిమాచల్ జట్టు కెప్టెన్ రిషి ధావన్ మూడు వికెట్లు పడగొట్టాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో విదర్భ 20 ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులు చేయగా... ముంబై 16.5 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసి గెలిచింది. శ్రేయస్ అయ్యర్ (44 బంతుల్లో 73; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడి ముంబై విజయంలో కీలకపాత్ర పోషించాడు.



గుంటూరు జిల్లా రాయపూడిలో సంక్షేమ కరపత్రాలను అందజేస్తున్న తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



అనంతపురం జిల్లా గుంతకల్లులో వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ఊరూరా అదే జోరు

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. అన్ని జిల్లాల్లో గురువారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజాప్రతినిధులను ప్రజలు దీవిస్తున్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



శ్రీకాకుళం జిల్లా పాతటెక్కలిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



ప్రకాశం జిల్లా బేస్తవారిపేటలో పథకాల లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాజమహేంద్రవరం వద్ద అస్సాగో బయో ఇథనాల్ ప్లాంట్

రూ.270 కోట్లతో రోజుకు 200 కేఎల్‌పీడీ సామర్థ్యంతో ఏర్పాటు

- 20 ఎకరాల్లో ఏర్పాటవుతున్న ఈ యూనిట్ ద్వారా 500 మందికి ఉపాధి
- నేడు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన
- 2024 నాటికి ఉత్పత్తి ప్రారంభించే విధంగా కంపెనీ ప్రణాళిక
- బియ్యం నూకలు, చెరుకు, వేరుశనగ, జొన్నల నుంచి ఇథనాల్ ఉత్పత్తి
- కోటిలీటర్ల ఇథనాల్ వినియోగంతో తగ్గనున్న 20 వేల టన్నుల కర్బన ఉద్గారాలు



ప్లాంట్ ఏర్పాటుకు కేటాయించిన స్థలం

సాక్షి, అమరావతి: ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రంలో బయో ఇథనాల్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. ఇందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి వద్ద సుమారు రూ.270 కోట్లతో అస్సాగో ఇండస్ట్రీస్ ఏర్పాటుచేస్తున్న బయో ఇథనాల్ యూనిట్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. రాజమహేంద్రవరానికి సమీపంలోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్‌లో 20 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ యూనిట్ ద్వారా రోజుకు 200 కిలోలీటర్ల బయో ఇథనాల్ ఉత్పత్తి అవుతుంది. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 100 మందికి, పరోక్షంగా 400 మందికి ఉపాధి లభించనుంది. ముడిచమురు దిగుమతుల బిల్లును తగ్గించుకోవడంతోపాటు హరిత ఇంధన వినియోగం పెంచడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న లక్ష్యంగా 2025–26 నాటికి ప్రతి లీటరు పెట్రోల్‌లో 20 శాతం బయో ఇథనాల్ మిశ్రమం కలపడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం లీటరు పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం సగటున 8.41 శాతంగా ఉంది. కోటిలీటర్ల ఇథనాల్‌ను వినియోగించడం ద్వారా 20 వేల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతున్నట్లు అనేక పరిశీలనల్లో వెల్లడైంది. ఒక్కసారిగా కేంద్ర ప్రభుత్వం భారీ లక్ష్యాలను నిర్దేశించడంతో అనేక సంస్థలు ఈ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. భూ కేటాయింపుల దగ్గర నుంచి అన్ని అనుమతులు త్వరితగతిన మంజూరు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ చూపిందని, ఈ పెట్టుబడుల ద్వారా హరిత పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని అస్సాగో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్ గుర్నానీ తెలిపారు. భవిష్యత్‌లో ప్రత్యామ్నాయ ఇంధన కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యూనిట్ ద్వారా 500 మందికి ఉపాధి లభించడమే కాకుండా వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రైతులకు అదనపు ప్రయోజనం లభిస్తుందని చెప్పారు. పాడైపోయిన ఆహారధాన్యాలు, నూకలు, వ్యవసాయ ఉత్పత్తుల అవశేషాలు వినియోగించి ఇథనాల్‌ను తయారు చేయడం ద్వారా రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు.

సీఎం జగన్ పర్యటన ఇలా..

తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డిలో అస్సాగో ఇండస్ట్రీస్ ఏర్పాటుచేస్తున్న బయో ఇథనాల్ యూనిట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరతారు. 10.30 గంటలకు గుమ్మళ్ళదొడ్డి చేరుకుంటారు. 10.45 గంటల నుంచి 11.40 గంటల వరకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తిరుగుప్రయాణం అవుతారు.

ఇథనాల్ తయారీకి ముందుకొచ్చిన సంస్థలు

సంస్థ	పెట్టుబడి (రూ.కోట్లల్లో)
క్రిభ్‌కో	560
ఐఓసీ	600
అస్సాగో	270
ఎకో స్టీల్	280
సెంటిని	130
డాల్వకోట్	84
ఈఐడీ ప్యారీ	93

బయో ఇథనాల్‌లో రూ.2,017 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో బయో ఇథనాల్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి అనేక కంపెనీలు ముందుకొస్తున్నాయి. అస్సాగోతో పాటు క్రిభ్‌కో, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎకో స్టీల్, సెంటిని, డాల్వకోట్, ఈఐడీ ప్యారీ వంటి సంస్థలు కలిపి సుమారు రూ.2,017 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. హరిత ఇంధనానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రత్యేకంగా బయో ఇథనాల్ పాలసీని రూపొందిస్తోంది. ఇప్పటికే ముసాయిదా పాలసీ తయారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్య కంపెనీల సూచనలు, సలహాలు తీసుకుని త్వరలోనే పాలసీని విడుదల చేయనుంది. దీనిద్వారా బయో ఇథనాల్ తయారీలో దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలుస్తుందన్న ఆశాభావం ఉంది.

క్లుప్తంగా

ఆధునిక సౌకర్యాలతో నెల్లూరు, వైజాగ్, తిరుపతి రైల్వేస్టేషన్లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా 40 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులను కేంద్రం వేగవంతం చేసిందని రైల్వే శాఖ తెలిపింది. ఇందులో ఏపీలోని నెల్లూరు, వైజాగ్, తిరుపతి రైల్వేస్టేషన్‌లు ఉన్నాయని, ఈ స్టేషన్‌ల్లో ఆధునిక సౌకర్యాల ఏర్పాటు పనులు వేగంగా కొనసాగుతున్నాయని గురువారం ప్రకటన విడుదల చేసింది. పునరాభివృద్ధి పనుల్లో భాగంగా ఆయా స్టేషన్‌ల్లో విశాలమైన రూఫ్ ప్లాజా, ఫుడ్ కోర్ట్, వెయిటింగ్ లాంజ్, పిల్లల ఆట స్థలం, స్థానిక ఉత్పత్తుల కోసం నిర్దేశించిన స్థలం వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు వెల్లడించింది. వివిధ రకాల రవాణా మార్గాలను రైల్వేస్టేషన్‌తో అను సంధానించడంతో పాటు, దివ్యాంగుల సౌకర్యాలను మెరుగుపరుస్తుందని వివరించింది.

అభ్యంతరాల స్వీకరణకు నేడు ఆఖరు

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర యూజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రాథమిక మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు గడువు శుక్రవారం సాయంత్రం ముగియనుంది. రాష్ట్రంలోని మెడికల్, డెంటల్, ఆయుష్ కళాశాలల్లో 2022–23వ విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన విషయం తెలిసిందే. విద్యార్థులు తమ అభ్యంతరాలను తగిన ధ్రువీకరణపత్రాలతో ysrugmedadm22@gmail.comకు పంపాలి.

వీశాట్-2023 నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్ తదితరులు

చేబ్రోలు: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ వర్సిటీలో వీశాట్-2023 నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్‌ఎల్‌బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ, బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లీష్, పీహెచ్‌డీ అడ్మిషన్ల (వీశాట్–2023) నోటిఫికేషన్‌ను వర్సిటీ వీసీ నాగభూషణ్ విడుదల చేశారు. బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు 75% వరకు స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉందని తెలిపారు. వర్సిటీ డీన్ (అడ్మిషన్) కృష్ణకిషోర్ మాట్లాడుతూ..వీశాట్ దరఖాస్తులు వర్సిటీ వెబ్‌సైట్‌లో, అన్ని విజ్ఞాన్ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. 2023 మార్చి 1 నుంచి ఏప్రిల్ 30 వరకు ఏపీ, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. దరఖాస్తును ఫిబ్రవరి 25లోగా పూర్తి చేయాలన్నారు. వీశాట్‌లో ర్యాంకులు సాధించిన వారికి, ఇంటర్ మార్కులు, జేఈఈ, మెయిన్స్, ఎంసెట్ ర్యాంకుల ఆధారంగానూ ఫీజు రాయితీ ఉంటుందన్నారు. వీశాట్ పరీక్ష రాసిన వారికి బీటెక్ సీట్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. గతేడాది ప్రతిభావంతులైన విద్యార్థులకు మొత్తం అన్ని కోర్సుల్లో రూ.4 కోట్లకు పైగా ఫీజు రాయితీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. ఇతర గురుకులాల్లో లేని విధంగా ఎస్సీ గురుకులాల్లోని విద్యార్థులకు విద్య, వైద్యం, ఆరోగ్యం మెరుగుదల కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలపై ఆయన గురువారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్ ఆదేశాలతో చేపట్టిన కార్యక్రమాలను మంత్రి వివరించారు. అజీం ప్రేమ్ జీ యూనివర్సిటీ, టీసీఎస్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, టీసీఎస్, ఈ విద్యాలోక్, వాయిస్ ఫర్ గర్ల్స్ వంటి ప్రముఖ సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు.

శాశ్వత భూసర్వే కోసం పెద్ద ఎత్తున సర్వేరాళ్ల తయారీ

- రాష్ట్రవ్యాప్తంగా 2 వేల గ్రానైట్ పరిశ్రమలకు ఆర్డర్లు
- ఆ పరిశ్రమదారులకు సకాలంలో బిల్లుల చెల్లింపు
- బిల్లుల చెల్లింపులు జరగడం లేదనే వార్తలు నిరాధారం
- గతంలో మూతపడిన అనేక గ్రానైట్ పరిశ్రమలకు వరంగా సర్వేరాళ్ల తయారీ
- ఉత్సాహంగా ముందుకొస్తున్న పరిశ్రమ నిర్వాహకులు.. వేలాదిమందికి ఉపాధి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మొదటిసారిగా శాస్త్రీయ పద్ధతుల్లో జరుగుతున్న జగనన్న భూహక్కు భూరక్ష పథకం కోసం పెద్ద ఎత్తున సర్వే రాళ్లను గనులశాఖ సమకూరుస్తోందని ఏపీఎండీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని రెండువేల గ్రానైట్ పరిశ్రమల్లో సర్వేరాళ్లు తయారుచేస్తున్నారని వెల్లడించారు. గతంలో ఆర్డర్లు లేక, ఆర్థికంగా చితికిపోయి మూతపడిన వేలాది గ్రానైట్ పరిశ్రమలకు ప్రభుత్వం సర్వేరాళ్ల తయారీ ఆర్డర్ ఇవ్వడంతో ఆ పరిశ్రమలకు తిరిగి జీవం వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గ్రానైట్ పరిశ్రమకు మంచి రోజులు రావాలని ప్రభుత్వపరంగా అనేక రాయితీలు ప్రకటించారని, స్లాబ్ విధానాన్ని కూడా అమల్లోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. దానికి అదనంగా సర్వేరాళ్ల తయారీని కూడా పరిశ్రమ నిర్వాహకులకు అప్పగించడం ద్వారా వారికి మరింత పనికల్పించారని పేర్కొన్నారు.

సర్వేరాళ్లు గమ్యానికి చేరుకున్న వెంటనే బిల్లుల చెల్లింపు

ముడిసరుకును గ్రానైట్ పరిశ్రమలకు అందించి, వారినుంచి నిర్దేశిత నమూనాలో సర్వేరాళ్లను తయారు చేయిస్తున్నామని తెలిపారు. సిద్ధమైన రాళ్ల నాణ్యతాప్రమాణాలను పరీక్షించి, వాటిని సూచించిన గమ్యస్థానానికి చేర్చిన వెంటనే గ్రానైట్ పరిశ్రమలకు బిల్లులు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క పరిశ్రమకు కూడా బిల్లుల బకాయిలు లేవని స్పష్టం చేశారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకుల్లో ఆందోళన అంటూ పత్రికల్లో వచ్చిన వార్త పూర్తిగా అసత్యమని, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు.

ఒక్కో సర్వేరాయికి రూ.300

గతంలో సిద్ధం చేసిన ఒక్కో సర్వేరాయికి ప్రభుత్వం రూ.270 చెల్లించేదని, దాన్ని ఇప్పుడు రూ.300కు పెంచామని అధికారులు తెలిపారు. దీంతో మరింత ఎక్కువమంది ఆర్డర్లు కావాలని ఉత్సాహంగా ముందుకొస్తున్నారన్నారు. సర్వేరాళ్ల తయారీ, విక్రయాలు, రవాణా అంశాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా యాప్ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ యాప్‌లో అన్ని వివరాలు ఉంటాయని, గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు కూడా దీన్లో లాగిన్ అయి తాము విక్రయించిన సర్వేరాళ్లకు బిల్లుల చెల్లింపులు ఎలా జరుగుతున్నాయో ఎప్పటికప్పుడు చూసుకునే అవకాశం కల్పించామని వివరించారు. సర్వేరాళ్ల తయారీలో గ్రానైట్ యజమానులపై ఆర్థికంగా భారం పడకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సర్వేరాళ్లకు అవసరమైన బ్లాక్‌లను స్వయంగా గ్రానైట్ పరిశ్రమ యజమానులకు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. కేవలం ఆ రాయిని సర్వేరాళ్లుగా తీర్చిదిద్దడం వరకే గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకుల బాధ్యత అని తెలిపారు. ఇది పూర్తిచేసిన వెంటనే వారికి బిల్లులు చెల్లిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సుబాబుల్, యూకలిప్టస్ రైతులకు శుభవార్త

టన్నుకు రూ.200 పెంచేందుకు పేపర్ మిల్లుల అంగీకారం



ఉత్పత్తులను విడుదల చేస్తున్న మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: సుబాబుల్, యూకలిప్టస్ రైతులకు గిట్టుబాటు ధర చెల్లించేందుకు పేపర్ మిల్లుల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. ప్రస్తుతం చెల్లిస్తున్న ధరపై టన్నుకు కనీసం రూ.200 పెంచేందుకు కంపెనీల ప్రతినిధులు అంగీకరించారు. సుబాబుల్, యూకలిప్టస్ రైతులకు గిట్టుబాటు ధర కల్పనపై పేపర్ మిల్లుల ప్రతినిధులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గురువారం సచివాలయంలో చర్చలు జరిపారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ గిట్టుబాటు ధర విషయంలో సుబాబుల్, యూకలిప్టస్ రైతులకు పేపర్ మిల్లుల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. దీనిపై పేపర్ మిల్లుల ప్రతినిధులు స్పందిస్తూ టన్నుకు కనీసం రూ.200 నుంచి సాధ్యమైనంత ఎక్కువ పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులకే నేరుగా డబ్బులను చెల్లించాలని కంపెనీల ప్రతినిధులను మంత్రి ఆదేశించారు. వ్యయసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ కె.లక్ష్మీభాయి, ఐటీసీ ప్రతినిధి గోబల కన్నన్, ఆంధ్రా పేపర్ మిల్స్ (రాజమండ్రి) ప్రతినిధి కె.బాలకృష్ణ, సిర్పూర్ పేపర్ మిల్స్ ప్రతినిధి ఎస్ఎస్ కన్నబాబు, గుజరాత్ పేపర్ మిల్స్ ప్రతినిధులు టీఎస్ భగవాన్, వై.రుషికేశ్వరరావు, బీఐఎల్‌టీ ప్రతినిధి జీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

మరో మూడు సేంద్రియ ఉత్పత్తులు

మార్క్‌ఫ్ బ్రాండ్ పేరుతో కొత్తగా మరో మూడు రకాల సేంద్రియ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. ఇప్పటికే మార్క్‌ఫ్ ద్వారా 17 రకాల సేంద్రియ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురాగా... తాజాగా సేంద్రీయ బెల్లం, వేరుశనగపప్పు, పచ్చిశనగపప్పును కూడా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

మార్కెట్‌లోకి కొత్తగా 7 వంగడాలు

రైతులకు కొత్తగా మరో ఏడు వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. వరిలో 4, పత్తిలో 2, రాగి/చోడిలలో ఒకటి చొప్పున ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ పరిశోధనా కేంద్రాలు అభివృద్ధి చేశాయి. రెండు నెలల కిందట రాష్ట్రస్థాయిలో 10వంగడాలను విడుదల చేయగా, తాజాగా మరో 7 వంగడాలు జాతీయస్థాయిలో వినియోగించుకునేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆమోద ముద్ర వేసింది.

పొదుపుసొమ్ము స్వాహా కేసులో టీడీపీ నేత అరెస్ట్

- రూ.31,83,097కు పైగా అవినీతి జరిగినట్లు మున్సిపల్ అధికారుల ఫిర్యాదు
- టీడీపీ ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షురాలు, భర్త, కుమార్తె అరెస్ట్



నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేస్తున్న డీఎస్పీ వాసుదేవన్

ప్రొద్దుటూరు క్రైం/ప్రొద్దుటూరు: పొదుపు సంఘం డబ్బు స్వాహా కేసులో టీడీపీ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షురాలు భోగాల లక్ష్మీనారాయణమ్మ, ఆమె భర్త చంద్రశేఖర్‌రెడ్డి, కుమార్తె లలితలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బంగారులక్ష్మి సమాఖ్య పరిధిలోని 30 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.31,83,097కు పైగా అవినీతి జరిగినట్లు మున్సిపల్ అధికారులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఖాతాల్లో అవకతవకలు జరిగాయని, రూ.30 లక్షలకు పైగా డబ్బు స్వాహాచేశారని మహిళలు గతనెలలో లక్ష్మీనారాయణమ్మ ఇంటిముందు ధర్నా చేశారు. ధర్నా చేస్తున్న తమపై లక్ష్మీనారాయణమ్మ కుటుంబసభ్యులు దాడి చేశారని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. తమను మోసం చేసిన లక్ష్మీనారాయణమ్మకు మద్దతుగా మాట్లాడుతున్నారంటూ మహిళలు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇంటిముందు ధర్నా చేశారు. వారిపై టీడీపీ నేతలు దాడికి ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు లక్ష్మీనారాయణమ్మ వద్ద ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకుని మున్సిపల్ అధికారులకు అప్పగించారు. విచారణ అనంతరం రూ.31,83,097కు పైగా అవినీతి జరిగినట్లు తేలిందని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు.

మహిళల ఆత్మగౌరవ దీక్ష విరమణ

డ్వాక్రా మహిళలకు కుచ్చుటోపీ పెట్టిన టీడీపీ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షురాలు భోగాల లక్ష్మీనారాయణమ్మ, ఆమె భర్త చంద్రశేఖర్‌రెడ్డి, కుమార్తె లలితలను అరెస్ట్ చేయాలంటూ వారం రోజులుగా కొనసాగుతున్న 'ప్రొద్దుటూరు మహిళల ఆత్మగౌరవ దీక్ష'ను గురువారం విరమించారు. దీక్ష చేస్తున్న మహిళలకు కడప దిశ డీఎస్పీ వాసుదేవన్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. చివరిరోజు దీక్షలో సోములవారిపల్లె సర్పంచ్ మోపూరి ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యురాలు బాలగుర్రమ్మ, మాజీ కౌన్సిలర్లు వుట్టి రమణమ్మ, రమాదేవి, మాజీ సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధ్యక్షురాలు గజ్జల కళావతి కూర్చున్నారు. ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కోనేటి సునంద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ తవ్వకాలపై సర్వే

తదుపరి విచారణ డిసెంబర్ 14కి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖలోని రుషికొండ రిసార్ట్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా చేపట్టిన తవ్వకాల విషయంలో సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ(ఎంవోఈఎఫ్)ను హైకోర్టు గురువారం ఆదేశించింది. ఇందుకోసం బాధ్యతాయుతమైన అధికారి నేతృత్వంలో ఓ బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించింది. రిసార్ట్ పునరుద్ధరణ ప్రాజెక్టు పనుల పురోగతి వివరాలతో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)ను ఆదేశిస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 14కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ దాఖలు చేసిన వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది.

రాజకీయ ప్రయోజన వ్యాజ్యాలు...

ఏపీఎండీసీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రాజెక్టు పనుల్లో భాగంగా తొలగించిన చెట్ల స్థానంలో కొత్తవి నాటుతున్నామని, అది భారీ స్థాయిలో చేపట్టామని వివరించారు. ఈ వ్యాజ్యాలు దాఖలు చేసిన పిటిషనర్లు రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులన్నారు. ప్రజాప్రయోజన వ్యాజ్యాల్లో పిటిషనర్ల చిత్తశుద్ధి, నిజాయితీని చూడాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ దురుద్దేశాలతో ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ పిల్ దాఖలు చేసే ప్రతి వ్యక్తి ఏదో ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగానే ఉంటారని వ్యాఖ్యానించింది. పిటిషనర్ మూర్తి యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు.

గిరిజన ఉప ప్రణాళిక మరో పదేళ్లు పొడిగించాలి

సాక్షి, అమరావతి: గిరిజన ఉప ప్రణాళిక గడువు ముగుస్తుండటంతో మరో పదేళ్ల పాటు ఆ చట్టాన్ని పొడిగించాలని ఏపీ గిరిజన సలహా మండలి సమావేశం తీర్మానించింది. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అధ్యక్షతన 113వ సలహా మండలి సమావేశం విజయవాడలోని గిరిజన సంక్షేమ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలిలా ఉన్నాయి.. షెడ్యూల్డ్ ప్రాంతానికి వెలుపల ఉన్న గిరిజన గ్రామాలను విలీనం చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సమావేశం నిర్ణయించింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో కొనసాగుతున్న మైనింగ్ కార్యకలాపాలు పంచాయతీల వారీగా జాబితా రూపొందించి.. ఎంతెంత ఆదాయం పంచాయతీలకు సమకూరుతుందనే వివరాలు తెలియజేయాలని మైనింగ్ శాఖ అధికారులను సమావేశం కోరింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గిరిజనుల అవసరాల కోసం వాగుల్లో సేకరిస్తున్న ఇసుక విషయంలో ఇబ్బంది పెట్టొద్దని, వాటి విషయంలో స్పష్టమైన ఆదేశాలు కింది స్థాయి అధికారులకు పంపాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి ఐటీడీఏ ఏర్పాటుకు నిర్ణయించింది. సమావేశంలో ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, తెల్లం బాలరాజు, వి.కళావతి, చెట్టి ఫల్గుణ, కె.భాగ్యలక్ష్మి, ఎస్.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్‌ల నమోదుకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల్లో 2022–23 విద్యా సంవత్సరానికి యాజమాన్య కోటా సీట్లలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం సాయంత్రం ఆరు గంటల నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు ఆప్షన్ల నమోదుకు తుది గడువు.https://pgmq.ntruhsadmissions.com/ వెబ్‌సైట్ ద్వారా వెబ్‌ఆప్షన్లను అభ్యర్థులు నమోదు చేసుకోవచ్చు.

సీఎస్ సమీర్‌శర్మకు అస్వస్థత

నేడు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్‌శర్మ గురువారం అస్వస్థతకు గురికావడంతో తాడేపల్లిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. గురువారం సచివాలయంలో ఒక సమావేశంలో ఉండగా ఆయనకు ఛాతీ నొప్పి వచ్చింది. స్థానిక వైద్యాధికారి పరీక్షించిన అనంతరం ఆయన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆయన శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది.

ఈడీ ఆరోపణలపై కౌంటరు దాఖలు చేయండి

బీపీ ఆచార్యకు సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన ఆరోపణలపై కౌంటరు దాఖలు చేయాలని ఐఏఎస్ మాజీ అధికారి బీపీ ఆచార్యకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అధికారులపై అభియోగాలు నమోదు చేసే ముందు సీఆర్‌పీసీ సెక్షన్ 197 కింద ప్రభుత్వ అనుమతి తీసుకునే అంశంపై వైఖరి తెలియజేయాలని పేర్కొంది. ఐఏఎస్ అధికారులు బీపీ ఆచార్య, ఆదిత్యనాథ్ దాస్‌లపై ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను 2019లో తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను గురువారం సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించింది. కార్పొరేషన్‌లో పనిచేసే అధికారులపై అభియోగాలు నమోదుకు ప్రభుత్వ అనుమతి అవసరమా? ప్రాథమిక దశలోనే కేసు కొట్టివేయొచ్చా.. అనే అంశాలపై వాదనలు వినిపిస్తామని ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు తెలిపారు. ఆయా అధికారులు ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారు? కార్పొరేషన్‌లో పనిచేసే అధికారులేనా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అధికారులు ఇద్దరూ ఐఏఎస్‌లేనని, ప్రస్తుతం పదవీ విరమణ పొందారని న్యాయవాది తెలిపారు. అయితే, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ)లో ఆదిత్యనాథ్ దాస్ పనిచేయని కారణంగా ఆ పేరును ప్రతివాది జాబితా నుంచి తొలగిస్తున్నామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ ఐదో తేదీకి వాయిదా వేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.